

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



కుంభమేళాలో మరో అగ్నిప్రమాదం

15 గుడారాలు దగ్ధం.. తప్పిన ప్రాణనష్టం

బుధవారం నాటి తొక్కిసలాట నేపథ్యంలో వాహనాల రాకపోకలపై నిషేధం

వీవీఐపీ పాస్‌లు రద్దు చేసిన యోగి సర్కారు 2

శుక్రవారం | 31-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 286 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: విదియ మ. 1.59 తదుపరి తదియ; నక్షత్రం: శతభిషం తె. 4.14 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: మ. 12.33-2.03; దుర్ముహూర్తం: ఉ. 9.06-9.51, మ. 12.51-1.36; అమృతఘడియలు: రా. 9.31-11.00; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 6.06 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విశాఖ భూస్కామ్‌పై విచారణ



ఏమైంది?

అవి ఆషామాషీ కుంభకోణాలు కాదు! ఒకటీ, రెండూ కాదు! బంగారంకంటే విలువైన భూములున్న విశాఖ నగరాన్ని, జిల్లాను ఐదేళ్లు చెరబట్టారు. వైసీపీ సర్కారు పెద్దలు యథేచ్ఛగా దోచుకున్నారు. ప్రాజెక్టులు చేతులు మారాయి. వందల ఎకరాల భూములు వారి సొంతమయ్యాయి. విపక్షంలో ఉండగా... 'ఘోరం... నేరం... దారుణం' అని టీడీపీ నేతలు వాపోయారు. ఇప్పుడు అదే పార్టీ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతోంది! మరి... విశాఖ భూముల స్కామ్‌లో ఏం తేల్చారు? ఇది... కూటమి శ్రేణులే కాదు, రాష్ట్ర ప్రజలూ అడుగుతున్న ప్రశ్న!

అక్రమాలకు సమాధి కట్టేశారా!?

- అసలు అక్రమాలే లేవంటూ తొలి నివేదిక
- మళ్లీ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- ఈసారి 64 ఎకరాలతో యంత్రాంగం మమ
- వైసీపీ హయాంలో విచ్చలవిడిగా దోపిడీ
- విశాఖ, చుట్టుపక్కల భూముల స్వాధీనం
- నాడు చెలరేగిన ఉత్తరాంధ్ర పెద్దాయన
- పనిలోపనిగా కొందరు అధికారుల దందా
- వారిని కాపాడేందుకు నేడు కొందరి యత్నం
- విచారణ కమిటీలో 'సొంత మనుషులు'
- అక్రమాలే లేవంటూ క్లీన్‌చిట్



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ఉత్తరాంధ్ర వైసీపీ' పెద్దాయన... ఆయనకు 'జీ హుజూర్' అన్నట్లుగా పని చేసిన కొందరు అధికారులు కలిసి విశాఖ చుట్టూ పెద్ద ఎత్తున భూములు భోంచేశారు. రీ సర్వే పేరిట భూముల రికార్డులను తారుమారు చేశారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు ఖాతాలో చూపించారు. ఈనాం భూముల రికార్డులను తారుమారు చేశారు. మరోవైపు పేదలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములకు 20 ఏళ్ల గడువు తీరిన తర్వాత శాశ్వత హక్కులు కల్పిస్తామని జగన్ సర్కారు 2023 ఆగస్టులో చట్ట సవరణ చేసింది. దీనికి అనుగుణంగా జీవో 596 జారీ చేసింది. ఆ భూముల క్రయ, విక్రయాలకు అనుమతి ఇవ్వాలన్నది ప్రభుత్వం అసలు ఉద్దేశం. అసైన్డ్ చట్టసవరణ గురించి వైసీపీ నేతలకు ముందే తెలుసు. విలువైన అసైన్డ్, ఈనాం, ప్రభుత్వ భూములను చేజిక్కించుకునేందుకు కొందరు

మిగతా 14వ పేజీలో...

భూముల కొత్త ధరలు రేపటి నుంచి అమల్లోకి

గ్రామాల్లో 5 నుంచి 10 శాతం పెంపు 14



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను కలిసిన మెటా ఇండియా ఉపాధ్యక్షురాలు సంధ్య దేవనాథన్, డైరెక్టర్ రవి గార్గ్, మెటా స్ట్రాటజిక్ ప్రోగ్రామర్ దివ్య కెమనీ వధేరా

వాట్సాప్ పాలన

9552300009 నంబర్ కేటాయింపు

- 'మన మిత్ర' పేరుతో పౌర సేవలకు సరికొత్త వేదిక
- ప్రారంభించిన లోకేశ్.. 161 సేవలు అందుబాటులోకి
- భవిష్యత్తులో 500లకు పైగా ప్రభుత్వ సేవలు
- కుల ధ్రువీకరణ పత్రాలూ పొందవచ్చు.. సర్టిఫికెట్ల విశ్వసనీయతకు ధోకా లేదు.. నకిలీల్లేకుండా క్యూఆర్ కోడ్
- రియల్‌టైమ్‌లో సమస్యల పరిష్కారం
- పాదయాత్రలోని హామీని నెరవేరుస్తున్నా: మంత్రి లోకేశ్
- ప్రజల డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యం : సీఎం

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సాంకేతిక సహకారంతో దేశంలోనే తొలిసారిగా సరికొత్త పరిపాలనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-మన మిత్ర' పేరుతో వాట్సాప్ గవర్నెన్స్‌ను గురువారం మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. దీని కోసం ప్రభుత్వం అధికారికంగా 9552300009 అనే వాట్సాప్ నంబర్‌ను కేటాయించింది. మొదటి దశలో 161 సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. భవిష్యత్తులో 500పైగా ప్రభుత్వ సేవలను వాట్సాప్ ద్వారా పౌరులకు అందిస్తామని మంత్రి లోకేశ్

మిగతా 13వ పేజీలో...

1 అమెరికా వినువీధుల్లో ఘోర ప్రమాదం

విమానం, ఆర్మీ హెలికాప్టర్ ఢీ

67 మంది దుర్మరణం?

28 మృతదేహాల వెలికితీత

విమానం కూలిన పోటోమ్యాక్ నదిలో కొనసాగుతున్న గాలింపు చర్యలు



- వాషింగ్టన్‌లోని రొనాల్డ్ రీగన్ విమానాశ్రయంలో దిగబోతున్న విమానాన్ని ఢీకొట్టిన హెలికాప్టర్ 2
- పోటోమ్యాక్ నదిలో కూలిన విమానం, హెలికాప్టర్

వీసా గడువు ముగిసినా అమెరికాలోనే

- ఇదీ 7 వేల మంది భారతీయుల పరిస్థితి.. వీరిలో 2 వేల మంది విద్యార్థులు
- అమెరికా కాంగ్రెస్‌కు 'సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్' డైరెక్టర్ వాఘన్ నివేదిక
- ఇకపై 75 వేల హెచ్-1బీలే.. 2 ఏళ్ల కాలపరిమితి.. పొడిగింపు 4 ఏళ్లకే
- గ్రీన్‌కార్డు దరఖాస్తులకు ఆటోరెన్యువల్ వద్దు.. వాఘన్ ప్రతిపాదనలు 2
- నేర చరిత్ర ఉన్న అక్రమ వలసదారులను గ్వాంటనామో బేకు తరలిస్తాం: ట్రంప్



విశాఖలో కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మలకు గజమాలతో స్వాగతం. చిత్రంలో రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఎంపీ శ్రీభరత్ తదితరులు

'ఉక్కు'కు ఆర్థిక ప్యాకేజీ.. మోదీ బహుమతి ఇది! 14

చంద్రబాబు, లోకేశ్ 'ఉక్కు సంకల్పం'

- పలుమార్లు ఢిల్లీకి వచ్చి సాయం కోరారు
- హామీ నిలుపుకోవాలని పవన్ పట్టుదల
- సమష్టి కృషి వల్లే 11,440 కోట్ల నిధులు
- ఇది రాష్ట్ర నేతల చిత్తశుద్ధి ఫలితం
- ప్లాంట్‌ను నంబర్‌1 స్థానంలో నిలపాలి
- 3 నెలలు ఆగితే క్రమం తప్పకుండా జీతాలు
- ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి భరోసా

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకూడదని ఏపీ ప్రభుత్వం తీర్మానం చేసి పంపింది. చంద్రబాబు, లోకేశ్ అనేకసార్లు ఢిల్లీకి వచ్చి ప్లాంట్‌కు ఆర్థిక సాయం చేయాలని కోరారు. ఓసారి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అర్ధరాత్రి 1.30కి అపాయింట్‌మెంట్ ఇస్తే... చంద్రబాబు ఓపికగా వేచి ఉండి ఆమెను కలిసి మాట్లాడారు. అంతటి చిత్తశుద్ధి చూపించబట్టే విశాఖ ఉక్కుకు ఆర్థికప్యాకేజీ దక్కింది.

- కుమార స్వామి, కేంద్ర మంత్రి

₹44,776 కోట్ల పెట్టుబడులకు పచ్చజెండా

15 సంస్థల ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదం

- 19,980 మందికి నేరుగా ఉపాధి
- ఇప్పటివరకు 3 ఎస్ఐపీబీ భేటీల్లో 3.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఓకే
- ఏపీలో పెట్టుబడులకు ప్రఖ్యాత సంస్థల ఆసక్తి: సీఎం చంద్రబాబు
- పెట్టుబడుల ఆకర్షణలో పొరుగు రాష్ట్రాలతో భారీ పోటీ
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకోవాలి
- ఎస్ఐపీబీ భేటీలో అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు ఊతమిచ్చేలా కూటమి ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి 15 పారిశ్రామిక సంస్థల ప్రతిపాదనలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) ఆమోదం తెలిపింది. దీంతో కొత్తగా రూ. 44,776 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఆ పరిశ్రమల ద్వారా నేరుగా 19,980 మంది యువతకు ఉపాధి లభిస్తుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అధ్యక్షతన

మిగతా 13వ పేజీలో...



అన్నమయ్య జిల్లాలో వైసీపీ నేత రాంబాబురెడ్డి తన పేరిట ఆన్‌లైన్ చేయించుకున్న బండపల్లె గ్రామం సర్వే నంబరు 129లో ఉన్న పొత్తుకూరుపల్లె

'మండలి' కళ్లకు గంతలు

టీడీపీ ఎమ్మెల్సీల ప్రశ్నలకు 'రెవెన్యూ' తప్పుడు సమాచారం

- వైసీపీ హయాంలో అన్నమయ్య జిల్లాలో ఎన్నో ఆక్రమణలు
- అయినా అక్రమాలు లేవని తహశీల్దార్ల నివేదిక
- నాడు ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల ఆక్రమణ
- ఎస్సీ, ఎస్టీ, బీసీల భూములనూ వదలని వైనం
- ప్రజలు నివసిస్తున్న పల్లె వైసీపీ నేత పేరిట ఆన్‌లైన్
- చెరువును ఆక్రమించి, కాలువలు పూడ్చి వెంచర్
- వైసీపీ నాయకులకు సహకరించిన తహశీల్దార్లు
- రెవెన్యూ సదస్సుల్లో వేలాది ఫిర్యాదులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)

అన్నమయ్య జిల్లాలోని కొందరు తహశీల్దార్లు శాసనమండలి కళ్లకు గంతలు కడుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన భూ ఆక్రమణ దాష్టీకాలను సభ దృష్టికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. శాసనమండలిలో తెలుగుదేశం పార్టీకి చెందిన ముగ్గురు సభ్యులు అడిగిన ప్రశ్నకు తప్పుడు సమాధానం ఇచ్చారు. జగన్ జమానాలో ప్రభుత్వ భూములే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన భూములను వైసీపీ నాయకులు దోచుకున్నట్లు ఆధారాలు ఉన్నా.. తమ మండలాల్లో అసలు ఎలాంటి భూ అక్రమాలూ జరగలేదని

మిగతా 12వ పేజీలో...

కర్నూలుకు బెంచ్

- వేగంగా పడుతున్న అడుగులు
- భవనాల పరిశీలన చకచకా
- ప్రాధాన్యాలవారీగా జాబితా తయారీ
- అత్యవసరంగా నివేదిక పంపాలన్న హైకోర్టు రిజిస్ట్రార్ ఆదేశాలతో కదలిక
- తాత్కాలిక భవనాలు, శాశ్వత నిర్మాణాలకు భూమి కోసం వేట
- త్వరలోనే వివరాలు హైకోర్టుకు నివేదన
- 'మూడు' ముక్కలాటతో జగన్ మోసం
- కూటమి రాగానే బెంచ్‌పై తీర్మానం
- ప్రక్రియ ప్రారంభానికి హైకోర్టుకు సూచన



కర్నూలులోని క్లస్టర్ యూనివర్సిటీ భవనాలు.. హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తొలి ప్రాధాన్యం వీటికే..

కర్నూలు, అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. మొత్తం 15మంది హైకోర్టు న్యాయమూర్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, కోర్టు కాంప్లెక్స్, కోర్టు గదులు, సిబ్బంది గదులు, అడ్వకేట్లకు వసతి, న్యాయమూర్తులు, కోర్టు సిబ్బందికి నివాస సౌకర్యం, ఇతర సౌకర్యాలకు సంబంధించి పూర్తి వివరాలను సమర్పించాలని

మిగతా 14వ పేజీలో...



తిరుపతి జిల్లా మన్నవరం వద్ద ఎన్టీపీసీ-బెల్ పరిశ్రమకు నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ శంకుస్థాపన చేసిన ఫలకం

ఆ 590 ఎకరాలు వెనక్కి ఇవ్వండి 12

- 2009లో తిరుపతి జిల్లా మన్నవరం వద్ద ఎన్టీపీసీ-బెల్‌కు 620 ఎకరాల కేటాయింపు
- ఇందులో వినియోగించింది 30 ఎకరాలే.. మిగిలిన భూములు 15 ఏళ్లుగా నిరుపయోగం
- కొత్త పరిశ్రమలకు ఇవ్వాలని సర్కారు యోచన. ఆ భూముల స్వాధీనానికి సీఎం ఆదేశాలు
- వెనక్కి ఇవ్వాలని కేంద్రానికి రాష్ట్రం అభ్యర్థన.. ఎన్టీపీసీ-బెల్‌తో అధికారుల చర్చలు



మధ్యతరగతిని ఆదుకోండి 2 10

- చిన్న వ్యాపారాలను ప్రోత్సహించండి.. బడ్జెట్‌లో పన్నుభారాలు తగ్గించండి
- కేంద్రానికి ఆర్ఎస్ఎస్ అనుబంధ కార్మిక, ఉద్యోగ, విద్యార్థి సంఘాల సూచన
- త్రిశంకు స్వర్గంలోకి ఆర్థిక వ్యవస్థ.. కాంగ్రెస్ విమర్శ.. ఆర్థికరంగంపై నివేదిక
- ఈసారి సెగలే!.. నేటి నుంచే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు.. నేడు ఆర్థిక సర్వే

మధ్య తరగతి గంపెడాశలు.. నిర్మలమ్మ మురిపిస్తారా? మాయ చేస్తారా?



విశేకా హత్య కేసు విచారణ

తీవ్ర ఆలస్యం

- 6 నెలల్లో పూర్తిచేసేలా సీబీఐ కోర్టుకు ఆదేశాలివ్వండి
- తెలంగాణ హైకోర్టులో వివేకా కుమార్తె సునీతారెడ్డి పిటిషన్
- విచారణ 4వ తేదీకి వాయిదా



3

ఎయిర్‌పోర్టులు కళకళ 11

- 6 నెలలుగా పెరుగుతున్న ప్రయాణికులు
- విజయవాడ విమానాశ్రయానికి పూర్వవైభవం
- మిలియన్ మార్క్ దాటి.. రికార్డు దిశగా
- గత టీడీపీ ప్రభుత్వంలోనూ ఈ ఘనత
- వైసీపీ పాలనలో ఏ ఏడాదీ దాటని వైనం
- వైజాగ్, తిరుపతి, రాజమండ్రిలోనూ వృద్ధి



14

కొత్త డయాఫ్రమ్ వాల్

అంచనా వ్యయం **990 కోట్లు**

- జల వనరుల శాఖ ఆమోదం
- పెరిగిన భారం 596 కోట్లు

కంటైనర్‌లో జూమ్ కార్లు

- అద్దె పేరుతో హైదరాబాద్‌లో అపహరణ.. కంటైనర్‌లో చెన్నైకు తరలింపు
- జీపీఎస్‌తో గుర్తించి ఏపీలోని బిట్రగుంట వద్ద పోలీసుల స్వాధీనం 3

కుంభమేళాలో మరో అగ్నిప్రమాదం

15 గుడారాలు దగ్ధం.. తప్పిన ప్రాణనష్టం

మహాకుంభ్ నగర్, జనవరి 30: ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో మరో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సెక్టార్-22 వెలుపల చమన్‌గంజ్ చౌకీ సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో దాదాపు 15 గుడారాలు ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఆ సమయంలో టెంట్ల లోపల ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. కుంభమేళా ప్రారంభమైన తర్వాత జరిగిన మూడో అగ్నిప్రమాదం ఇది. జనవరి 25న జరిగిన ప్రమాదంలో రెండు వాహనాలు దగ్ధం కాగా, అదే నెల 19న గ్యాస్ సిలిండరు పేలడంతో 18 టెంట్లు కాలిపోయాయి. ఇదిలాఉండగా, మౌని అమావాస్య సందర్భంగా తొక్కిసలాట జరిగిన నేపథ్యంలో యూపీ సర్కారు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కుంభమేళా ప్రాంతాన్ని 'నో వెహికల్ జోన్'గా ప్రకటించడంతోపాటు కఠిన భద్రతా చర్యలను అమల్లోకి తెచ్చింది. రద్దీని నివారించడానికి 30పాంటూన్ బ్రిడ్జిలను వన్‌వేగా మార్చారు. బుధవారం అర్ధరాత్రి అధికారులతో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సమావేశమయ్యారు. వసంత పంచమి (ఫిబ్రవరి 3) రోజున అమృత స్నానాలు ఉన్నందున ఏర్పాట్లను పరిశీలించాలని సీఎస్, డీజీపీని సీఎం ఆదేశించారు. ప్రయాగ్‌రాజ్ పొరుగు జిల్లాల నుంచి వచ్చే వాహనాలు జిల్లా సరిహద్దుల్లోనే నిలిపివేయాలని, ఫిబ్రవరి 4వరకూ నగరంలోకి నాలుగు చక్రాల వాహనాల ప్రవేశంపై పూర్తిగా నిషేధం విధించారు.పాస్‌ల జారీ నిలిపివేయడంతోపాటు వాహనాల రాకపోకలపై నిషేధం అమలు చేయాలని ఆదేశించారు.



మహా కుంభమేళాలో పుణ్య స్నానాల కోసం వచ్చిన భక్తులు

కాగా, కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై యూపీ ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. విశ్రాంత న్యాయమూర్తి హర్షకుమార్ నేతృత్వంలోని కమిషన్ నెలలోగా దర్యాప్తు పూర్తిచేసి నివేదిక సమర్పించనుంది. మాజీ డీజీపీ వీకే గుప్తా, విశ్రాంత ఐఏఎస్ డీకే సింగ్ సభ్యులుగా ఉంటారు.

కిక్కిరిసిన రైళ్లలో నరకం

కుంభమేళాలో పవిత్ర స్నానాలు చేసేందుకు తరలివెళ్తున్న యాత్రికులతో రైళ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రధాన నగరాల నుంచి 13వేల రైళ్లతో పాటు మరో 3వేల ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినా.. అవి ఏ మూలకూ సరిపోవడం లేదు. నిలబడటానికీ స్థలం లేక ప్రయాణికులు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. బోగీల తలుపులు మూసేస్తుండటంతో స్టేషన్లలో ఎక్కాల్సినవారు ఆగ్రహంతో రైళ్లపైకి రాళ్లు రువ్వుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి.

లోకం తీరు



మోదీ, షాకు పన్నూన్ బెదిరింపులు

- రాజ్‌నాథ్, అజిత్ దోభాల్‌లకు కూడా..
- యూఏపీఏ ట్రైబ్యునల్‌కు కేంద్రం వెల్లడి
- 'సిక్స్ ఫర్ జస్టిస్'పై ఐదేళ్ల పాటు నిషేధ పొడిగింపునకు ట్రైబ్యునల్ సమర్థన

న్యూఢిల్లీ, జనవరి 30: ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ స్థాపించిన 'సిక్స్ ఫర్ జస్టిస్' (ఎస్ఎఫ్‌జే) సంస్థపై నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం ఐదేళ్లపాటు పొడిగించడాన్ని ఢిల్లీ హైకోర్టుకు చెందిన యూఏపీఏ ట్రైబ్యునల్ సమర్థించింది. భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుందని పేర్కొంటూ కేంద్ర హోంశాఖ ఎస్ఎఫ్‌జేపై గత ఏడాది జూలై 10న చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద నిషేధాన్ని పొడిగించింది. ఎస్ఎఫ్‌జేను చట్టవిరుద్ధ సంస్థగా ప్రకటించడానికి సహేతుకమైన కారణాలు ఉన్నాయా?అనేదానిపై తీర్పునిచ్చేందుకు జస్టిస్ అనుప్‌కుమార్ నేతృత్వంలో ఢిల్లీ హైకోర్టు ట్రైబ్యునల్ ఆగస్టు 2న ఏర్పాటైంది. ఈ మేరకు ట్రైబ్యునల్ ఈ నెల 3న జారీచేసిన ఉత్తర్వులు తాజాగా అందుబాటులోకి వచ్చాయి. ప్రధాని మోదీ సహా హోంమంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌లకు ఎస్ఎఫ్‌జే నుంచి బెదిరింపులు వచ్చాయని కేంద్రం తెలిపింది. పార్లమెంట్, ఎర్రకోటలపై బాంబు దాడి చేస్తామంటూ గత ఏడాది జూలై 22న వాయిస్ సందేశం పంపిందని పేర్కొంది. భారత్‌లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాల్లో ఎస్ఎఫ్‌జే హస్తం ఉందని వెల్లడించింది. ప్రత్యేక ఖలిస్థానీ దేశం పేరుతో పంజాబ్‌లో వేర్పాటు భావజాలానికి మద్దతిస్తూనే ఉందని తెలిపింది. భారత దళాలపై పోరాడాలని ఆందోళనలు చేస్తున్న రైతులను పన్నూన్ రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడని కేంద్రం వెల్లడించింది.

బీజేపీ అభ్యర్థికి మోదీ పాదాభివందనం

- ఢిల్లీ బహిరంగ సభలో సన్నివేశం



న్యూఢిల్లీ, జనవరి 30: ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థికి పాదాభివందనం చేయడం ఆకట్టుకొంది. గురువారం ఘోండాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఈ సన్నివేశం చోటుచేసుకుంది. సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రధానికి పరిచయం చేశారు. వారంతా ఆయనకు పాదాభివందనం చేశారు. ప్రతాప్‌గంజ్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రవీందర్ సింగ్ నేగి (45)ని పరిచయం చేయబోగా ఆయన కూడా పాదాభివందనం చేశారు. కానీ మోదీ తిరిగి మూడుసార్లు ఆయనకు పాదాభివందనం చేశారు. నేగి ప్రస్తుతం బీజేపీ కౌన్సిలర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు వివాదాస్పదుడన్న పేరుంది.

బంగళాల్లోని పని మనుషులకు 7 గ్యారెంటీలు

- కేజ్రీవాల్ ఎన్నికల హామీలు

న్యూఢిల్లీ, జనవరి 30: మంత్రులు, ఎంపీలు, అధికారులకు కేటాయించిన అధికారిక నివాసాల్లో పనిచేసే కార్మికుల సంక్షేమం కోసం ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఏడు గ్యారెంటీలు ప్రకటించారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటి ఉద్యోగాల కోసం ప్రయత్నించే వారికి ప్రత్యేకంగా సర్వెంట్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఏర్పాటు, ఉద్యోగం పొందేవరకు ఉండడానికి ప్రత్యేకంగా హాస్టళ్ల నిర్మాణం, ఆరోగ్యం కోసం సంచార వైద్యశాలల ఏర్పాటు, జీతాలు, పనివేళల నిర్ధారణకు చట్టానికి రూపకల్పన, రూ.10లక్షల జీవిత బీమా సౌకర్యం, కుమార్తెల వివాహానికి రూ.లక్ష ఆర్థిక సాయం, పిల్లలకు ఉచిత విద్యా సౌకర్యం కల్పిస్తామన్న గ్యారెంటీలు ఇచ్చారు.

అత్యాచారం కేసులో కాంగ్రెస్ ఎంపీ అరెస్టు

సీతాపూర్ (యూపీ), జనవరి 30: అత్యాచారం కేసులో సీతాపూర్ ఎంపీ రాకేష్ రాథోడ్ (కాంగ్రెస్)ను పోలీసులు అరెస్టు చేశారు. తన నివాసంలో మీడియాతో మాట్లాడుతుండగానే పోలీసులు వచ్చి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. వివాహం చేసుకుంటానని ఆశచూపి నాలుగేళ్లుగా తనపై అత్యాచారం చేస్తున్నట్టు ఓ మహిళ ఈ నెల 17న ఫిర్యాదు చేసింది. దీనిపై ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు అలహాబాద్ హైకోర్టు లఖ్‌నవూ బెంచ్ నిరాకరించడంతో పోలీసులు వచ్చి అరెస్టు చేశారు.

అమెజాన్‌లో మళ్లీ ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ, జనవరి 30: దిగ్గజ సంస్థ అమెజాన్‌లో మళ్లీ ఉద్యోగుల తొలగింపు మొదలయింది. వ్యయాల తగ్గింపు, నిర్వహణను గాడిలో పెట్టడం, అధికారుల స్థాయిలోఉన్న యంత్రాంగాన్ని కుదించడం, ఉద్యోగుల సామర్థ్యం పెంపు తదితర లక్ష్యాలతో యాజమాన్యం నిర్ణయం తీసుకొంది. ఇందులో భాగంగా తొలుత కొన్ని చోట్ల పరిమితంగా లేఆఫ్‌లు ప్రకటిస్తోంది. 2021లో సీఈఓగా బాధ్యతలు చేపట్టిన ఆండీ జాస్సీ ఉద్యోగుల సంఖ్య తగ్గింపుపై దృష్టి పెట్టారు. 2022 నుంచి 27వేల మంది ఉద్యోగులను తొలగించారు.

డీప్ సీక్‌తో మేధో చౌర్యం ముప్పు!

- చైనా ఏఐపై అమెరికా సంచలన వ్యాఖ్యలు

వాషింగ్టన్, జనవరి 30: కృత్రిమ మేధ(ఏఐ) రంగంలో ప్రకంపనలు సృష్టిస్తున్న చైనాకు చెందిన ఏఐ స్టార్టప్ డీప్‌సీక్‌పై అమెరికా సంచలన వ్యాఖ్యలు చేసింది. డీప్ సీక్ వల్ల మేధోసంపత్తి చౌర్యం జరిగే ముప్పు పొంచి ఉందని వైట్‌హౌస్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సలహాదారు డేవిడ్ సాక్స్ అన్నారు. ఏఐలో ఉండే డిస్టిలేషన్ అనే విధానం ద్వారా ఈ చౌర్యం సాధ్యమని ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సాక్స్ పేర్కొన్నారు. డిస్టిలేషన్ ముప్పును నివారించేందుకు దిగ్గజ సంస్థలు అతి త్వరలోనే చర్యలు తీసుకుంటాయని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందిస్తూ భారతీయ సర్వర్ల నుంచే డీప్ సీక్‌ను హోస్ట్ చేస్తామని ప్రకటించారు. డేటా గోప్యతపై ఆందోళనలకుఇదే పరిష్కారమని అభిప్రాయపడ్డారు. కాగా, కాపీ రైట్స్ ఉల్లంఘనకు సంబంధించి భారతీయ న్యూస్ ఏజెన్సీ ఏఎన్ఐ సహా పలు సంస్థలు ఓపెన్ ఏఐపై దాఖలు చేసిన కేసుకు సంబంధించి ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ ఫిబ్రవరి 5న భారత్‌కు రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా భారత ప్రభుత్వ ఉన్నతాధికారులతోనూ ఆయన సమావేశమయ్యే అవకాశం ఉంది.

సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌కు ముందస్తు బెయిల్

- ఏసీబీ కేసులో షరతులతో హైకోర్టు మంజూరు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏసీబీ కేసులో సీఐడీ మాజీ చీఫ్ ఎన్.సంజయ్‌కు హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని స్పష్టం చేసింది. దర్యాప్తునకు సహకరించాలని, కోరినప్పుడు దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని ఆదేశించింది. కేసుతో సంబంధం ఉన్న, కేసు వివరాలు తెలిసిన వ్యక్తులను ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ బెదిరించడం, భయపెట్టడం వంటివి చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఈ మేరకు తీర్పు ఇచ్చారు. వైసీపీ హయాంలో అగ్ని ఎన్‌వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ రూపకల్పన, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరాతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల పేరుతో కాంట్రాక్ట్ కంపెనీలతో కుమ్మక్కై రూ 1.75 కోట్ల మేర నిధులు మళ్లించారనే ఆరోపణలతో ఏసీబీ ఆయనపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సంజయ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేశారు.

వైద్యుల పర్యవేక్షణ అవసరం

'పిటిషనర్ 2024 జూన్ నుంచి సస్పెన్షన్‌లో ఉన్నారు. ఆరోపణలకు సంబంధించిన రికార్డులను ఇప్పటికే విజిలెన్స్ అధికారులు సీజ్ చేసి ఏసీబీకి అప్పగించారు. ఈ నేపథ్యంలో సాక్ష్యాలను తారుమారు చేస్తారనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. లావాదేవీలకు సంబంధించి రికార్డులన్నింటినీ సీజ్ చేసిన నేపథ్యంలో కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరం లేదు. పిటిషనర్ సీనియర్ పోలీస్ అధికారి. సీఐడీ అడిషనల్ డీజీగా, అగ్నిమాపక-విపత్తుల నిర్వహణ శాఖ డీజీగా సేవలు అందించారు. ఆయనకు ఇక్కడ స్థిర నివాసం ఉంది. హృద్రోగంతో బాధపడుతున్నారు. బైపాస్ సర్జరీ కూడా చేయించుకున్నారు. నిరంతర వైద్యుల పర్యవేక్షణ అవసరం. పారిపోతారనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నాం' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

ఇతర పిటిషన్ల కొట్టివేత

ఇదే కేసులో నిందితులుగా ఉన్న క్రిత్వాప్ టెక్నాలజీస్ సంస్థకు చెందిన డైరెక్టర్లు శరణు వినయ్‌కుమార్, పాలవలస వెంకట తులసిరామ్, స్నౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా డైరెక్టర్లు శరణు సూర్యలలిత, వీరమాచనేని శ్రీహరిత వేర్వేరుగా దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను న్యాయమూర్తి కొట్టివేశారు. కంపెనీలను మాత్రమే ఏసీబీ నిందితులుగా చేర్చిందని, పిటిషనర్లను నిందితులుగా చేర్చనందున వీరి ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు.

1 అమెరికా వినువీధుల్లో ఘోర ప్రమాదం

విమానం, ఆర్మీ హెలికాప్టర్ ఢీ

67 మంది మృతి చెందినట్లు సందేహాలు.. 28 మృతదేహాల వెలికితీత

వాషింగ్టన్ సమీపంలో ఘటన

వాషింగ్టన్, జనవరి 30: అమెరికాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. రాజధాని వాషింగ్టన్ డీసీ సమీపంలోని రొనాల్డ్ రీగన్ విమానాశ్రయంలో దిగేందుకు వస్తున్న ప్రయాణికుల విమానం, ఆర్మీ హెలికాప్టర్ ఢీకొన్నాయి. విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉండగా.. హెలికాప్టర్‌లో ముగ్గురు సైనికులు ఉన్నారు. విమానం, హెలికాప్టర్ ఢీకొన్న తర్వాత సమీపంలోని పోటామ్యాక్ నదిలో కూలిపోయాయి. విమానం ముక్కలై నదిలో పడిపోగా.. హెలికాప్టర్ కూడా తలకిందులుగా కూలిపోయింది. ఈ ప్రమాదం కేవలం 30 సెకన్లలో జరిగిపోయిందని అధికారులు చెబుతున్నారు. 28 మృతదేహాలు వెలికి తీసినట్లు సమాచారం. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే పోటోమ్యాక్ నదిలో ఉష్ణోగ్రతలు మైనస్ 1, 2 డిగ్రీలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానం 5342.. కాన్సాస్‌లోని విషిటా నుంచి బయల్దేరింది. రొనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై దిగేందుకు సిద్ధమవుతుండగా.. రక్షణ శాఖకు చెందిన సికోర్‌స్కీ హెచ్-60 బ్లాక్‌హాక్ హెలికాప్టర్‌ను ఢీకొట్టింది. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానాన్ని స్థానికంగా పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తోంది. 2004లో తయారైన రెండు ఇంజన్ల సీఆర్‌జే-701 విమానానికి 70 మంది ప్రయాణికులను తీసుకెళ్లగలిగే సామర్థ్యం ఉంది. విమాన ప్రమాద సమాచారం అందుకున్న అధికారులు, సహాయక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రయాణికుల కోసం నదిలో గాలింపు కొనసాగుతోంది. ఈ ప్రమాదంలో విమానంలోని 64 మందీ ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని అగ్నిమాపక శాఖ చీఫ్ వెల్లడించారు. ఇప్పటి వరకు 28 మృతదేహాలను నదిలో నుంచి వెలికి తీసినట్లు తెలిపారు. గత 24 ఏళ్లలో అమెరికాలో ఇదే అతి పెద్ద ప్రమాదమన్నారు. విమానం తలకిందులుగా నది అడుగుభాగంలో కూరుకుపోయిందని, అక్కడికి దగ్గర్లోనే హెలికాప్టర్ శకలాలను కూడా గుర్తించామని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న జాన్ డొన్నెలీ తెలిపారు.



వాషింగ్టన్ సమీపంలోని నదిలో సహాయక చర్యలు చేపట్టిన సిబ్బంది

ప్రమాద కారణాలపై స్పష్టత లేదు

ఈ ప్రమాదం ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై స్పష్టమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. కాన్సాస్ నుంచి వచ్చిన ప్రయాణికుల విమానాన్ని రీగన్ ఎయిర్‌పోర్టులోని రన్‌వే 33పై ల్యాండ్ చేసేందుకు ఏటీసీ అనుమతి ఇచ్చింది. సరిగ్గా అదే సమయానికి ఓ మిలిటరీ హెలికాప్టర్ ఆ మార్గంలోకి వచ్చింది. అప్రమత్తమైన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్.. హెలికాప్టర్‌కు సమాచారమిచ్చారు. కానీ, కేవలం 30 సెకన్ల లోపే ఆ రెండూ ఢీకొన్నాయి. రన్‌వేకు 2400 అడుగుల దూరంలో విమానం నుంచి రేడియో ట్రాన్స్‌పాండర్ డేటా ఆగిపోయింది. కాగా, విమానాన్ని ఢీకొన్న హెలికాప్టర్‌ను శిక్షణకు ఉపయోగిస్తున్నట్లు ఆర్మీ అధికారులు తెలిపారు.

ట్రంప్ అసహనం

ఈ ప్రమాదంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నామన్నారు. "విమానాశ్రయానికి వెళ్లే దారిలో విమానం సరైన దిశలో ఉంది. కానీ, హెలికాప్టర్ చాలా సేపు నేరుగా విమానం వైపు వెళ్లింది. ఆకాశం నిర్మలంగా ఉంది. విమానం లైట్లన్నీ వెలుగుతున్నాయి. హెలికాప్టర్ ఎందుకు పక్కకు వెళ్లలేదు? విమానాన్ని చూశారా అని అడిగే బదులు ఏం చేయాలో కంట్రోల్ రూమ్‌లోని సిబ్బంది ఎందుకు చెప్పలేదు? ఇది పూర్తిగా నివారించదగ్గ ప్రమాదం. ఇలా జరగడం ఏమాత్రం సరి కాదు" అని ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు.

'పినాక' కోసం భారీ డీల్!

- 10 వేల కోట్ల ఒప్పందానికి సీసీఎస్ ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 30: భారత సైన్యం కోసం డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన పినాక మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్ వ్యవస్థను మరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) రూ.10 వేల కోట్ల విలువైన రాకెట్లు, మందుగుండు సామగ్రి కొనుగోలు కోసం అతిపెద్ద దేశీయ ఒప్పందానికి ఆమోదం తెలిపింది. వీటి కొనుగోళ్లకు అవసరమైన అనుమతులు ఇచ్చామని సంబంధిత అధికారులు వెల్లడించారు. చైనాతో ఉత్తర సరిహద్దు వెంబడి భారత్ తన సైనిక శక్తిని బలోపేతం చేస్తున్న నేపథ్యంలో మరో ఆరు పినాక రెజిమెంట్ల కోసం.. మందుగుండు సామగ్రిని ఈ డీల్ ద్వారా సేకరించనున్నారు. భారత సైన్యం వద్ద ఇప్పటికే నాలుగు రెజిమెంట్ల పినాక రాకెట్ వ్యవస్థలు ఉన్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా స్వదేశీ కంపెనీల నుంచి పినాక రాకెట్లు, మందుగుండును కొనుగోలు చేయనున్నారు. కాగా, శత్రు స్థావరాలను, లక్ష్యాలను సెకన్ల వ్యవధిలో ధ్వంసం చేయగల సత్తా పినాక మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్ (ఎంబీఆర్ఎల్) వ్యవస్థ సొంతం. సోవియెట్ కాలంనాటి గ్రాడ్ బీఎం-21 రాకెట్ లాంచర్ స్థానంలో పినాక ఎంబీఆర్ఎల్‌ను రూపొందించారు. కార్గిల్ యుద్ధంలో మొదటిసారిగా దీన్ని మోహరించారు. డీఆర్‌డీవోకు చెందిన ఆర్మమెంట్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏఆర్‌డీఈ) అభివృద్ధి చేసిన పినాకాలో 60 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించే ఫ్రీ ఫ్లయిట్ ఆర్టిలరీ రాకెట్ ఉంది. 12 రాకెట్లను త్వరితగతిన ప్రయోగించగల మల్టీ ట్యూబ్ లాంచర్లు దీనిలో ఉన్నాయి.

వీసా గడువు ముగిసినా అమెరికాలోనే

7 వేల మంది భారతీయులది ఇదే పరిస్థితి.. వీరిలో 2 వేల మంది విద్యార్థులు

- అమెరికా కాంగ్రెస్‌కు 'సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్' డైరెక్టర్ వాఘన్ నివేదిక

వాషింగ్టన్, జనవరి 30: వీసా గడువు ముగిసినా.. ఏడు వేల మంది భారతీయులు ఇంకా అమెరికాలోనే ఉన్నారని అమెరికా కాంగ్రెస్ ఏర్పాటు చేసిన కమిటీ దృష్టికి సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్ డైరెక్టర్ జెస్సికా.ఎం.వాఘన్ తీసుకువెళ్లారు. వీరంతా స్టూడెంట్(ఎఫ్-1, ఎం-1) వీసాలు, ఎక్స్‌చేంజ్ విజిటర్ వీసా(జే వీసా)లపై అమెరికాకు వచ్చారని, 2023లో వీరి వీసాల గడువు ముగిసిందని స్పష్టం చేశారు. ఈ 7 వేల మందిలో 2 వేల మంది విద్యార్థులున్నట్లు చెప్పారు. బ్రెజిల్, చైనా, కొలంబియా, భారత్ నుంచి రెండేసి వేల మందికి పైగా విద్యార్థులు గడువు ముగిసినా.. అమెరికాలోనే నివసిస్తున్నట్లు కాంగ్రెస్ దృష్టికి తీసుకువచ్చారు. "32 దేశాలకు చెందిన విద్యార్థులు, ఎక్స్‌చేంజ్ విజిటర్లలో 20 శాతానికి పైగా వీసా గడువు దాటినా.. అమెరికాలోనే ఉంటున్నారు. ఎఫ్, ఎం కేటగిరీల్లో వీసాలు తీసుకున్నవారే ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు" అని వాఘన్ పేర్కొన్నారు. కాగా.. హెచ్-1 వీసాలను అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఫుల్‌టైమ్ కోర్సులు చేసేవారు, స్కూళ్లు, కాలేజీల్లో చదువుకునేవారికి జారీ చేస్తారు. వృత్తివిద్య, నాన్-అకడమిక్ ప్రోగాములు చదివేవారికి ఎం1 వీసాలను అందజేస్తారు. వీసాల దుర్వినియోగం, నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో వ్యవస్థలో, చట్టాల్లో ప్రక్షాళన అవసరమని వాఘన్ అభిప్రాయపడ్డారు. "ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేయాలి. వీసా గడువు ముగిశాక మారుమూల ప్రాంతాల్లో ఉంటున్న వారిని కూడా గుర్తించి, వెనక్కి పంపేలా ఇంటీరియర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను అభివృద్ధి చేయాలి. ఇందుకోసం కాంగ్రెస్ చట్టసవరణ చేయాలి. ప్రతి విద్యార్థి చదువు పూర్తవ్వగానే వారి సొంత దేశాలకు వెళ్లేందుకు సిద్ధపడాలి" అని సూచించారు. అమెరికాలో వృత్తి నిపుణులకు ఇచ్చే హెచ్-1బీ వీసాల జారీని కఠినతరం చేయాలని వాఘన్ అభిప్రాయపడ్డారు. "రీసెర్చ్, నాన్ ప్రాఫిట్ వంటి వీసాలు అపరిమితంగా ఉండకూడదు. వాటి సంఖ్యను 75 వేల లోపునకు కుదించాలి. ఒకవేళ వీసా సబ్‌స్క్రిప్షన్లు ఎక్కువగా ఉంటే.. అధికంగా వేతనాలు చెల్లించే సంస్థలకు ప్రాధాన్యమివ్వాలి. హెచ్-1బీ గడువును రెండేళ్లకు నిర్ణయించాలి. అవసరాన్ని బట్టి మాత్రమే నాలుగేళ్లకు పొడిగించే వెసులుబాటు ఉండాలి. గ్రీన్ కార్డు దరఖాస్తు పెండింగ్‌లో ఉంటే.. ఆటోమేటిక్‌గా హెచ్-1బీ పొడిగింపు విధానాన్ని రద్దుచేయాలి" అని వ్యాఖ్యానించారు. స్టెమ్ కోర్సులు చేసిన అమెరికన్లలో ఆరింట ఒక వంతు మంది (20లక్షల మంది)ఎలాంటి ఉద్యోగాలు చేయడం లేదని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న మానవ వనరులను వినియోగించుకునేందుకు వీసా విధానాలను ప్రక్షాళన చేయాలని సూచించారు. కాగా.. నేర చరిత్ర ఉన్న అక్రమ వలసదారులను 'గ్వాంటనామో బే'కి తరలిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. బుధవారం ఆ మేరకు ప్రెసిడెన్షియల్ మెమోరండంపై సంతకం చేశారు. 30 వేల మంది సామర్థ్యమున్న గ్వాంటనామో బేలో ఇప్పటి వరకు ఉగ్రవాదులను నిర్బంధించేవారు. అక్రమ వలసదారులను ఆయా దేశాలు కట్టడి చేస్తాయనే నమ్మకం లేకే.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ చెప్పారు.



మధ్యతరగతిని ఆదుకోండి

- కేంద్రానికి ఆర్ఎస్ఎస్ అనుబంధ కార్మిక, ఉద్యోగ, విద్యార్థి సంఘాల సూచన

న్యూఢిల్లీ, జనవరి 30: కేంద్ర ఆర్థిక బడ్జెట్‌లో మధ్యతరగతికి ఊరట కలిగించే చర్యలనూ, స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించే కార్యక్రమాలను ప్రతిపాదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆర్ఎస్ఎస్ అనుబంధ కార్మిక, విద్యార్థి, ఉద్యోగ సంఘాలు కోరాయి. ముఖ్యంగా.. మధ్యతరగతి చైనా ఉత్పత్తుల్లో ఎక్కువగా వినియోగించే గొడుగులు, పాదరక్షలు వంటివాటిపై వసూలు చేస్తున్న టారిఫ్‌ను తగ్గించాలని సూచించాయి. ప్రోత్సాహకాల ద్వారా సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు ఊతం ఇవ్వాలని కోరాయి. సంపన్నవర్గాలకు మేలు చేసే సంస్కరణలూ, రెవెన్యూను పెంచే చర్యలను కొనసాగిస్తూనే, మధ్యతరగతినీ, స్థానిక వ్యాపారులను ఆదుకునే చర్యలూ అవసరమని ఆర్ఎస్ఎస్ భావిస్తుంది. వీటిని తన ప్రాధాన్యాలుగా కేంద్ర ప్రభుత్వం ఎదుట ఉంచింది. ఇందులోభాగంగా.. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలు అయిన లఘు ఉద్యోగ్ భారతి (ఎల్‌యూబీ), అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ), స్వదేశీ జాగరణ్ మంచ్ (ఎస్‌జేఎమ్)లకు చెందిన ప్రతినిధి బృందం గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసింది. శుక్రవారం నుంచి శీతాకాల పార్లమెంటు సమావేశాలు మొదలవుతున్నాయి. ఆ మరునాడే బడ్జెట్‌ను ఉభయ సభల్లో ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా.. బడ్జెట్ విషయంలో ఆర్ఎస్ఎస్ ప్రాధాన్యాలను మంత్రికి ఆ సంస్థలు నివేదించాయి. ముఖ్యాంశాలు ఇవీ..

విద్యకు గట్టి ప్రోత్సాహం...

జాతీయ విద్యా విధానానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. భారతీయ విలువలు, చరిత్ర, ప్రాచీన జ్ఞాన సిద్ధాంతాలకు పాఠ్య ప్రణాళికలో చోటు కల్పించాలి. రాష్ట్రాల పరిధిలో ఉన్నత విద్యాసంస్థలు, గ్రామీణ పాఠశాలలు, నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు, పరిశోధన సంస్థలపై ఎక్కువగా ఖర్చు పెట్టాలి. దేశంలోని సకల విద్యా వ్యవస్థలూ, శిక్షణా కేంద్రాలపై ఏకీకృత నియంత్రణ ఉండాలి.

విద్య, వైద్య ఖర్చులను నియంత్రించండి

మధ్యతరగతిపై జీవన వ్యయాల భారం తగ్గించాలి. పన్నుల విధింపులో ఉదాసీనంగా ఉండాలి. విద్య, వైద్యం వంటి అత్యవసర ఖర్చుల కోసం అప్పులు చేసి ఆర్థికంగా చితికిపోతున్న మధ్యతరగతి జీవులకు బడ్జెట్‌లో ఊరట ఇవ్వాలి. స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించాలి. తేలిగ్గా రుణం దొరికి, సరుకు కొనుగోలు ఖర్చులు తగ్గి, రాయితీలు ఇతర ప్రోత్సాహకాలు ఇతోధికంగా లభించేలా చర్యలు తీసుకోవాలి. సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను బలోపేతం చేసేందుకు దేశీయ ఉత్పత్తి రంగాన్ని ప్రోత్సహించాలి. కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న ప్రోత్సాహకాలను చిన్న పరిశ్రమలకు కూడా వర్తింపజేయాలి. కొత్త ఉద్యోగాల సృష్టి, దేశీయ ఉత్పత్తులకు ఊతం ఇవ్వడం లక్ష్యంగా ఈ ప్రక్రియ ఉండాలి.

త్రిశంకు స్వర్గంలోకి ఆర్థికం

- చిరువ్యాపారులపై పన్నుల బాదుడు
- కార్పొరేట్లకు మాత్రం మినహాయింపులు
- ఆర్థిక రంగంపై కాంగ్రెస్ నివేదిక

న్యూఢిల్లీ, జనవరి 30: దేశ ఆర్థిక వ్యవస్థను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం.. త్రిశంకుస్వర్గంలోకి నెడుతోందని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఆరోపించింది. దీని ఫలితంగా భారతదేశం ఇతర ఆర్థిక వ్యవస్థలతో పోటీ పడలేని విధంగా, తగిన స్థాయిలో ఉత్పాదకత జరపలేని దేశంగా, అసమానతల వ్యవస్థగా తయారవుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను శనివారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో.. 'వృద్ధికి ఏమైంది' అనే పేరుతో కాంగ్రెస్ ఒక నివేదికను గురువారం విడుదల చేసింది. ఏఐసీసీ పరిశోధన విభాగం చెయిర్‌పర్సన్ ఎంపీ రాజీవ్ గౌడ సారథ్యంలో రూపొందిన ఈ నివేదికను ఏఐసీసీ కార్యాలయంలో కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి చిదంబరం విడుదల చేశారు. 2024-25లో దేశ జీడీపీ వృద్ధి రేటు 6.4% ఉంటుందని అంచనా వేస్తున్నామని, ఇది సంతోషించాల్సిన విషయం కాదని.. యువ జనాభా అధికంగా ఉన్న మన దేశం వాస్తవానికి 8% వృద్ధిరేటును స్థిరంగా సాధించాలని ఈ నివేదికలో పేర్కొన్నారు. 'శీఘ్రగతిన జరుగుతున్న సాంకేతిక మార్పులతో ఉద్యోగరంగంలో తీవ్రమైన మార్పులు వస్తున్నాయి. ఇటువంటి సమయంలో 6% వృద్ధిరేటుతో యువతకు తగినన్ని ఉద్యోగాలు లభించవు. ఇదే పరిస్థితి కొనసాగితే దేశంలో తీవ్రమైన అసమానతలు కొనసాగుతాయి. దేశ జనాభాలో 2/3 వంతు మంది ప్రభుత్వం అందించే ఉచిత రేషన్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. మరోవైపు, ప్రధానమంత్రి సన్నిహితులైన అతి కొద్దిమంది కార్పొరేట్ సంపన్నులు మాత్రం తమ సంపద గుట్టలను వేగంగా పెంచుకుంటున్నారు. 2019లో కార్పొరేట్ కంపెనీలకు మోదీ ప్రభుత్వం భారీ ఎత్తున పన్ను మినహాయింపులు ఇచ్చింది. దానికి ప్రతిగా కార్పొరేట్ రంగం పెట్టుబడులను పెంచి ఉద్యోగాలను సృష్టించే ప్రయత్నమే చేయలేదు. సాధారణ ప్రజలు, చిన్న వ్యాపారులను మాత్రం పెట్రోల్, డీజిల్ మీద భారీ పన్నులతో, జీఎస్టీతో ప్రభుత్వం బాదుతోంది. తద్వారా దేశ ఆర్థికవ్యవస్థను మోదీ ప్రభుత్వం త్రిశంకుస్వర్గం వంటి మధ్య ఆదాయ ఉచ్చులోకి నెడుతోంది' అని వివరించింది. కోవిడ్ సమయంలో మోదీ ఒక ప్రణాళిక అంటూ లేకుండా అకస్మాత్తుగా విధించిన లాక్‌డౌన్‌తో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని, ఆ తర్వాత కొంత పుంజుకున్నా అది ఏమాత్రమూ సరిపోదని తెలిపింది. ఈ వాస్తవాలను గుర్తించటానికి ప్రభుత్వం నిరాకరిస్తోందని.. సమ్మిళిత అభివృద్ధి కోసమే తాము ఈ నిర్మాణాత్మక విమర్శ చేస్తున్నామని పేర్కొంది.

అమరావతికి ఓఆర్ఆర్ మణిహారం!



ఔటర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ చిత్రం

87 గ్రామాల మీదుగా ఆరు వరుసల్లో నిర్మాణం .. ప్రాజెక్టు అంచనా వ్యయం మొత్తం రూ.16,310 కోట్లు

- రాష్ట్ర జీఎస్టీ మినహాయింపునకు చంద్రబాబు హామీ
- ప్రాజెక్టు వ్యయంలో తగ్గనున్న రూ.1,156 కోట్ల భారం
- అలైన్‌మెంట్‌కు ఆమోదం తెలిపిన అప్రూవల్ కమిటీ
- నాలుగు చోట్ల స్వల్ప మార్పులు చేయాలని సూచన
- మరో వారం రోజుల్లో అధికారిక పత్రాలు అందే చాన్స్
- ఆ వెంటనే పనులు ప్రారంభించే అవకాశం: ఎన్‌హెచ్‌ఏఐ

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతికి మణిహారం వంటి ఔటర్ రింగు రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది. అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి అభివృద్ధి పనులు చేపట్టిన కూటమి ప్రభుత్వం.. గత ఐదేళ్లుగా ఆగిపోయిన దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖకు చెందిన అలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఇప్పటికే ఓఆర్ఆర్‌కు ఆమోదం తెలిపింది. అయితే అలైన్‌మెంట్‌లో నాలుగు చోట్ల స్వల్ప మార్పులు సూచించింది. ఆ ప్రకారం మార్పులు చేసిన రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. వాటికి కూడా ఆమోదం లభించిందని, మరో వారం రోజుల్లో అధికారిక పత్రాలు అందుతాయని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు.

189.4 కి.మీ. మేర నిర్మాణం

కేంద్రం తాజాగా ఆమోదించిన అలైన్‌మెంట్ ప్రకారం ఔటర్ రింగ్‌రోడ్డు 189.4 కి.మీ మేర ఏర్పాటు కానుంది. గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని 22 మండలాల పరిధిలోని 87 గ్రామాల మీదుగా 6 వరుసల్లో నిర్మాణం సాగనుంది. ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఇటీవల ఓఆర్ఆర్ అలైన్‌మెంట్‌పై డ్రోన్ సర్వే చేయగా రెండుచోట్ల చేపల చెరువులు, ఒకచోట గోడౌన్, మరోచోట నిర్మాణం ఉన్నట్లు గుర్తించారు. కృష్ణాజిల్లాలో జుజ్జూరు, దుగ్గిరాలపాడు మధ్య, మైలవరం వద్ద, సగ్గూరు వద్ద, గుంటూరు జిల్లాలోని శలపాడు, వేజెండ్ల మధ్య ఈ మార్పులు చేయాల్సి ఉందని కమిటీ సూచించింది. ఓఆర్ఆర్ తూర్పు భాగంలో కృష్ణా జిల్లా వల్లూరుపాలెం- గుంటూరు జిల్లా మున్నంగి మధ్య 4.8 కి.మీ మేర ఒక వంతెన, పల్నాడు జిల్లా బలుసుపాడు కృష్ణాజిల్లా మున్నలూరు మధ్య 3.150 కి.మీ మేర మరొక వంతెన నిర్మించనున్నారు.

ప్రాజెక్టు వ్యయం కేంద్రానిదే

ఓఆర్ఆర్ నిర్మాణ వ్యయం మొత్తం రూ.16,310 కోట్లుగా అంచనా వేశారు. భూసేకరణ, సివిల్ వర్క్‌లకు కలిపి అయ్యే ఈ మొత్తాన్ని కేంద్రమే భరించనుంది. అయితే నిర్మాణానికి వినియోగించే సిమెంటు, స్టీలు తదితరాలకు రాష్ట్ర జీఎస్టీని మినహాయించడంతో పాటు, కంకర, గ్రావెల్, ఇసుకపై సీనరేజి ఫీజును కూడా మినహాయిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. దీంతో ప్రాజెక్టు వ్యయంలో రూ.1,156 కోట్ల మేర భారం తగ్గనుంది. ఓఆర్ఆర్ అలైన్‌మెంట్‌కు సంబంధించి పూర్తి స్థాయి ఆదేశాలు కొద్ది రోజుల్లో అందనున్నాయని, ఆ వెంటనే పనులు మొదలు పెట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మొత్తం 11 విభాగాలుగా, 3 దశల్లో ఓఆర్ఆర్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన నగరాలైన విజయవాడ, గుంటూరుతో పాటు మంగళగిరి- తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, తెనాలి ఓఆర్ఆర్ పరిధిలోకి రానున్నాయి. కృష్ణాజిల్లా మైలవరం, గన్నవరం, ఆగిరిపల్లి, ఉయ్యూరుకు అత్యంత సమీపంలో ఓఆర్ఆర్ ఏర్పాటవుతోంది. దీని నిర్మాణంతో రాష్ట్రంలో రవాణా సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా, పొరుగు రాష్ట్రాలతో అనుసంధానం సులభమవుతుందని నిపుణులు చెబుతున్నారు.

వివేకా హత్య కేసు విచారణ తీవ్ర ఆలస్యం

ఆరు నెలల్లో పూర్తిచేసేలా సీబీఐ కోర్టుకు ఆదేశాలివ్వండి

- తెలంగాణ హైకోర్టులో వివేకా కుమార్తె సునీతారెడ్డి పిటిషన్
- విచారణను 4వ తేదీకి వాయిదా వేసిన ధర్మాసనం

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బాబాయి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో తీవ్ర ఆలస్యం జరుగుతోందని వివేకా కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి అన్నారు. సమీప భవిష్యత్తులో విచారణ ప్రారంభమయ్యే ఆనవాళ్లు కనిపించడంలేదని.. ఆరు నెలల్లో ట్రయల్ మొత్తం పూర్తిచేసేలా నాంపల్లి సీబీఐ కోర్టుకు ఆదేశాలు జారీచేయాలని ఆమె తెలంగాణ హైకోర్టులో తాజాగా పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో సీబీఐతోపాటు నిందితులు టి.గంగిరెడ్డి, వై.సునీల్ యాదవ్, గజ్జల ఉమాశంకర్‌రెడ్డి, షేక్ దస్తగిరి (అప్రూవర్), డి.శివశంకర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్.గౌతమ్ వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు హైదరాబాద్ సీబీఐ కోర్టుకు బదిలీ అయి రెండేళ్లు దాటినా ఇంకా సీఆర్పీసీ 207 దశ (ప్రాసిక్యూషన్ పత్రాల కాపీలను నిందితులకు అందజేయడం)లోనే ఉందని పేర్కొన్నారు. సీబీఐ సమర్పించిన హార్డ్‌డిస్క్‌ల్లో 13 లక్షల ఫైల్స్ ఉండగా ఇప్పటివరకు 13,717 ఫైల్స్ మాత్రమే ఓపెన్ చేశారన్నారు. ఇలాగే.. రోజుకు 500 ఫైల్స్ చొప్పున ఓపెన్ చేసుకుంటూ పోతే మరో ఏడేళ్లయినా ట్రయల్ ప్రారంభం కాదని చెప్పారు. ఈ కేసులో సాక్షి వైఎస్ అభిషేక్ రెడ్డి తాజాగా మరణించారని తెలిపారు. ట్రయల్ ప్రారంభం కాకపోతే ఇబ్బందులు వస్తాయని, నిందితులందరికీ నోటీసులు జారీచేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. 'నిందితులకు నోటీసులిస్తే ఏం లాభం.. మేం ట్రయల్‌కు సహకరిస్తున్నాం' అని చెబుతారని వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపడతామని పేర్కొంటూ విచారణను ఫిబ్రవరి 4కు వాయిదా వేసింది.

కుంభమేళాలో టీటీడీ ఉద్యోగి అదృశ్యం

- దారాగంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అధికారులు



సుబ్రహ్మణ్యం

తిరుమల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో టీటీడీ ఏర్పాటు చేసిన శ్రీవారి నమూనా ఆలయంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించేందుకు వెళ్లిన దీపాలి సుబ్రహ్మణ్యం అనే ఉద్యోగి కనిపించకుండా పోయారు. కుంభమేళా నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్‌లోని సెక్టార్6లో టీటీడీ శ్రీవారి ఆలయ నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అక్కడ విధులు నిర్వహించేందుకు టీటీడీ నుంచి దాదాపు 250 మంది సిబ్బంది డిప్యుటేషన్‌పై వెళ్లారు. బుధవారం సాయంత్రం సబ్బు కోసం బయటకు వెళ్లిన దీపాలి సుబ్రహ్మణ్యం తిరిగి రాలేదు. దీంతో ఆయన కోసం విజిలెన్స్ అధికారులు తీవ్రంగా గాలించారు. ఎంతకీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో దారాగంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పరిశ్రమల కాలుష్యంతో మత్స్యకారుల జీవనోపాధికి గండి

- ప్రభుత్వ జోక్యానికి డాక్టర్ రాజేంద్ర సింగ్ డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రసింగ్. చిత్రంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ

సీతంపేట (విశాఖపట్నం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సుమారు వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల కాలుష్యంతో రెండు లక్షల మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నాయని వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన పర్యావరణవేత్త డాక్టర్ రాజేంద్రసింగ్ ఆందోళన వ్యక్తంచేశారు. విశాఖపట్నంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతంలో ఉన్న పరిశ్రమల వ్యర్థాలు సముద్రంలో కలవడంతో మత్స్య సంపదకు తీవ్ర నష్టం కలుగుతోందన్నారు. ఇటీవల ఈ కాలుష్యం కారణంగా సముద్ర తాబేళ్లు (ఆలివ్ రిడ్లీ) పెద్దసంఖ్యలో మృత్యువాత పడ్డాయన్నారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి, ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని మత్స్యకారుల జీవనోపాధిని కాపాడాలని డాక్టర్ రాజేంద్రసింగ్ కోరారు. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

ఐఎస్‌బీతో సీడాప్ ఎంవోయూ

- బిజినెస్ లీడర్లను తయారు చేయడమే లక్ష్యం



ఒప్పందం చేసుకుంటున్న సీడాప్ చైర్మన్ జి.దీపక్‌రెడ్డి, ఐఎస్బీ అధికారులు

విజయవాడ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ బిజినెస్ లీడర్లను తయారు చేయడమే లక్ష్యంగా సీడాప్ అడుగులు వేసింది. యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్బీ)తో 24 సెక్టార్లకు ఒప్పందం కుదుర్చుకుంది. విజయవాడలోని సీడాప్ కార్యాలయంలో గురువారం సీడాప్ చైర్మన్ జి.దీపక్‌రెడ్డి, ఐఎస్బీ అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఐఎస్బీతో కొన్ని కోర్సులకు ఎంవోయూ చేసుకున్నామన్నామని ఈ సందర్భంగా దీపక్‌రెడ్డి తెలిపారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ నినాదంతో ఈ ఒప్పందం చేసుకున్నామన్నారు. ఐఎస్బీతోనే కాకుండా సెంచూరియన్ యూనివర్సిటీతో కూడా ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. దీని వల్ల 40 శాతం శిక్షణ పూర్తి చేసిన వారికి స్వయం ఉపాధిలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో రాబోయే మూడేళ్లలో 22 వేల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఐఎస్బీ ప్రతినిధి డాక్టర్ చందన్ చౌదరి మాట్లాడుతూ తయారీ రంగంలో లీడర్స్‌ను తయారు చేసేందుకు ఈ ఎంవోయూ చేసుకున్నామన్నారు. ఉద్యోగ సృష్టి, ఎగుమతిని పెంచడానికి తయారీ రంగం వృద్ధిని పెంచాలన్నారు. కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ ప్రతినిధి జేఎం రావు, ఐఎస్బీ ప్రతినిధి డాక్టర్ యుగల్ నౌహ్రియా, సీడాప్ సీఈవో పి.నారాయణ స్వామి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

కంటైనర్‌లో జూమ్ కార్లు

అద్దె పేరుతో హైదరాబాద్‌లో అపహరణ.. కంటైనర్‌లో చెన్నైకు తరలింపు

జీపీఎస్‌తో గుర్తించి బిట్రగుంట వద్ద పోలీసుల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మూడు కార్లు



కంటైనర్‌లోని కారును పరిశీలిస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జూమ్ కార్ యాప్ ద్వారా హైదరాబాద్‌లో కారు అద్దెకు తీసుకుని... అపహరించి కంటైనర్‌లో చెన్నై తరలిస్తూ పట్టుబడ్డాడో వ్యక్తి. పోలీసులు జీపీఎస్ సాయంతో ప్రకాశం జిల్లాలో మూడు కార్లు, కంటైనర్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో చిట్టిప్రోలు ఉత్తేజ్ జూమ్ యాప్ ద్వారా కార్లను రోజువారీ అద్దెకు ఇస్తుంటారు. గులాం మహమ్మద్ రావత్ అనే వ్యక్తి కారును రోజుకు రూ.2 వేల చొప్పున అద్దెకు తీసుకున్నాడు. తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. అనుమానం రావడంతో ఉత్తేజ్ హైదరాబాద్‌లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో కారు ప్రకాశం జిల్లాలో జాతీయ రహదారిపైప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు సమాచారం ఇచ్చారు. జీపీఎస్ ఆధారంగా టంగుటూరు టోల్‌ప్లాజా సమీపంలో కారు ఉన్నట్టు గుర్తించారు. ఆయన సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్యను, హైవే మొబైల్ పోలీసులను అప్రమత్తం చేయడంతో వారు వెంటనే టోల్‌ప్లాజా వద్ద వాహనాలను జల్లెడ పట్టారు. కానీ కారు మాత్రం కనపడలేదు. మరోసారి సాంకేతిక పరిజ్ఞానంతో లొకేషన్ గుర్తించగా అప్పటికే టోల్‌ప్లాజా దాటినట్లు గుర్తించారు. పోలీసులు లొకేషన్‌ను ట్రాక్ చేస్తూ వాహనాల్లో వెంబడించారు. బిట్రగుంట ఫ్లైవోవర్ వద్దకు వెళ్లేసరికి కారు అక్కడే ఉన్నట్టు చూపుతున్నా రహదారిపై మాత్రం కనిపించలేదు. జీపీఎస్ చూపుతున్న లొకేషన్‌లో కంటైనర్ ఉండటంతో పోలీసులు దాన్ని ఆపారు. కంటైనర్ డోర్లు తీసి చూసి ఆశ్చర్యపోయారు. అందులో నంబర్ ప్లేట్లు మార్చిన థార్ వాహనంతో పాటు మరో రెండు కార్లు కూడా ఉన్నాయి. మూడు కార్లను, కంటైనర్‌ను సర్కిల్ కార్యాలయానికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హజరత్తయ్య తెలిపారు.

తెలంగాణ నుంచి ఏపీ వక్ఫ్‌బోర్డు రికార్డులు తెప్పించండి

50 కోట్ల బకాయిలూ ఇప్పించండి.. సీఎంకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ వినతి

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వక్ఫ్ బోర్డు నుంచి ఏపీ వక్ఫ్ బోర్డుకు రావాల్సిన రూ.50 కోట్ల పెండింగ్ బకాయిలను ఇప్పించాలని సీఎం చంద్రబాబును రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ కోరారు. గురువారం అమరావతి సచివాలయంలో చంద్రబాబును కలిసి పలు సమస్యలనువివరించారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఏపీ వక్ఫ్ బోర్డుకు చెందిన అన్ని రికార్డులు(డిజిటల్ రికార్డులతో సహా), పత్రాలు తెలంగాణ నుంచి బదిలీ చేయలేదని, ఆస్తులనూ అప్పగించలేదని తెలిపారు. ఏపీ వక్ఫ్ బోర్డు వద్ద రికార్డులు లేని కారణంగా చట్టపరమైన విషయాల్లో కోర్టుల్లో కౌంటర్ దాఖలు చేయలేకపోతున్నామని తెలిపారు.

పరిశ్రమల శాఖ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా వీరకుమారి

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ హోదాలో ఉన్న ఎన్.వి.వీరకుమారిని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించింది. శాఖలో ఏసీబీ, క్రమశిక్షణ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులను ఆమె సమీక్షిస్తారు.

మత్స్యశాఖలో జేడీ, డీడీల సీనియారిటీ జాబితాలు

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్యశాఖలో జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్ల తుది సీనియారిటీ జాబితాలను ప్రభుత్వం విడుదల చేసింది. 10 మంది జేడీల్లో ఇప్పటికే ముగ్గురు ఉద్యోగ విరమణ చేశారు. 15మంది డీడీల్లో ఒకరు చనిపోగా, ముగ్గురు ఉద్యోగ విరమణ చేశారు. 2017-20 మధ్య పదోన్నతులు పొందిన జేడీలు, డీడీలకు తుది సీనియారిటీ జాబితా ప్రకారం ఫలితం ఆధారపడి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.

అనారోగ్యంతో పుట్టాడని.. పుట్టిన వెంటనే.. పూడ్చి పెట్టే యత్నం

- కాపాడిన మానవత ప్రతినిధి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో పుట్టిన బిడ్డతో కూతురు ఇబ్బందులు పడుతుందని ఆమె తల్లి పురిటికందును బతికుండగానే పూడ్చిపెట్టేందుకు ప్రయత్నించింది. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చింతాయిగూడెంకు చెందిన కోమటి దుర్గాశ్రీనివాస్, భార్య సంధ్యాకుమారికి ఏడాది క్రితం వివాహమైంది. ఈ నెల 28న పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ప్రైవేటు ఆస్పత్రిలో మగబిడ్డ జన్మించాడు. బిడ్డకు తలలో నిమ్ము ఉందని వైద్యులు చెప్పారు. 29వ తేదీ ఆస్పత్రి నుంచి తాడేపల్లిగూడెంలో ఉంటున్న సంధ్యాకుమారి తల్లి కాసగాని బాపనమ్మ ఇంటికి వచ్చారు. అప్పటికే శారీరక వైకల్యంతో ఉన్న బిడ్డతో పెద్ద కుమార్తె బాధలు చూస్తున్న బాపనమ్మ చిన్న కుమార్తెకు కష్టాలు రాకూడదనుకుంది. బిడ్డను పూడ్చి పెట్టాలని తాడేపల్లిగూడెంకు చెందిన ఎర్రంశెట్టి గిరికుమార్‌కు బుధవారం రాత్రి అప్పగించింది. అతను శ్మశానానికి బిడ్డను తీసుకెళ్లగా చిన్నారిలో కదలికలను గుర్తించిన మానవతా సంస్థ ప్రతినిధి బంగార్రాజు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పసికందును విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భక్తుల మనోభావాలను దెబ్బతీస్తే ఉపేక్షించేది లేదు

- శ్రీకాళహస్తి ఆలయ ఘటనపై విచారణ : మంత్రి లోకేశ్

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిలో కొంతమంది గత వైసీపీ ప్రభుత్వ విధానాల నుంచి ఇంకా బయటకు రాలేదని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఏ చర్యను కూడా ఉపేక్షించేది లేదని ఆయన ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి దేవాలయాల్లో క్యూలైన్లో ఉన్న భక్తులకు ప్రసాదం ఇవ్వకుండా బయటకు పంపడంపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుంభమేళాకు పర్యాటక శాఖ బస్సులు

- 11, 12 తేదీల్లో రెండు మార్గాల్లో అందుబాటులోకి



నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్ రాజ్‌కు రెండు రూట్లలో బస్సులు నడపనున్నట్టు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) డీఎం శ్రీనివాసరావు తెలిపారు. ఏపీ, తెలంగాణ ప్రజలకు అనుకూలంగా ఈ బస్సులను నడుపుతామని పేర్కొన్నారు. ఇందులో ఓ బస్సు తిరుపతి, ఒంటిమిట్ట, కడప బైపాస్, ఓర్వకల్లు, కర్నూల్ బైపాస్, హైదరాబాద్, జబల్‌పూర్, చిత్రకూటం, కాశీ, నాగపురి ధర్మపురి మీదుగా ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సు ఫిబ్రవరి 11 ఉదయం 6గంటలకు తిరుపతిలో బయలుదేరుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు సీఆర్‌వో, తిరుపతి, 98480 07033, కడప డీజీఎం 90103 18811, కర్నూలు డీవీఎం 96401 77759, హైదరాబాద్ ఐఆర్‌వోలను సంప్రదించాలని తెలిపారు. రెండో రూట్ బస్సు ఫిబ్రవరి 12న ఉదయం 6గంటలకు నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయం నుంచి బయలుదేరుతుందన్నారు. ఈ బస్సు నెల్లూరు నుంచి విజయవాడ, రాజమండ్రి, అన్నవరం, విశాఖపట్నం, పూరి, కోణార్క్, భువనేశ్వర్, కటక్, చండీపూర్, గయ, బుద్ధగయ, కాశీ, ప్రయాగ్‌రాజ్‌కు వెళుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు నెల్లూరు డీవీఎం 98480 07024, విజయవాడ సీఆర్‌వో 98480 07025, ఐఆర్‌వో రాజమండ్రి 98486 29341, విశాఖపట్నం సీఆర్‌వో 98488 13584, 98480 07022లను సంప్రదించాలన్నారు. టికెట్ల రిజర్వేషన్ www.aptde.in లేదా turijam apgov.in ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

సామాన్యుల్లా శ్రీవారి దర్శనానికి!

- వీవీఐపీ బ్రేక్‌లో అవకాశం ఉన్నా సర్వదర్శనం క్యూలో మాజీ గవర్నర్ కుటుంబం



తిరుమల శ్రీవారి ఆలయం ముందు విద్యాసాగర్ రావు, పక్కన భానుప్రకాశ్‌రెడ్డి

తిరుమల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మాజీ గవర్నర్‌గా తనతో పాటు కుటుంబ సభ్యులు కూడా ప్రాధాన్య బ్రేక్‌లో శ్రీవారి దర్శనం చేసుకునే అవకాశం ఉన్నా మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు ఆదర్శంగా నిలిచారు. ఆయన గురువారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో దర్శనానికి వెళ్లగా, కుటుంబసభ్యులు మాత్రం శనివారం అర్ధరాత్రి సర్వదర్శనం క్యూలైన్‌లో వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. దాదాపు నాలుగు గంటలపాటు వారంతా క్యూలైన్‌లోనే ఉండి సాధారణ భక్తులతో కలిసి స్వామి దర్శనం చేసుకోవడం విశేషం.

శిలాతోరణం వద్ద చిరుత సంచారం



కొండపై ఉన్న చిరుత

తిరుమల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల శిలాతోరణం సర్కిల్‌లోని ఓ కొండపై గురువారం సాయంత్రం చిరుత కూర్చుని ఉండటాన్ని కొందరు స్థానికులు గుర్తించారు. తమ సెల్‌ఫోన్‌లో వీడియో తీసుకుని టీటీడీ విజిలెన్స్, ఫారెస్ట్ అధికారులకు సమాచారమిచ్చారు. ఈక్రమంలో వాహనదారులను, భక్తులను అధికారులు అప్రమత్తం చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శతప్రయోగాల 'కోట'

ఎడ్లబండి మీద ఉపగ్రహాన్నీ, సైకిల్‌మీద రాకెట్ విడిభాగాలను తీసుకుపోయిన కాలంనుంచి అంతరిక్షకేంద్రం నిర్మాణానికి అరం గేట్రం చేయడం వరకూ భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం 'ఇస్రో' ప్రస్థానాన్ని ఒకమారు తలచుకొని పులకించిపోయేందుకు బుధవారం నాటి వందో రాకెట్ ప్రయోగం ఉపకరిస్తుంది. దేశంతో పాటుగానే ఇదీ ఎదిగింది, అంతేకదా అని ఎంత సర్దిచెప్పుకుందామనుకున్నా, బడ్జెట్ కేటాయింపుల్లో పాలకులు ప్రదర్శించే కాఠిన్యాన్నీ, కాపీనాన్నీ కూడా తట్టుకొని నిలిచి, దక్కినదానితోనే అనేకానేక సాహసోపేతమైన ప్రయోగాలతో ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచేసిన హీరో మన ఇస్రో.

శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్‌సెంటర్‌లోని రెండోలాంచ్‌ప్యాడ్ నుండి మొన్న చేసిన సెంచరీతో ఇస్రో కీర్తిపతాకం గగనవీధుల్లో రెపరెపలాడింది. ఈ శతప్రయోగాల వేదిక శ్రీహరికోటను భారత అంతరిక్ష పరిశోధనావ్యవస్థ పితామహుడు విక్రమ్‌సారాభాయ్ రాకెట్ ప్రయోగ కేంద్రంగా ఎంచుకోవడం మీద చాలా కథనాలు ఉన్నాయి. ప్రయోగ కేంద్రం భూమధ్యరేఖకు ఎంత దగ్గరగా ఉంటే అంత తక్కువ ఇంధనంతో రాకెట్ భూమ్యాకర్షణశక్తిని అధిగమించగలుగుతుంది. ఆ లెక్కన శ్రీహరికోట ప్రపంచంలో రెండోస్థానంలో ఉందట. రాకెట్ ప్రయోగకేంద్రం దేశం తూర్పుతీరంలో ఉండటం వల్ల అనేక అదనపు సాంకేతిక, భద్రతా ప్రయోజనాలు ఉన్నాయి. శ్రీహరికోట దీవిని ఎంపిక చేయడానికి ముందు, కన్యాకుమారి తీరంలో కేంద్రాన్ని నెలకొల్పే ప్రతిపాదన మీద చర్చించడానికి విక్రమ్‌సారాభాయ్ కొంతమంది శాస్త్రవేత్తలతో అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి అన్నాదురైతో సమావేశమయ్యేందుకు వెళ్ళారట. ఆ రోజు అన్నాదురైకి ఒంట్లోబాగోలేక తన బదులు ఓ మంత్రిని వెళ్ళమన్నారట. ఆ మంత్రి ఎంతకూ రాకుండా చాలాసమయం విక్రమ్‌సారాభాయ్‌ని నిరీక్షించేట్టు చేశారు, చివరకు ఒంటిమీద ఏ మాత్రం స్పృహలేని స్థితిలో ఉన్న ఆయనను కొందరు అక్కడకు మోసుకొచ్చి కూచోబెట్టారు. మంత్రిగారి అర్థంపర్థంలేని మాటలను భరించలేకపోయిన సారాభాయ్ పూర్తిగా విసుగుచెంది తమిళనాడు వద్దేవద్దని అనుకున్నారట. సరిగ్గా అదే సమయంలో 26వేల ఎకరాల శ్రీహరికోటదీవిని ఇచ్చేస్తామంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవచూపడంతో సారాభాయ్ సంతోషంగా దానిని స్వీకరించారని సుప్రసిద్ధ శాస్త్రవేత్త నంబినారాయణ్ తన ఆత్మకథలో రాశారు. సారాభాయ్ ఆదేశం మేరకు ఇస్రో శాస్త్రవేత్త ఆర్ఎం వసగమ్ తమిళనాడులోనే రెండుప్రాంతాలను రాకెట్ ప్రయోగకేంద్రం కోసం గుర్తిస్తే, అప్పటి డీఎంకె మంత్రి అనుచిత ప్రవర్తనతో అది ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోయి పులికాట్ సరస్సు సరసన వెలసింది. గత ఏడాది డీఎంకె మంత్రి ఒకరు కులశేఖరపట్నం లాంచ్‌ప్యాడ్ శంకుస్థాపన సందర్భంలో విడుదల చేసిన పత్రికాప్రకటనలో ఇస్రో రాకెట్ బదులు చైనా రాకెట్ బొమ్మ వాడటంపై తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు విమర్శలు చేసిన సందర్భంలో, ఆరుదశాబ్దాలనాటి ఈ గతం తిరిగి తెరమీదకు వచ్చింది.

మరో రెండేళ్ళలో కులశేఖరపట్నం అంతరిక్ష ప్రయోగకేంద్రం కూడా అందుబాటులోకి రాబోతున్నందున ఇస్రో ప్రయోగ సామర్థ్యం ద్విగుణం బహుళం అవుతుంది. తొలి వంద రాకెట్ ప్రయోగాలకు నలభైఐదేళ్ళుపడితే మరో ఐదేళ్ళలోనే మరో వంద ప్రయోగిస్తామని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ సగర్వంగా చెబుతున్నారు. చంద్రయాన్ 4, చంద్రయాన్ 5, మార్స్ లాండర్, వీనస్ ఆర్బిటర్, పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీని మించిన కొత్తతరం వాహకనౌక గురించి ఆయన ఆలోచనలు చేస్తున్నారు. ఇదంతా ఆత్మవిశ్వాసమే తప్ప అతిశయం కాదు. నేడు అగ్రరాజ్యాల సరసన ఇలా తలెత్తుకొని నిలబడటంలో సోవియట్ యూనియన్ సహకారం విస్మరించలేనిది. ఆ తరువాత సదరు సహకారానికీ, పరిజ్ఞానం బదలాయింపుకీ అడ్డుపడుతూ అమెరికా మనను పెట్టిన కష్టాలు స్వదేశీపరిశోధనలకు ఊతమిచ్చాయి. అదిలింపులు, బెదిరింపులు, అవమానాలు అధిగమించి సొంతకాళ్ళమీద ఎదిగిన ఇస్రో గగనయానాలు, చంద్రయానాలు, సూర్యనమస్కారాలు, అంగారక అధ్యయనాలతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది. ఆంగ్ల చిత్రాలకంటే తక్కువ ఖర్చుతో అంతరిక్షయాత్రలు చేసివస్తోంది. ఒకేమారు వంద ఉపగ్రహాలను విభిన్నమైన కక్ష్యల్లోకి వెదజల్లగలిగే సమర్థతను పెంచుకొని, ఐదువందల యాభై ఉపగ్రహాలను నింగికి చేర్చింది. విదేశీ ఉపగ్రహప్రయోగ వ్యాపారం చేస్తూ దేశానికి సంపాదించిపెడుతోంది. అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానించి, మళ్ళీ విడదీసిన ఇటీవలి 'స్పేడెక్స్' విన్యాసం ఇస్రో సాధించిన మరో సాంకేతిక అద్భుతం. ఇలా నిరంతరం సాంకేతిక సామర్థ్యాన్ని పెంచుకుంటూ విక్రమ్‌సారాభాయ్, సతీష్‌ధావన్ ఇత్యాది మహామహుల కలలను నిజం చేస్తూ, దేశాన్ని స్పేస్ సూపర్‌పవర్‌గా తీర్చిదిద్దుతున్న ఇస్రోను అభినందించాలి.

ధాత్రికి దాపురించిన పాడుకాలం!

డొనాల్డ్ ట్రంప్ తాను ఆశించింది చేశారు, మనం ఊహించిందే పూర్తి చేశారు. లక్షలాది మైళ్ల దూరం నుంచి, ఆ నడి రాత్రి ట్రంప్ విజయ గర్వంతో ఆర్భాటంగా తన దేశాన్ని పారిస్ ఒడంబడిక నుంచి వైదొలిగింపచేసేందుకు ఉద్దేశించిన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుపై సంతకం చేయడాన్ని, వీక్షించాను. 'ఈ నిర్ణయంతో, లక్షల కోట్ల డాలర్లను ఆదా చేసుకోనున్నా'మని హర్షధ్వానాలు చేస్తున్న తన అభిమానుల నుద్దేశించి అమెరికా కొత్త అధ్యక్షుడు అన్నారు.

హరిత ఉద్యమాలకు సంబంధించిన ప్రతి అంశాన్ని ట్రంప్ గతంలో కంటే ఇప్పుడు మరింత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వాతావరణ మార్పుతో సంభవిస్తున్న విధ్వంసం ఎల్లెడలా ప్రతి ఒక్కరి అనుభవంలోకి వస్తోన్న రోజులివి. ట్రంప్ పదవీ ప్రమాణ స్వీకారోత్సవం ఆనవాయితీ ప్రకారం కాంగ్రెస్ భవనం వెలుపల లక్షలాది ప్రజల సమక్షంలో కాకుండా లోపల జరిగింది. చలిగాడ్పులు ప్రచండంగా ఉండడమే అందుకు కారణం. ఉత్తర ధ్రువ ప్రాంతాలలో సుడిగాలులు మరింత చంచలమై అమెరికా పశ్చిమ తీర ప్రాంతాలను బలంగా తాకాయి. ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవ సమయంలోనే లాస్‌ఏంజెలెస్‌లో సంపన్నుల, సెలెబ్రిటీల విశాల హర్మ్యాలు దావానలంలో మాడి మసి అయిపోతున్నాయి. ప్రతి ప్రాంతమూ, సామాన్యులూ సంపన్నులూ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ప్రకృతి విపత్తులకు గురవుతుండగా వాతావరణ మార్పు అనేది ఒక మిథ్య అని వాదించడంలో విజ్ఞత ఏమైనా ఉన్నదా? రార్, వాతావరణ మార్పు ఒక అభూతకల్పన అని ట్రంప్ మహాశయుడు ఘోషిస్తున్నాడు. ఆయనకు ఓటు వేసినవారిలో అత్యధికులు సైతం ఆయన వాదనతో ఏకీభవించేవారే.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

వాతావరణ మార్పు అనే పదం ట్రంప్ రాజకీయ పరిభాషలో లేనే లేదు. అది రాజకీయంగా సరైన భావన కాదు అనేది ఆయన సునిశ్చిత విశ్వాసం. ట్రంప్ వైఖరికి మరో బలమైన కారణమున్నది. శిలాజ ఇంధనాల వాడకం పెరగాలని, విదేశాలకు తరలిపోయిన తయారీ రంగ పరిశ్రమలను మళ్లీ స్వదేశానికి తీసుకురావాలనేది ఆయన లక్ష్యం. 'డ్రిల్, బేబీ, డ్రిల్'కు వ్యతిరేకత అనేది లేకుండా పోవాలంటే వాతావరణ మార్పు అంశాన్ని పూర్తిగా తిరస్కరించి తీరాలని ట్రంప్ విశ్వసిస్తున్నారు. స్వచ్ఛ ఇంధనానికి పరివర్తన ప్రణాళికలను నిరోధించేందుకు అమెరికాలో లభ్యమయ్యే సహజ వాయువును సమస్త దేశాలకు సరఫరా చేయాలని ట్రంప్ భావిస్తున్నారు. అధిక సుంకాల భారం పడకుండా ఉండాలంటే తమ సహజవాయువును యూరోపియన్ దేశాలు కొనుగోలు చేయవలసిందేనని ట్రంప్ నిర్దేశిస్తున్నారు. అలాగే ఇంటర్నల్ కంబస్టియన్ ఇంజిన్ (అంతర్దహన యంత్రం) వాహనాలను మళ్లీ రంగంలోకి తీసుకురావాలని ట్రంప్ ప్రగాఢంగా ఆకాంక్షిస్తున్నారు. ఆ వాహనాల సాంకేతికతలు, తయారీలో అమెరికా అగ్రగామిగా ఉండడమే ట్రంప్‌ను అందుకు పురిగొల్పుతోంది విద్యుత్ వాహనాల రంగంలో చైనా అగ్రగామిగా ఉందన్న వాస్తవాన్ని ట్రంప్ విస్మరించలేరు. మొత్తం మీద అంతర్జాతీయ వాణిజ్యం, ప్రపంచ రాజకీయాలు అమెరికా ఆధిపత్యం, పెత్తనంలో ఉండాలనేది ఆయన అభిమతం. ప్రపంచ దేశాలు, వాటి వాణిజ్యంపై అమెరికా ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు ఆయన ఆరంభించిన చరిత్రాత్మక పోరాటంలో వాతావరణ మార్పును నిరోధించడమనేది ఒక అప్రధాన విషయమే.



ప్రపంచ దేశాలు, వాటి వాణిజ్యంపై అమెరికా ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు డొనాల్డ్ ట్రంప్ ఆరంభించిన చరిత్రాత్మక పోరాటంలో వాతావరణ మార్పును నిరోధించడమనేది ఒక అప్రధాన విషయమే. మానవాళి మనుగడకు ఈ భూమి తప్ప మరో గ్రహం లేదు. ఈ భూమిని మన నివాసానికి అనుకూలంగా కాపాడుకోవడమే మన ముందున్న మార్గం. ట్రంప్ యుగంలో ఇదెలా సాధ్యమవుతుంది? దీనిపై చర్చను మనం కొనసాగించి తీరాలి.

ట్రంప్ ప్రతికూల వైఖరితో వాతావరణ మార్పుపై పోరుకు చాలా హాని వాటిల్లుతుంది. అసలు భూ ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణమైన హరిత గృహ వాయు (జిహెచ్‌జి) ఉద్గారాలకు ఇతోధికంగా దోహదం చేసింది, చేస్తోంది అమెరికాయే కాదూ? ఈ వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. వర్తమానంలోనే కాదు, చారిత్రకంగా కూడా భూతాపం పెరుగుదలలో ప్రధాన బాధ్యత అమెరికాదే. ఇప్పుడు జిహెచ్‌జి కాలుష్యం వెనుక ప్రథమ స్థానంలో చైనా ఉండగా ద్వితీయ స్థానంలో అమెరికా ఉన్నది. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ పాలనలో 2030 సంవత్సరానికల్లా కాలుష్యకారక వాయు ఉద్గారాలను 50– 52 శాతం తగ్గించేందుకు, 2035 నాటికి 61–66 శాతానికి తగ్గించేందుకు అమెరికా ప్రభుత్వం వాగ్దానం చేసింది. ఇప్పుడు ట్రంప్ అసలు ఆ అంశాలను పరిగణనలోకే తీసుకోవడం లేదు.

బైడెన్ హయాంలో వాతావరణ మార్పుపై పోరులో అమెరికా సరైన మార్గంలో ఉందని నేను చెప్పబోవడం లేదు. నిజానికి గత కొద్ది సంవత్సరాలుగా అమెరికా తన కాలుష్యకారక వాయు ఉద్గారాలను చాలా తక్కువగా మాత్రమే తగ్గించింది. అయితే మరింత ఎక్కువగా తగ్గించేందుకు హామీ ఇవ్వడమే కాకుండా అందుకు నిబద్ధతతో వ్యవహరిస్తుంది కూడా. హరిత ఒప్పందాల అమలు సాధ్యమయ్యేందుకు ద్రవ్యోల్బణ తగ్గింపు చట్టం (ఐఆర్ఏ) విశేషంగా తోడ్పడింది. పునరుద్ధరణీయ ఇంధనం, విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంపొందించేందుకు బైడెన్ ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టింది. ట్రంప్ రెండోరాకడతో ఇదంతా మారిపోయింది. వచ్చిన రెండు రోజులలోనే అమెరికా వ్యాప్తంగా ఇంధన అత్యవసర పరిస్థితిని విధించారు.

ట్రంప్ విధానాల ఫలితంగా కాలుష్యకారక వాయు ఉద్గారాలు మరింతగా తప్పక పెరుగుతాయి. అమెరికా ఉద్గారాలు 2005లో గరిష్ఠ స్థాయిలో రికార్డయ్యాయి. వస్తూత్పత్తి పరిశ్రమలను మళ్లీ స్వదేశానికి తీసుకువచ్చి ఉద్యోగాల కల్పనను పెంపొందిస్తానని ట్రంప్ పదే పదే చెబుతున్నారు. అదే జరిగినప్పుడు జిహెచ్‌జి ఉద్గారాలూ పెరుగుతాయి.

సరే, కృత్రిమ మేధ అభివృద్ధి, పర్యవసానాలనూ విస్మరించలేము. డేటా సెంటర్లకు విద్యుత్ ఇతోధికంగా అవసరమవుతుందని అంచనా. ఈ విద్యుత్‌ను శిలాజ ఇంధనాల నుంచే ఉత్పత్తి చేయాలనది ట్రంప్ నిర్దేశం. ట్రంప్ పునరాగమనం శుభకర పరిణామమేమీ కాదు. ఇప్పటికే కాలుష్యకారక వాయు ఉద్గారాల తగ్గింపునకు సంకోచిస్తున్న వివిధ దేశాల ప్రభుత్వాలు ట్రంప్ స్ఫూర్తితో శిలాజ ఇంధనాల వాడకాన్ని పెంచేందుకు సానుకూలమవుతాయి. అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలు శిలాజ ఇందనాలపై ఆధారపడటం మరింతగా పెరుగుతుంది. ఇదంతా నిరుత్సాహాన్ని కలిగిస్తోంది కదూ. అయితే ఒక ఆశారేఖ లేకపోలేదు. సకల దేశాల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వాతావరణ మార్పు ప్రభావాలను నెదుర్కొనేందుకు సమష్టిగా చర్యలు చేపట్టాలి. దీనివల్ల ప్రకృతి ఉత్పాతాల తీవ్రత తగ్గిపోగలదు. మన మనుగడకు ఈ భూమి తప్ప మరో గ్రహం లేదు. ఈ భూమిని మన నివాసానికి అనుకూలంగా కాపాడుకోవడమే మన ముందున్న మార్గం. అయితే ట్రంప్ యుగంలో అదెలా సాధ్యమవుతుంది? దీనిపై చర్చను మనం కొనసాగించి తీరాలి.

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

ట్రంప్, మోదీ 'మంచి' స్నేహితులు కాగలరా?

'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' అని సెప్టెంబర్ 2019లో టెక్సాస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘోషించారు. నాటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2020లో జరగనున్న అధ్యక్ష పదవీ ఎన్నికలలో కచ్చితంగా విజయం సాధిస్తారనే తన విశ్వాసాన్ని మోదీ అలా సుదృఢంగా వ్యక్తం చేశారు. కొద్ది నెలల అనంతరం ఫిబ్రవరి 2020లో అహ్మదాబాద్‌లో 'నమస్తే ట్రంప్' అనే ఒక బృహత్తర బహిరంగ కార్యక్రమంలో కూడా మోదీ అదే విశ్వాసాన్ని మళ్లీ వ్యక్తం చేశారు. 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' అనేది ఒక తప్పుడు అభిప్రాయం. ఔచిత్య రహితంగా అత్యుత్సాహంతో బహిరంగపరిచిన ఒక పొరపాటు నిర్ణయం. కనుకనే 2020 నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితం మోదీని దిగ్భ్రాంతి పరిచింది. డొనాల్డ్ ట్రంప్ ఆ ఎన్నికలలో అనూహ్యంగా ఓడిపోయారు. గత నాలుగేళ్లుగా వాషింగ్టన్‌లో 'అబ్ కీ బార్ బైడెన్ సర్కార్' అనే భావన బలంగా ఉన్నది. నవంబర్ 2024 అధ్యక్ష ఎన్నికలలో ట్రంప్ అనూహ్యంగా భారీ మెజారిటీతో గెలిచారు. మరి 2019–20లో ట్రంప్, మోదీ మధ్య వర్ధిల్లిన స్నేహ సంబంధాలు పునరుజ్జీవమవుతాయా అన్నది ఇప్పుడు మన ముందున్న ప్రశ్న.



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఇటీవల టెలిఫోన్‌లో జరిపిన ఉభయ కుశలోపరిలో ట్రంప్‌ను తన 'ప్రియమైన స్నేహితుడు'గా మోదీ అభివర్ణించారు. శక్తిమంతులైన ఈ నాయకులు ఇరువురూ జనాలను ఆకట్టుకోవడంలో సాటిలేని ఘనాపాటీలు అనడంలో సందేహం లేదు. వారి వ్యవహారశైలులు అప్పుడప్పుడు ఆశ్చర్యకరంగా ఒకే తీరులో ఉండడం పరిపాటి. జనాకర్షక నినాదాల ప్రాధాన్యం, ఉపయుక్తతను ఇరువురూ బాగా అర్థం చేసుకున్నవారే. అటువంటి నినాదాలతో బాగా లబ్ధి పొందినవారు కూడా. 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అనేది ట్రంప్ నినాదం కాగా 2047 నాటికి వికసిత్ భారత్‌కు దారితీసే 'అమృత్ కాల్'ను సృష్టిస్తానని నరేంద్ర మోదీ వాగ్దానం చేశారు. కాలం చెల్లిన ఉదారవాద రాజకీయాలపై మితవాద జాతీయవాదం విజయానికి ప్రతినిధులుగా మోదీ, ట్రంప్‌లను వారి అభిమాన గణాలు భావిస్తున్నాయి. గత కాలం ల్యూటెన్స్ కులీన వర్గాల ప్రాబల్యాన్ని మోదీ దెబ్బతీయగా వాషింగ్టన్ సంప్రదాయ పాలక వర్గాల ప్రాబల్యానికి ట్రంప్ విఘాతం కలిగించారు. వలసకారులకు వ్యతిరేకంగా ట్రంప్ గర్జనలు, భారతీయ ముస్లింలను 'అంతర్గత శత్రువులు'గా పరిగణించే మోదీ మద్దతుదారులలో పూర్తిగా ప్రతిధ్వనించాయి. వలసకారులను నిరోధించేందుకు సరిహద్దుల్లో గోడలు నిర్మించాలని ట్రంప్ మద్దతుదారులు కోరుతుండగా మసీదుల స్థానంలో ఆలయాలను నిర్మించేందుకు మోదీ అనుయాయులు ప్రయత్నిస్తున్నారు. ఒక 'శాశ్వత' శత్రువు కోసం అన్వేషణ అటు ట్రంప్, ఇటు మోదీ మద్దతుదారులను సమ్మోగ్ధం చేస్తోంది, కార్యనిమగ్నులనూ చేస్తోంది.

ఎటువంటి రాజకీయ అనుబంధంలోనైనా మిత్రుడు లేదా భాగస్వామి కంటే తాను తక్కువ స్థానంలో ఉండడాన్ని మోదీ ససేమిరా అంగీకరించరు. జన నీరాజనాలను మరెవ్వరితోను కలిసి పంచుకోవడానికి ట్రంప్ ఎట్టి పరిస్థితులలోను సుముఖత చూపరు. 2019–20లో ఇరువురి మధ్య వర్ధిల్లిన స్నేహసరసతలు ఇప్పుడు వారి సంబంధాలపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయన్నది నిశ్చితంగా చెప్పలేము.

ట్రంప్–మోదీల మధ్య సమాంతరాలను అత్యుక్తులుగా చెప్పుకోనవసరం లేదు. నిజం చెప్పాలంటే వారి మధ్య సదృశాల కంటే వ్యత్యాసాలే ఎక్కువ. ఇరువురి రాజకీయ ప్రస్థానాలు చాలా భిన్నమైనవి. మోదీ ఒక అర్ధ శతాబ్ది కాలంగా రాజకీయాలలో ఉన్నారు. ఆరెస్సెస్ ప్రచారక్‌గా ప్రారంభమై క్రమంగా రాజకీయ సోపానాలను అధిరోహించి ప్రధానమంత్రి పదవికి చేరుకున్నారు. మోదీకి భిన్నంగా ట్రంప్ ఒక విజయవంతమైన వ్యాపారి. బీజేపీ శ్రేణుల నుంచి మోదీ ప్రభవించగా ట్రంప్ రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష పదవీ అభ్యర్థిత్వాన్ని సర్వోత్కృష్టమైన 'బయటి వ్యక్తి'గా కైవసం చేసుకున్నారు. మోదీ తనను తాను ఒక హిందూత్వ యోధుడుగా తీర్చిదిద్దుకున్నారు. లావాదేవీలు, ఒప్పందాల విషయంలో అనితర సాధ్యుడైన నేర్పరిగా ట్రంప్ ప్రసిద్ధి పొందారు. మోదీలో భావజాల అభినివేశం పరిపూర్ణంగా ఉండగా ట్రంప్‌లో వ్యాపార కాంక్షలు ఆయన స్వాభావిక ప్రవృత్తిగా ఉండడం కద్దు. ఈ నాయకులిరువురూ వ్యక్తి పూజను ప్రోత్సహించినవారే. ఇరువురిలోను స్వానురాగ ప్రవృత్తి అమితంగా ఉంది.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

మోదీ తన పదేళ్ల ప్రధాన మంత్రిత్వ కాలంలో తరచు అధికార రాజకీయాల సంప్రదాయ సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించి భారత రాజకీయాలపై తనదైన ముద్ర వేశారు. అప్పుడప్పుడూ తన ప్రత్యర్థులను ఆత్మరక్షణలోకి నెట్టివేసేందుకు దిగ్భ్రాంతికరమైన నిర్ణయాలు తీసుకున్నారు. తద్వారా ప్రత్యర్థులను భయోత్పాతానికి గురిచేశారు. 2016లో పెద్దనోట్ల రద్దు అటువంటి చర్యే. నల్లధనాన్ని సంపూర్ణంగా నిర్మూలించే పేరిట ఆయన ఆ నిర్ణయం తీసుకున్నారు. విధాన నిర్ణయాల రూపకల్పన ప్రక్రియను చాలవరకు కేంద్రీకృతం చేసినప్పటికీ రాజకీయ ఔచిత్య లక్ష్మణ రేఖను మోదీ ఎన్నడూ ఉల్లంఘించలేదు. ఒక పొరుగు దేశాన్ని బెదిరించేందుకు అర్ధరాత్రి సమయంలో మోదీ ట్వీట్ చేయడమనేది ఎన్నడూ జరగలేదు. ఆయన ఆ విధంగా వ్యవహరించడమనేది ఎప్పటికీ జరగని పని అని కూడా నిశ్చితంగా చెప్పవచ్చు.

మోదీకి భిన్నంగా ట్రంప్ నిత్యం ఆమోదయోగ్యమైన రాజకీయ ప్రవర్తనా నియమాలకు విరుద్ధంగా వ్యవహరించడం పరిపాటి. అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన వారం రోజుల్లోనే ఆయన ఎన్నో కటువైన ప్రకటనలు చేశారు; తీవ్ర పర్యవసానాలకు దారితీసే ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులు జారీ చేశారు. అవన్నీ తన ప్రత్యర్థులు, వ్యతిరేకులను గందరగోళపరిచేందుకు, వారిని సవాల్ చేసేందుకు ఉద్దేశించినవేనని మరి చెప్పనవసరం లేదు. అమెరికా అధ్యక్షుడిది అద్వితీయమైన వైయక్తిక వ్యవహారశైలి. రాజకీయ విజ్ఞతకు అందులో స్థానం లేదు. ఎవరేమనుకున్నా ట్రంప్ లెక్క చేయరు. తాను చేయాలనుకున్నది చేసి తీరుతారు. తన నిర్ణయాలకు, చర్యలకు విస్తృత స్థాయిలో ఆమోదం పొందేందుకు మోదీ తప్పక ప్రయత్నిస్తారు. స్వచ్ఛ భారత్ ప్రచారానికి లోగోగా వినియోగించుకునేందుకు మహాత్మాగాంధీ కళ్లజోడును ఎంపిక చేసుకోవడమే అందుకొక నిదర్శనం. ట్రంప్‌కు తన స్వదేశ గతంతో తాదాత్మ్యత లేదు. చరిత్ర గురించిన ఆయన దృష్టి స్వయం ప్రతిష్ఠకు మాత్రమే పరిమితమయింది.

ఇప్పుడు మనం అసలు ప్రశ్నకు వద్దాం: ఆ నాటి చెలిమికి ఐదు సంవత్సరాలు అంతరాయమేర్పడిన అనంతరం ఇప్పుడు మళ్లీ పాత స్నేహం కుసుమిస్తున్న సమయంలో డోనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీ ఎలా కలిసికట్టుగా ముందుకు సాగుతారు? ఎటువంటి రాజకీయ అనుబంధంలోనైనా మిత్రుడు లేదా భాగస్వామి కంటే తాను తక్కువ స్థానంలో ఉండడాన్ని మన మోదీ ససేమిరా అంగీకరించరు కదా. ఇక ట్రంప్ విషయానికి వస్తే జన నీరాజనాలను మరెవ్వరితోను కలిసి పంచుకోవడానికి ఆయన ఎట్టి పరిస్థితులలోను సుముఖత చూపరు గాక చూపరు. తమ ఉభయులలో తానే గొప్ప అనే అభిజాత్యాన్ని ప్రదర్శించేందుకు ట్రంప్, మోదీ ఇరువురూ తప్పక ప్రయత్నిస్తారు. ప్రతి ఒక్కరినీ సతాయించేందుకు లేదా భయపెట్టేందుకు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమైనప్పటికీ ఆయనతో సమావేశమయినప్పుడు తమ వైఖరి, అభిప్రాయాలను నిక్కచ్చిగా వ్యక్తం చేసేందుకు ప్రధాని మోదీ ఆయన మంత్రివర్గ సహచరులు, ఉన్నతాధికారులు దృఢనిశ్చయంతో ఉన్నారు. సౌష్ఠవం లోపించిన స్నేహబంధంగా భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాలను పరిగణించాలి. నడుస్తున్న చరిత్రను ప్రభావితం చేయగల శక్తి సామర్థ్యాలు ప్రస్తుతం లేకపోయినప్పటికీ అమెరికా ఇప్పటికీ ప్రపంచ అగ్రగామిగా వెలుగొందుతోంది. అగ్రరాజ్య హోదాను ప్రగాఢంగా కోరుకుంటున్న భారత్, అంతర్జాతీయ వ్యవహారాలలో తనకొక ప్రత్యేక గుర్తింపు, మరింత ప్రాధాన్యాన్ని భారత్ ఎంతగా అభిలషిస్తోందో మరి చెప్పనవసరం లేదు. 'అమెరికా ఫస్ట్' అనే లక్ష్యానికి అనుగుణమైన రీతిలో ఒక సువిశాల లాభప్రద మార్కెట్‌గా భారత్‌ను ట్రంప్ భావిస్తున్నారనడంలో సందేహం లేదు. అయితే భారత్‌ను ఒక విశ్వసనీయమైన వ్యూహాత్మక మిత్ర దేశంగా వాషింగ్టన్ చూడగలదనే ఆశాభావం మోదీకి ఇంకా ఉన్నది.

భారత్, చైనాలు అధిక సుంకాలతో బాగా లబ్ధి పొందుతున్న దేశాలుగా ట్రంప్ గట్టిగా భావిస్తున్నారు. తన విలక్షణ శబ్దాడంబరంతో నిరసిస్తున్నారు కూడా. ఇది మనకు ఎంతైనా ఆందోళనకరమైన విషయమే. దౌత్య మర్యాదలు పాటించే ఓర్పు, నేర్పు ట్రంప్‌కు లేవు. సభ్యతా సంస్కారాలకు విరుద్ధంగా వ్యవహరించేందుకు ఆయన వెనుకాడరు. ఆయన ప్రపంచ దృక్పథంలో వాణిజ్య ప్రయోజనాలకు అగ్ర ప్రాధాన్యమున్నది. మరి ఇటువంటి నాయకుడిని మిత్రుల ప్రశస్త మాటలు, పాత స్నేహాలు కదిలిస్తాయా? చెప్పవచ్చిన దేమిటంటే భవిష్యత్తులో భారత్, చైనాలు రెండిటితోనూ తన సొంత షరతులపై వ్యవహరించేందుకు, ఒప్పందాలు చేసుకునేందుకు ట్రంప్ తప్పక ప్రయత్నిస్తారు. ఎందుకు? అమెరికా ప్రయోజనాలు కాపాడేందుకే. ఈ విషయమై ఎవరికీ ఎటువంటి సందేహం ఉండనక్కరలేదు.

అమెరికాతో మన సంబంధాలు ఎలా పరిణమించనున్నాయి? ఈ విషయంలో వచ్చే కొద్ది నెలలపాటు భారత్ చాలా జాగ్రత్తగా ఉండాలి. అంతిమంగా జరిగేది మన ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటుందో లేదో ఇప్పుడే చెప్పలేము. వేచి చూడాలి. ట్రంప్‌తో సఖ్యతకు మోదీ ప్రయత్నిస్తారా? 2019 అమెరికా అధ్యక్ష ఎన్నికల తరుణంలో తనకు బహిరంగంగా పరిపూర్ణ మద్దతునిచ్చిన విషయాన్ని ట్రంప్‌కు ఆయన గుర్తు చేయవచ్చు. పాత స్నేహసరసతలు ప్రస్తుత సంబంధాలపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయన్నది నిశ్చితంగా చెప్పలేము. సమస్యేమిటంటే తననుతాను గొప్పగా ప్రకటించుకునే రియాల్టీ షోలో అమెరికా అధ్యక్షుడు ఒక బిగ్‌బాస్ లాంటి వ్యక్తి. ఈ షోలో కేవలం ఒకే ఒక్కరి – బిగ్‌బాస్– మాటే తొలి, తుది మాట. దానికే సమస్త ప్రాధాన్యం. భారత్‌తో సహా విశాల ప్రపంచమంతా కేవలం ప్రేక్షకులు మాత్రమే. మరి ఈ ట్రంప్ షోలో తదుపరి అంకం ఏమిటో ఎవరికీ తెలియదు. నమ్మకంగా చెప్పగలిగేవారు కూడా ఎవరూ లేరు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

చరిత్ర పొడుగునా...

పారదర్శకమైన పదాల వెనకే
దాగివున్న రహస్యాలు,
వాక్యవిన్యాసంతో
మాయచేసే వ్యాఖ్యానాలు
సంస్థాగత గోడలన్నీ
మరిన్ని విస్తరిస్తున్నా భూగోళంపై
ఆర్థిక విశ్లేషణలతో
మురిసిపోడమే మిగిలింది!

పరిష్కారాలు ఎన్నివున్నా
అగ్రరాజ్యాల ఆధిపత్యం విస్తరించిన
ఆఫ్రికా, ఆసియా ఖండాల–
సుదీర్ఘ ఆకలియాత్రలలో
తెగల–మతాల సంకుల సమరంలో
తెగిన తలలు చెప్పిన రహస్యాలు
చరిత్రపొడుగునా
ఎండిన రక్తపుటేరుల జాడలే!!

– నిఖిలేశ్వర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

సామాజిక అసమానతలపై గళమెత్తిన గద్దర్

ప్రజా వాగ్గేయకారుడు, ప్రజా కవి, కళాకారుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ తన పాటలతో ప్రజలలో ఉత్తేజాన్ని కలిగించారు, ముఖ్యంగా తెలంగాణ ఉద్యమానికి ఊపు తెచ్చారు. ఆ గొంతు శాశ్వతంగా మూగబోయి పద్దెనిమిది నెలలయింది. గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్‌రావు, మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన లచ్చమ్మ, శేషయ్య దంపతులకు జనవరి 31, 1949లో జన్మించారు. దాదాపు అరవై వసంతాలకు పైగా ప్రజలతో మమేకమై ఎన్నో ప్రజా ఉద్యమాలకు తన మాట, పాట ద్వారా ఊపిరి నింపిన విప్లవకారుడు ఆయన. నక్సల్బరీ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, దళిత బహుజన ఉద్యమం, సాంస్కృతిక ఉద్యమం ఇలా అన్ని ఉద్యమాలలో తన పాటలతో ప్రజా జీవితాలను ప్రభావితం చేశారు. ప్రభుత్వాలను కదిలించారు.

'బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి ఏ బండ్లో పోతావ్ కొడకో నైజాము సర్కరోడా' అని రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ విమోచన కొరకు గళమెత్తారు. 1980లో చాల ఇళ్లలో 'భద్రం కొడుకో నా కొడుకో కొమరన్న', మదన సుందరి..., 'భారతదేశం భాగ్యసీమరా సకల సంపదలు గల్ల దేశమున దరిద్రమెట్లుందో నాయన, నీతి గల్ల మన దేశంలోన అవినీతెందుకు పెరిగిపోయెర' పాటలు వినిపించేవి. చుండూరు దళితుల ఊచకోతకు వ్యతిరేకంగా 'జ్ఞానం ఒక్కరి సొత్తు కాదన్న అది సర్వజాతుల సంపదోరన్న, దళిత పులులమ్మా' అనే పాట జనాన్ని ఉగ్రూత లూగించింది.

నిజామాబాద్, హైదరాబాద్‌లలో గద్దర్ విద్యాభ్యాసం చేశారు. 1975లో కొద్దికాలం కెనరా బ్యాంకులో ఉద్యోగం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గద్దర్ పాడిన 'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న గానమా.. పోరు తెలంగాణమా' పాట ఎంతటి ప్రభావం చూపిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఉద్యమం అప్పటిదాకా ఒక ఎత్తు. ఆ పాట తర్వాత మరొక ఎత్తుగా కొనసాగింది. గద్దర్ ఆట, పాట కోట్లాది మందిని కదిలించింది. ఉద్యమాన్ని ఉరకలెత్తించింది. 'అమ్మా తెలంగాణమా..', 'అడవి తల్లికి వందనం' ఇలాంటి వందలాది పాటలతో ప్రభావం చూపారు గద్దర్. జనం గోసను తన పాటల ద్వారా వినిపించారు. గద్దర్ ఒక సంచలనం, ఆయన పిలుపు ఒక ప్రభంజనం, గద్దర్ పాట విని రోమాలు నిక్కబొడుచుకోనివారు ఉండరు. కొన్ని వేలమంది ఉద్యమం బాట పట్టారు. 'నీ పాదం మీద పుట్టుమచ్చనై..' పాటకు నంది అవార్డుకు ఎంపికయ్యారు గద్దర్. కానీ దానిని స్వీకరించేందుకు తిరస్కరించారు.

సామాజిక తెలంగాణ స్వప్నం నెరవేరలేదని, ఎంతో కాలం పోరాడి తెచ్చుకున్న తెలంగాణ కేవలం కొందరి చేతుల్లోనే ఉందని గద్దర్ వాపోయేవారు. జీవిత చరమాంకంలో సామాజిక సమగ్రత, రాజ్యాంగ పరిరక్షణ, అణగారిన వర్గాల అభ్యుదయం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని గ్రహించి ఆ పార్టీ ఏర్పాటు చేసిన సభలలో పాల్గొన్నారు.

పీపుల్స్‌వార్, మావోయిస్టు ఉద్యమం, తెలంగాణ ఉద్యమాల్లో తన గొంతు వినిపించారు గద్దర్. తన గళంతో కోట్లాది మంది ప్రజలను ఉత్తేజపరిచారు. దేశంలో దళితుల హత్యలపై ఆయన అవిశ్రాంతంగా పోరాటం చేశారు. నకిలీ ఎన్‌కౌంటర్లను తీవ్రంగా వ్యతిరేకించారు. అమరవీరుల కుటుంబాలకు చేయూతనిచ్చేవారు. పీపుల్స్‌వార్ పార్టీ క్యాడర్ రిక్రూట్‌మెంట్ ఆయన పాటల ద్వారా ప్రభావితమయింది. చాలామంది సానుభూతిపరులు, పౌర–ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు, మహిళా సంఘాలు, దళిత బహుజన సంఘాలలో సాంస్కృతిక విప్లవం తెచ్చిన వ్యక్తి. ఆయన పాటలతో ఉత్తేజమై ఎందరో నక్సల్ ఉద్యమంలో చేరారు. ఈ క్రమంలోనే 1997 ఏప్రిల్ 6న గద్దర్‌పై హత్యాయత్నం జరిగింది. నాడు మరణం అంచుల దాకా వెళ్లి, ప్రాణాలతో బయటపడ్డారు.

1969 తెలంగాణ ఉద్యమంలోనూ గద్దర్ చురుగ్గా పాల్గొన్నారు. భావజాల వ్యాప్తి కోసం ఊరూరా తిరిగి, బుర్రకథలతో ప్రచారం చేసేవారు. అలా ఆయన ప్రదర్శనను చూసిన సినిమా దర్శకులు బి. నరసింగరావు.. భగత్‌సింగ్ జయంతి రోజున ఒక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ప్రతి ఆదివారం ఆయన ప్రదర్శనలు ఇచ్చేవారు. 1971లో బి. నరసింగరావు ప్రోత్సాహంతో గద్దర్ 'ఆపర రిక్షా' పేరుతో తన మొదటి పాట రాశారు. ఆయన మొదటి ఆల్బం పేరు గద్దర్. ఇదే ఆయన పేరుగా స్థిరపడింది.




సామాజిక తెలంగాణ స్వప్నం నెరవేరలేదని, ఎంతో కాలం పోరాడి తెచ్చుకున్న తెలంగాణ కేవలం కొందరి చేతుల్లోనే ఉందని గద్దర్ వాపోయేవారు. తాను జీవించి ఉన్న చివరి రోజులలో సామాజిక సమగ్రత, రాజ్యాంగ పరిరక్షణ, అణగారిన వర్గాల అభ్యుదయం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని గ్రహించి ఆ పార్టీ ఏర్పాటు చేసిన సభలలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ పట్ల ఆయనకు వల్లమాలిన అభిమానం. భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీతో పాల్గొన్నారు, పౌర ప్రజా సంఘాలతో మమేకమై భారత్ బచావో ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.

మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించినా, దేశానికి పతకాలు సాధించిన రెజ్లర్లపై లైంగిక వేధింపులు జరిగినా, బిల్కిస్ బానో రేప్ కేసులో నిందితులకు క్షమాభిక్ష ప్రసాదించినా... మాకు సంబంధించిన విషయాలు కావని మౌనం పాటిస్తున్న పార్టీలు, చివరికి గద్దర్‌ను భౌతికంగా నిర్మూలించేందుకు దాడులు జరిపిన పార్టీలు సైతం గద్దర్‌ని కొనియాడుతున్నాయి. అలాగే ఒక విప్లవకారుడి చివరి అంతిమ యాత్రలో ప్రభుత్వ లాంఛనాలతో పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అరుదైన వ్యక్తి గద్దర్. ప్రాంతాల మధ్య అంతరాలను, వెనుకబాటుతనాన్ని ఆయన గట్టిగా వ్యతిరేకించారు. సమాజ పురోభివృద్ధికి ప్రతిబంధకాలు అవిద్య, అజ్ఞానం, మూఢనమ్మకాలు, మతోన్మాదం, అశ్లీలత అని భావించి... తన ఆట, పాట ద్వారా ప్రజలను ఆలోచింపజేసి భావ విప్లవం తెచ్చిన మహానుభావుడు ఆయన.

2023 జనవరిలో రాయలసీమ ప్రజా సంఘాల వేదికలో గద్దర్ ప్రసంగించారు. రాయలసీమ పట్ల ప్రత్యేక అభిమానంతో నీళ్లు, నిధులు, ప్రాంతీయ అసమానతలు తుదముట్టించడానికి లౌకిక ప్రజాతంత్ర ఉద్యమానికి బాసటగా నిలిచారు. ముప్పై సంవత్సరాల క్రిందట మహాబోధి విద్యాలయం ఏర్పాటు చేసి ఎందరో విద్యార్థులకు విద్యా ప్రదానం చేశారు. తల్లిదండ్రులు కోల్పోయిన వారికి, సింగిల్ పేరెంట్ పిల్లలకు తాను స్థాపించిన పాఠశాలలో ఉచిత విద్య అందించారు. గుమ్మడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేపట్టారు. తెలుగు నేలపైన ప్రజాకళలు ఉన్నంత వరకు గద్దర్ పాట సజీవంగా ఉంటుంది.

■ జి. వెన్నెల గద్దర్
చైర్‌పర్సన్, తెలంగాణ సాంస్కృతిక సారథి

(నేడు గద్దర్ జయంతి)





దుర్గమ్మ దర్శనం అంటే సామాన్యులకు ఓ ప్రహసనమే. అదే.. వీఐపీ లైన్‌లో వచ్చే భక్తులకు మాత్రం దర్శనం మాత్రం చాలా తేలిక. సామన్యులైతే టికెట్ కొని, గంటల తరబడి క్యూలో నిలబడి సరిగ్గా అమ్మవారిని చూసేసరికి సిబ్బంది, సెక్యూరిటీ చేయి పట్టుకుని లాగేస్తారు. అదే ఎలాంటి టికెట్ కొనకుండా ప్రధాన ఆలయం వెనుక నుంచి వచ్చిన వారిని మాత్రం రాచమర్యాదలతో అంతరాలయంలోకి ఆహ్వానిస్తారు. ఈ తతంగం మొత్తం వెనుక ఓ వ్యక్తి చక్రం తిప్పుతుండగా, అమ్మ సన్నిధిలో పవిత్రంగా ఉండాల్సిన సిబ్బంది కాసుల మత్తులో అవినీతి రాక్షసుల అవతార మెత్తుతున్నారు.

దర్శనాల దళారీ..!

- దుర్గగుడిలో వీఐపీ దర్శనాల ముసుగులో దందా
- ప్రైవేట్ వ్యక్తితో ఆలయ సిబ్బంది దోస్తీ



డిప్యూటీ శ్రీనివాస్

- దుర్గాఘాట్‌లో స్థావరం.. భక్తులతో బేరాలు
- 8 మందికి తగ్గకుండా ఉన్న భక్తులే టార్గెట్
- ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.500 వసూలు
- సదరు భక్తులకు తోడుగా కొండపైకి ఓ వ్యక్తి
- స్కానింగ్ సెంటర్ వద్ద 8 మంది భక్తులకు రెండే టికెట్లు
- మిగతా మొత్తం ప్రైవేట్ వ్యక్తి ఖాతాలోకి..
- ఆ తర్వాత సిబ్బందికి ఆన్‌లైన్ పేమెంట్
- మొత్తం 33 మంది సిబ్బందితో లావాదేవీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/వన్‌టౌన్) : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి వస్తున్న వారిలో కొంతమంది ఎలాంటి టికెట్లు కొనరు. వారికి ప్రొటోకాల్ ఉండదు. అయినా అంతకుమించి దర్శనాలు జరుగుతుంటాయి. దీనికి ప్రధాన కారణం.. స్కానింగ్ పాయింట్ సిబ్బంది నుంచి ఆలయంలో పనిచేసే వారి వరకు దళారీలతో చెట్టాపట్టాలేసుకుని తిరగడమే. అమ్మవారి చెంత భక్తిశ్రద్ధలతో వ్యవహరించాల్సిన సిబ్బంది దళారీలతో దోస్తీ కడుతున్నారు. అనధికార దర్శనాల ద్వారా నెలకు లక్షలాది రూపాయలు వెనుకేసుకుంటున్నారు. ఆలయ సెక్యూరిటీ సిబ్బందికి పట్టుబడిన ఓ దళారీ ఫోన్‌ను పరిశీలిస్తే అందులో 60-70 మంది ఆలయ సిబ్బంది ఫోన్ నెంబర్లు ఉన్నాయి. వారితో కొంతమందితో మాట్లాడినట్టుగా డయల్ లిస్ట్ చూపిస్తోంది.

'స్కానింగ్'లో అసలు దొంగలు

అనధికారికంగా దర్శనాలు చేయిస్తున్న వ్యక్తిని దుర్గగుడి సెక్యూరిటీ సిబ్బంది రెండు రోజుల క్రితం పట్టుకున్నారు. కానూరుకు చెందిన కురిజిల్లి శ్రీనివాస్ అలియాస్ డిప్యూటీ శ్రీనివాస్ ఇంద్రకీలాద్రిపై కొన్నాళ్ల క్రితం కొబ్బరికాయల వ్యాపారం చేసేవాడు. ఈ సమయంలో ఆలయంలో పనిచేసే సిబ్బందితో పరిచయం పెంచుకున్నాడు. ఈ పరిచయాన్ని ఆలయంలో దర్శనాల కోసం ఉపయోగించుకుంటున్నాడు. కొన్ని నెలలుగా ప్రైవేట్ వ్యక్తులను పదుల సంఖ్యలో తీసుకొచ్చి ఎలాంటి టికెట్ లేకుండా వీఐపీ దర్శనాలు చేయిస్తున్నాడు. శ్రీనివాస్ దర్శనానికి పంపే వ్యక్తుల సంఖ్య పదికి తగ్గదు. ఆయన కొండపై కనిపించేది తక్కువే అయినా ఆయన పంపిన భక్తులకు మాత్రం వీఐపీకి మించిన స్థాయిలో దర్శనాలు జరుగుతాయి. ఇతనిపై ఎప్పటినుంచో నిఘా పెట్టగా, కనకదుర్గానగర్‌లో బుధవారం భక్తులను దర్శనానికి సిద్ధం చేస్తుండగా ఏఈవో జంగం శ్రీనివాస్, మరికొందరు ఉద్యోగులు అతడ్ని పట్టుకున్నారు. సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. శ్రీనివాస్ ఫోన్‌ను పరిశీలించగా, ఆలయంలో పనిచేసే కొంతమంది సిబ్బందికి గూగుల్, ఫోన్‌పే ద్వారా నెలవారీగా వేలల్లో నగదును పంపినట్టు గుర్తించారు. మొత్తం 60-70 మంది సిబ్బంది ఫోన్ నెంబర్లు సదరు 'డిప్యూటీ' ఫోన్‌లో ఉన్నాయి. వారిలో

మిగతా 6లో..

పోలీసులకు ఫిర్యాదు

శ్రీనివాస్ దర్శనాల దందాపై ఏఈవో జంగం శ్రీనివాసరావు గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో దళారీ శ్రీనివాస్‌తో దోస్తీ కట్టిన వారి బాగోతాలు వెలుగులోకి వస్తాయని సిబ్బంది అంతా భయపడిపోతున్నారు. ఆలయంలో స్కానింగ్ పాయింట్‌పై కొన్నాళ్లుగా అనేక ఆరోపణలు ఉన్నాయి. వాటికి నిదర్శనమే తాజా సంఘటన.

కొరవడిన నిఘా

ఆలయంలో దళారీలపై 'ఆంధ్రజ్యోతి' పలుమార్లు కథనాలు ప్రచురించింది. వీరంతా ఆలయంలో యథేచ్ఛగా తిరుగుతున్నప్పటికీ వన్‌టౌన్ పోలీసులు కానీ, దేవస్థానం సిబ్బంది కానీ పట్టించుకోవట్లేదు. ఇలా దేవస్థానంలో 15 మందికి పైగా దళారులు తిష్ట వేసి అనధికారికంగా భక్తులను దర్శనాలను తీసుకెళ్తున్నా ఎవరూ అడ్డుచెప్పరు. దీనివల్ల ఆలయ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దళారుల బెడదకు చెక్ పెట్టాలని భక్తులు కోరుతున్నారు.

ప్రశ్న మీది.. జవాబు మాది

- ఈ ఏడాది పది స్టడీ మెటీరియల్‌లో మార్పు
- ఎస్‌సీఈఆర్టీ ప్రశ్నలకు జిల్లా పరిషత్ జవాబులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకిచ్చే స్టడీ మెటీరియల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఎస్‌సీఈఆర్టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) ప్రశ్న ఇస్తుండగా, వాటి జవాబులను జిల్లా పరిషత్ అందజేస్తుంది.

యూటీఎఫ్ స్టడీ మెటీరియల్ కాకుండా..

జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో స్టడీ మెటీరియల్‌ను ఇవ్వడం పరిపాటి. గడిచిన 25 ఏళ్లుగా యూటీఎఫ్ ఈ స్టడీ మెటీరియల్‌ను అందజేస్తోంది. పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రాలను పరిశీలించి వాటిలో తరచూ ఇచ్చిన ప్రశ్నలు, వాటికి జవాబులతో ఈ మెటీరియల్‌ను తయారుచేస్తుంది. దీన్ని పుస్తకరూపంలో విద్యార్థులకు అందజేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఈ మెటీరియల్ పుస్తకానికి ముందుమాట రాయించడానికి విద్యాశాఖ కమిషనర్ వి.వి జయరామరాజు వద్దకు ఆ సంఘ నాయకులు వెళ్లారు. దీన్ని పరిశీలించిన ఆయన ఇటువంటి మెటీరియల్‌ను విద్యాశాఖ అందజేస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇప్పటి వరకు విద్యాశాఖ పదో తరగతి విద్యార్థులకు ప్రణాళికలు మాత్రమే ఇచ్చేది. పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయడానికి ఏవిధమైన మెటీరియల్ ఇవ్వలేదు. తర్వాత కమిషనర్.. ఎస్‌సీఈఆర్టీలోని ఉపాధ్యాయులతో ఆరు పాఠ్యపుస్తకాలకు సంబంధించి ఒక్కో దానికి మూడు నమూనా ప్రశ్నాపత్రాలను తయారు చేయించారు. వాటిని పీడీఎఫ్ రూపంలో వాట్సాప్‌లో జిల్లా విద్యాశాఖాధికారులకు పంపారు. డీఈవో ద్వారా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు అవి చేరాయి. కాగా, కృష్ణా జిల్లాపరిషత్ కొన్నేళ్లుగా పదో తరగతి విద్యార్థులకు వివిధ పేర్లతో స్టడీ మెటీరియల్‌ను అందజేస్తోంది. అలాగే, ఈ ఏడాది స్టడీ మెటీరియల్‌ను ఇవ్వడానికి జిల్లాపరిషత్ ముందుకొచ్చింది. కానీ, ఎస్‌సీఈఆర్టీ ఇచ్చిన మెటీరియల్, జిల్లా పరిషత్ ఇవ్వబోయే మెటీరియల్ వేర్వేరుగా ఉంటే విద్యార్థులు గందరగోళంలో పడతారని విద్యాశాఖాధికారులు గుర్తించారు. ఎస్‌సీఈఆర్టీ ఇప్పటికే ప్రశ్నలతో నమూనా పత్రాలను విడుదల చేసిన కారణంగా వాటికి సమాధానాలను మెటీరియల్ రూపంలో ఇవ్వాలని జిల్లాపరిషత్ అధికారులకు విన్నవించారు. ఎస్‌సీఈఆర్టీ ఇచ్చిన ప్రశ్నలకు జిల్లాలోని పదో తరగతి బోధించే ఉపాధ్యాయులతో జవాబులు రాయించి జిల్లా పరిషత్‌కు అందజేస్తారు. వాటిని జడ్పీ అధికారులు పుస్తకరూపంలో ముద్రించి పాఠశాలలకు పంపుతారు. జిల్లాలో ఈ ఏడాది పరీక్షలకు మొత్తం 27,681 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వారిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 10,968 మంది ఉండగా, ప్రైవేట్ విద్యార్థులు 16,713 మంది ఉన్నారు.

రూ.2 కోట్ల విలువైన ఇనుము దోపిడీ

- ఇద్దరు ఏఈలపై కేసుల నమోదుకు ఆదేశం

విజయవాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పేదల ఇళ్లకు వాడే సుమారు రూ.2 కోట్ల విలువైన స్టీల్‌ను గృహనిర్మాణ శాఖకు చెందిన బి.శ్రీనివాసరావు, ఎం.శ్రీధర్ కుమార్ అనే ఇద్దరు అసిస్టెంట్ ఇంజనీర్లు పక్కదారి పట్టించారు. మొత్తం 271.152 మెట్రిక్ టన్నుల స్టీల్‌ను దుర్వినియోగం చేశారు. ఈ స్టీల్ విలువ రూ.2 కోట్ల వరకు ఉంటుందని అధికారుల విచారణలో తేలింది. గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీలో వెలగలేరు లే అవుట్‌కు సంబంధించిన స్టీల్ మాయమైనట్టు డీఈఈ గుర్తించి పైఅధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విజయవాడ ఆర్డీవో విచారణ జరిపారు. స్టీల్ దుర్వినియోగం జరిగినట్టు గుర్తించి కేసులు నమోదుకు జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారిని ఆదేశించారు.

దందాలు సాగవు

- అలాంటివి ఉంటే చెప్పండి..
- స్థానికులతో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము
- బుల్లెట్‌పై వెళ్లి చిరు వ్యాపారులను కలిసిన ఎమ్మెల్యే
- తన పేరిట దందాలు సాగిస్తున్నారా అంటూ ఆరా
- దందాలు చేస్తే తన దృష్టికి తీసుకురావాలని ఫోన్ నెంబర్ ఇచ్చి మరీ అభయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

6లో



గుడివాడ పట్టణవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

క్యూలో నిలబడకుండానే టికెట్ల జారీ

రైల్వేలో యూనివర్సల్ టికెట్ సిస్టమ్ అందుబాటులోకి..

విజయవాడ డివిజన్‌లో 90 సెంటర్లు

8లో

తాగునీటిపై ప్రత్యేక దృష్టి

- వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక
- 2025-26 జెడ్పీ బడ్జెట్ నిల్వ రూ.172.02 కోట్లు
- ఆదాయం అంచనా రూ.1,300.24 కోట్లు
- సీపీజీఎఫ్‌ఎం అవార్డుకు జిల్లా పరిషత్ ఎంపిక
- రోడ్లు, తాగునీటి సమస్యలపై సభ్యుల విజ్ఞప్తి

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాదాసీదాగా ముగిసిన సమావేశం





సమావేశంలో ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, ఆర్డీవో స్వాతి

మచిలీపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాల్లో జిల్లా పరిషత్ 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశం జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన గురువారం జరిగింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో వివిధ పథకాలపై సమీక్షలు జరపకుండా బడ్జెట్ అంచనాలకు సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ హారిక మాట్లాడుతూ ఏటా తాగునీటి అవసరాల కోసం జెడ్పీ నుంచి రూ.40 కోట్లను ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది అంతే మొత్తంలో నగదు కేటాయించామని తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి జెడ్పీ బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.172.02 కోట్లు ఉన్నట్లు చెప్పారు. అనంతరం 2025-26 సంవత్సరంలో జెడ్పీ ఆదాయం రూ.1,300.24 కోట్లుగా, ముగింపు నిల్వ రూ.182.31 కోట్లుగా ఉంటుందని అంచనా వేశామని, ఈ ప్రతిపాదనలకు సమావేశం ఆమోదం తెలపాలని చైర్‌పర్సన్ కోరగా, సభ్యులు ఆమోదం తెలిపారు.

రహదారుల గుంతలైనా పూడ్చండి

జిల్లాలో రహదారుల అభివృద్ధి, డొంకరోడ్ల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించాలని కోడూరు, తోట్లవల్లూరు, అవనిగడ్డ, ముదినేపల్లి, కైకలూరు, కలిదిండి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కోడూరు-అవనిగడ్డ రహదారిని సంవత్సరాల తరబడి అభివృద్ధి చేస్తామని చెప్పడమే తప్ప, పనులు మాత్రం చేయడం లేదన్నారు. 12 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారి గుంతలమయంగా ఉందని, ప్రయాణికులకు నరకం కనిపిస్తోందని కోడూరు జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. అవనిగడ్డ-అశ్వారావుపాలెం మధ్య

మిగతా 6లో..

రెక్కీచేసి.. రైల్లో చోరీ

- రూ.64 లక్షలున్న బ్యాగ్‌తో మాయం
- సీసీ కెమెరాలతో కేసు ఛేదించిన పోలీసులు
- బాధితులు, నిందితులు రాజమండ్రివాసులు



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రత్నరాజు. పక్కన జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ జేవీ రమణ, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్

విజయవాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : డబ్బు బ్యాగ్‌తో రైలెక్కుతున్న వారిని కొందరు పసిగట్టారు. ప్రయాణికుల్లా నటించారు. సదరు ప్రయాణికులు గాఢనిద్రలోకి జారుకున్నాక బ్యాగ్‌తో ఉడాయించారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను నగరంలోని ప్రభుత్వ రైల్వే పోలీసు విభాగ ఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రత్నరాజు గురువారం వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన పింటు కుమార్‌జైన్, రాకేశ్ కుమార్‌జైన్ అన్నదమ్ములు. వారు 'పింటు కుమార్ బ్యాంకర్స్' పేరుతో జ్యువెలరీ వ్యాపారం చేస్తున్నారు. వారి వద్ద పనిచేసే మనోజ్‌కుమార్ జైన్, హితేశ్‌కుమార్ జైన్‌కు బ్యాగ్‌లో రూ.64 లక్షలు పెట్టి ఇచ్చారు. చెన్నై వెళ్లాక ఫోన్ చేయాలని, ఏ షాపు వద్దకు వెళ్లాలో చెప్తానని పింటూ చెప్పారు. బ్యాగ్‌లో ఎంత ఉందని మనోజ్‌కుమార్ యజమానిని అడిగాడు. ఎవరైనా అడిగితే రూ.10 లక్షలు ఉంటాయని చెప్పమని సలహా ఇచ్చి, అసలు మొత్తం మాత్రం చెప్పలేదు. మనోజ్, హితేశ్‌కు భువనేశ్వర్ నుంచి రామేశ్వరం వెళ్లే రైల్లో టికెట్ బుక్ చేశారు. ఇద్దరిలో మనోజ్‌కు బెర్త్ ఖరారైంది. ఈనెల 24వ తేదీ సాయంత్రం వారిద్దరూ డబ్బు బ్యాగ్‌తో బీ2 భోగిలో ఎక్కారు. మనోజ్‌కు పై బెర్త్ రావడంతో కింది బెర్త్ కింద బ్యాగ్‌పెట్టి పైకి ఎక్కాడు. హితేశ్ భోగీలోని బెడ్‌రోల్‌పై పడుకున్నాడు.

రాజమండ్రి నుంచే రెక్కీ

రాజమహేంద్రవరం తుమ్మలోవ ప్రాంతానికి చెందిన ఆకుల సాయికృష్ణ ఈ జ్యువెలరీ షాపులో పనిచేసి మానేశాడు. బంగారం వ్యాపారులు ప్రతినెలా అందులో పనిచేసే వారికి డబ్బిచ్చి చెన్నై పంపుతారన్న విషయంపై సాయికృష్ణకు తెలుసు. ఆ బ్యాగ్‌ను కాజేస్తే జీవితంలో స్థిరపడిపోవచ్చని భావించాడు. ఈ స్కెచ్‌ను స్నేహితులైన పెండెం ప్రసన్నకుమార్, ఉల్లూరి మహేశ్‌కుమార్‌తో పంచుకున్నాడు. మనోజ్, హితేశ్ నగదు బ్యాగ్‌తో బయల్దేరుతున్నారని సమాచారం తెలుసుకున్న ఈ గ్యాంగ్ ఈనెల 24వ తేదీన రైల్వేస్టేషన్‌కు వచ్చింది. మనోజ్, హితేశ్‌లు ఎక్కిన భోగికి ముందున్న బీ1 భోగీలో ఎక్కారు. ముగ్గురూ మాస్కులు ధరించి రైల్లో తిరిగారు. మనోజ్, హితేశ్ నిద్రలో ఉన్నారని గమనించి విజయవాడ రైల్వేస్టేషన్‌కు రాగానే బ్యాగ్‌తో ఒక నెంబరు ప్లాట్‌ఫాంలో దిగి బయటకు వెళ్లిపోయారు. రైలు నెల్లూరు వెళ్లాక మనోజ్‌కుమార్ చూసుకోగా, బ్యాగ్ కనిపించలేదు. ఈ విషయాన్ని ఫోన్‌లో యజమానికి చెప్పగానే, పింటూ సొమ్మసిల్లి పడిపోయాడు. నెల్లూరు జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లగా, వారు స్వీకరించలేదు. దీంతో తిరిగి వారు విజయవాడ వచ్చారు. ఇన్‌స్పెక్టర్ జేవీ రమణ.. స్టేషన్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా, ముగ్గురు నిందితులు బ్యాగ్‌తో ప్లాట్‌ఫాంపైకి వచ్చి బయటకు వెళ్తున్నట్టు కనిపించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. బ్యాగ్‌లో రూ.10 లక్షలు ఉన్నాయని బాధితులు చెప్పడంతో ఆ మొత్తాన్నే ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు. రెండు రోజుల తర్వాత యజమానులు వచ్చి బ్యాగ్‌లో ఉంది రూ.10 లక్షలు కాదని, రూ.64 లక్షలని చెప్పారు.

మూడు బృందాలు ఏర్పాటు

కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తునకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం

మిగతా 6లో..

అవినీతికి కేరాఫ్.. కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం 6 కలెక్టరేట్‌లో సూర్యఘర్ హెల్ప్‌లైన్

బాపూజీ మార్గం ఆదర్శనీయం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అహింస, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అందించిన మహనీయుడు జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గం అందరికీ ఆదర్శనీయమని, ఆయన చూపిన మార్గంలో పయనించి రాష్ట్రం తద్వారా దేశాభివృద్ధిలో భాగస్వాములవుదామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మాగాంధీ 77వ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతి సమగ్రత, ఐక్యతకు బాపూజీ అనుసరించిన మార్గం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. అహింసాయుత మార్గంలో సత్యమే పరమావధిగా జీవించిన మహనీయుడు మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్యానికి బాటలు వేశారని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండపల్లి మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలపై విచారణ

ఇబ్రహీంపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో కొండపల్లి మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలు, నిధులు, అధికార దుర్వినియోగానికి పాల్పడిన అప్పటి అధికారులు కొండపల్లి మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్, అసిస్టెంట్ ఇంజనీరు సాయిగణేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐ.సుధాకర్ బాబులపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. విచారణాధికారిగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఫలించిన టీడీపీ కౌన్సిలర్ల పోరాటాలు

వైసీపీ హయాంలో కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పర్వతనేని శ్రీధర్ అధికార పార్టీ అండతో తొలినుంచి వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడమేకాక అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడని టీడీపీ కౌన్సిలర్లు ఆరోపించారు. ప్రజల సమస్యలపై కార్యాలయానికి వెళ్లిన మహిళా కౌన్సిలర్లపై శ్రీధర్ దురుసుగా ప్రవర్తించేవాడని, ఆగడాలు భరించలేక పోలీస్‌స్టేషన్ ఎదుట కౌన్సిలర్లు ధర్నాలు చేశారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి ఆడిట్ శాఖకు దొరకుండా రిజిస్టర్లు, ఫైళ్లను ఇవ్వకపోవడాన్ని క్యాష్ బుక్స్ అడ్వాన్స్ రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్లు, సెక్యూరిటీ డిపాజిట్ల రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించలేదని ఆడిట్‌శాఖ అప్పట్లో అధికారులకు అక్షింతలు వేసింది. 14.వ ఆర్థిక సంఘం నిధులతో తదితర నిధులు అప్పట్లో రూ.10 కోట్లకు పైగా అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయనపై బదిలీ వేటు పడింది.

కలెక్టరేట్‌లో పీఎం సూర్యఘర్ హెల్ప్‌లైన్

కృష్ణలంక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాను పునరుత్పాదక ఇంధన హబ్‌గా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమంలో భాగంగా 6281709398 నెంబర్‌తో కలెక్టర్ కార్యాలయంలో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పథకానికి సంబంధించి వివరాలు తెలుసుకొనేందుకు, సలహాలు సూచనలు పొందేందుకు ఈ హెల్ప్‌లైన్ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవచ్చని వెల్లడించారు.



హమాలీ కార్మిక కుటుంబసభ్యుల సంరక్షణకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన కోరమాండల్ సంస్థ ప్రతినిధులు

కోరమాండల్ ఉచిత వైద్యశిబిరం

కృష్ణలంక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో హమాలీ కార్మికుల కుటుంబాలకు వైద్య శిబిరం నిర్వహించారు. తాడేపల్లిలోని కృష్ణాకెనాల్ వద్ద గురువారం హమాలీ కార్మికుల కుటుంబాల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రముఖ ఎరువుల సంస్థ కోరమాండల్ ఇంటర్నేషనల్ విజయవాడలోని ఈఎస్ఐ, రమేష్, సెంటర్ ఫర్ ఫైట్ ఆసుపత్రుల సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సుమారు 600 మంది హమాలీ కార్మికుల కుటుంబాలకు వైద్య పరీక్షలు చేశారు. వ్యవసాయ సరఫరా గొలుసులో కీలక పాత్ర పోషించే కార్మికులు తరచుగా ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొంటారని, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఈ చొరవ రూపొందించబడిందన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ రీజనల్ బిజినెస్ హెడ్ కెఎస్ఆర్ చక్రవర్తి, జనరల్ మేనేజర్ హెచ్ఆర్ శ్రీనివాసవర్మ, డీజీఎం సచ్చిదానందరెడ్డి, లాజిస్టిక్స్ మేనేజర్ ప్రసాద్, హెచ్ఆర్ ప్రతినిధి సుధాకర్, గాయత్రి, ఆఫీసర్ రాగేష్ తదితరులు పాల్గొన్నారు.



అనాథ ఆశ్రమంలో వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న కె.రవికుమార్, పి.శేషగిరిరావు తదితరులు

ఎమ్మెల్యే బొండా జన్మదిన వేడుకలు

» అనాథ, వృద్ధుల ఆశ్రమాల్లో కేక్ కటింగ్, అన్నవితరణ

వన్‌టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు జన్మదిన వేడుకలు గురువారం టీడీపీ నాయకులు కాకొల్లు రవికుమార్, సాదం శ్రీనాథ్, పొన్నం శేషగిరిరావు ఆధ్వర్యంలో 64వ డివిజన్ పరిధి పాతపాడులోని అనాథ, వృద్ధుల ఆశ్రమాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాతపాడులోని కార్నర్ స్టోన్ ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో టీడీపీ నాయకులు వృద్ధుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి, స్వీట్లు తినిపించారు. అనంతరం వృద్ధులకు అన్నవితరణ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కాకొల్లు వరలక్ష్మి, పొన్నం లీల, కె.రాజేష్, కంకణాల బాబు, కోరాడ రమణ, తేజ, జయరాజు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిన జగన్

» ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలపై జగన్ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం వేసిందని మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కచాన్స్ అంటే ప్రజలు అవకాశం ఇచ్చారని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేసి ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించాడన్నారు. ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసిందని, ఏడు నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం రూ. 22వేల కోట్ల బకాయిలు చెల్లించారన్నారు. ఆరోగ్యశ్రీ, ధాన్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు రూ. 22వేల కోట్లు చంద్రబాబు చెల్లించారన్నారు. అసమర్థుని పాలన వల్ల ఎంత నష్టపోయామో ప్రజలకు తేటతెల్లమయిందన్నారు.



లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన తహసీల్దార్ జాహ్నవి, వీఆర్వో రామారావు

అవినీతికి కేరాఫ్..

కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం



ఆరోపణలు ఎదుర్కొంటున్న కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం

» కాసులు ముట్టందే.. ఫైలు కదలదు

» మితిమీరిన లంచాలతో అవినీతి మరక

» ఏసీబీ దాడితో అక్రమాలు వెలుగులోకి..

» లంచం తీసుకుంటూ పట్టుబడిన తహసీల్దార్, వీఆర్వో

కాసులు ఇస్తేనే దరఖాస్తుకు మోక్షం.. లేదంటే గడువు ముగిసి దరఖాస్తు నిర్వీర్యమై పోవాల్సిందే తప్ప ఒక్క అంగుళం కూడా ముందుకు కదలదు.. ఎవరేమనుకున్నా బేఖాతర్.. అధికార పార్టీ నాయకులైనా, ఎంత పలుకుబడి కలిగిన వారైనా కార్యాలయంలో పనులు కావాలంటే ముడుపులు ఇచ్చుకోవాల్సిందే.. సొమ్ములు ఇచ్చుకోలేని వారు కార్యాలయం చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేసినా కనికరమనేది లేదు.. ఇక్కడ లంచం తప్ప మరో మాటకు తావు లేదంటే ఆశ్చర్యం వేయకమానదు.. ఇటీవల కాలంలో అవినీతి, అక్రమాలకు కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం చిరునామాగా మారిందన్న ఆరోపణలు బలంగా వినవస్తున్నాయి.

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి రాష్ట్ర విభజన వల్ల కంచికచర్ల ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. రాజధాని అమరావతికి అతి సమీపంలో ఉండటంతో రూ.కోట్లలో ధరలు పలుకుతున్నాయి. భూములు, స్థల క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. 'రియల్' వెంచర్లు భారీగా వెలుస్తున్నాయి. రెవెన్యూ పరంగా పట్టాదారు పాసుపుస్తకాలు, మ్యుటేషన్లు, సవరణలు, అడంగళ్, ఒన్‌బీలో పేర్ల నమోదు, ల్యాండ్ కన్వర్షన్ తదితర పనుల కోసం రైతులు, వ్యాపారులు, రియల్టర్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీనిని రెవెన్యూ అధికారులు అవకాశంగా మల్చుకున్నారు. ఫైసలిస్తేనే పనులు.. లేని పక్షంలో లేనిపోని కొర్రీలతో కాలయాపన చేస్తున్నారు. ఈలోగా దరఖాస్తు గడువు ముగిసిపోతుంది. మరల దరఖాస్తు చేయాల్సి వస్తున్నది. ఈ బాధలు పడలేక అధికారులు అడిగినంత ఇచ్చేందుకు రైతులు, రియల్టర్లు సిద్ధపడుతున్నారు.

లంచాలకు కేరాఫ్ అడ్రస్..

అవినీతి, అక్రమాలకు కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం చిరునామాగా మారింది. ఇక్కడ ప్రతి పనికి



ఒక ధర నిర్ణయించి వసూలు చేస్తారు. సాధారణంగా మూడో కంటికి తెలియకుండ చాటుమాటుగా జరిగే లంచాల వ్యవహారం చట్టబద్ధమన్నట్టుగా తయారైంది. పలుకుబడి కలిగిన పెద్దలు, ప్రజాప్రతినిధులు సైతం లంచం ఇచ్చుకోవాల్సిందే.

- అధికారపార్టీలో ఉంటూ.. పేరొందిన ఒక సామాజిక వర్గం ప్రతినిధిగా చెలామణి అవుతు.. ఇక్కడ ముడుపులు చెల్లించుకోక తప్పలేదు. తన ఐదెకరాల పొలానికి పాసుపుస్తకం తీసుకునేందుకు దరఖాస్తు చేసి కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. అధికార పార్టీ అయితే ఏంటి..! చేయి తడపనిదే పని కాదంటూ కరాకండిగా చెప్పటంతో విస్తుపోయిన సదరు వ్యక్తి గత్యంతరం లేక రూ.పది వేలు లంచం సమర్పించుకున్న తర్వాత దరఖాస్తు ముందుకు కదలింది.
- హైదరాబాదులో ఉంటున్న కృష్ణా తీర గ్రామానికి చెందిన ప్రముఖుడొకరు కొద్ది రోజుల క్రితం ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేశాడు. విస్తీర్ణంలో తేడా ఉంది, సర్వే చేయాల్సి వస్తుందంటూ లక్షల్లో డిమాండ్ చేయటం చర్చనీయాంశమైంది. సదరు ప్రముఖుడు, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ దరఖాస్తుకు మోక్షం కలగలేదు.
- నియోజకవర్గంలో అధికార పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న నందిగామకు చెందిన నాయకుడొకరు ల్యాండ్ కన్వర్షన్ గురించి నేరుగా కార్యాలయానికి వెళ్లగా ముందుగా తమకు రూ.30 వేలు చెల్లించాలని డిమాండ్ విశేషం.
- పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసిన కునికినపాడు గ్రామానికి చెందిన ఒక యువకుడు ఒకటికి నాలుగుసార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ పట్టించుకోలేదు. పక్కన పడేసిన దరఖాస్తుకు రూ.ఐదువేలు ఇవ్వగానే చలనం వచ్చింది.
- దీపావళికి కంచికచర్లలో పది మంది మధిర వెళ్లే రోడ్డులో పొలంలో తాత్కాలికంగా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. అనుమతి ఇచ్చేందుకు ఒక్కొక్క దుకాణానికి రూ.10వేలు డిమాండ్ చేయటంతో అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం సాగింది. పత్రికల్లో కూడా కథనాలు వచ్చాయి. అయినప్పటికీ దుకాణానికి రూ. ఐదు వేల వంతున సమర్పించుకోక తప్పలేదు.
- లంచాల బాగోతం గురించి ఏసీబీకి సమాచారం అందించాలని ఒక దశలో కొందరు ఉద్యోగులు నిర్ణయించుకున్నారంటే కార్యాలయంలో అవినీతి ఏస్థాయిలో వేళ్లూనుకుందో అర్థం చేసుకోవచ్చు. నాయకులకు పెద్ద మొత్తంలో డబ్బులిచ్చి వచ్చాం.. లంచం తీసుకోక ఏం చేయాలంటూ సదరు వ్యక్తులు సమర్థించుకోవటం శోచనీయం. ఏసీబీ దాడి జరగవచ్చునంటూ వారం క్రితం ఒకరు నేరుగా తహసీల్దార్ జాహ్నవిని కలిసి చెప్పినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు.
- పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేయటంతో కౌలు రైతు మాగంటి కోటేశ్వరరావు ఏసీబీని ఆశ్రయించాడు. తన యజమాని పొలం వివరాలను అడంగళ్, వన్‌బీలో నమోదు చేసి, పాసుపుస్తకం ఇచ్చేందుకు తహసీల్దార్ జాహ్నవి రూ.లక్ష డిమాండ్ చేశారు. చివరకు రూ.30 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది.

నాలుగు రోజులుగా నిఘా ఉంచి..

నాలుగు రోజుల నుంచి ఏసీబీ అధికారులు, తహసీల్దార్ జాహ్నవిపై నిఘా పెట్టారు. ఎట్టకేలకు బుధవారం రాత్రి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడింది. ఏసీబీ దాడి సమాచారం అందగానే నందిగామ ఆర్డీవో బాలకృష్ణ ఇక్కడకు వచ్చారు. ఆమెతో పాటుగా వీఆర్వో రామారావును అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. రెవెన్యూ కార్యాలయంలో బాధితుడు కోటేశ్వరరావు, తహసీల్దార్, వీఆర్వోల స్టేట్‌మెంట్లను అధికారులు రికార్డు చేశారు. వారిని గురువారం విజయవాడ కోర్టులో హాజరుపర్చారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి

పటిష్టంగా అమలు చేయండి

» పెండింగ్ ఫారం-18 దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

» అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీఐ విడుదల చేసిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) పటిష్ట అమలుకు అధికారులు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ అవుతుందని, 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 27న పోలింగ్, మార్చి 3న లెక్కింపు ఉంటుందని తెలిపారు. షెడ్యూల్ విడుదలతోనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినందున ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియ ముగింపు తేదీ మార్చి 8 వరకు కోడ్‌ను పకడ్బందీగా అమలుచేయాలని స్పష్టం చేశారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూ.చ తప్పక పాటించి సహకారం అందించేలా డివిజన్, జిల్లాస్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఎంసీసీ నియమ నిబంధనలు, ఉల్లంఘనలపై చర్యలు తదితర అంశాలను వివరించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల అధికారిక కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదని, పొలిటికల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు, చిహ్నాలు వంటివి తొలగించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, పబ్లిక్ ప్రాంతాల్లో రాజకీయపరమైన ఫొటోలు, పోస్టర్లు వంటివి తొలగించాలన్నారు. కోడ్ అమలుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తాయన్నారు.

2024 డిసెంబరు 30 వరకు 78,238 మంది ఓటర్లు

పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 2024 డిసెంబరు 30 వరకు చూస్తే ఎన్టీఆర్ జిల్లాలో 101 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 45,540 మంది పురుషులు, 32,685 మంది మహిళలు, 13 మంది టీజీ ఓటర్లు మొత్తం 78,238 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితాలో పేరు నమోదుకు వీలుకల్పించే ఫారం-18 పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలన్నారు. ఒక పోలింగ్ స్టేషన్ పరిధిలో వెయ్యి ఓట్లు కంటే ఎక్కువగా ఉన్నట్లయితే అవసరమైన ఆగ్జలరీ పోలింగ్ బూత్‌లకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పోలింగ్ స్టేషన్‌ల వద్ద అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. టెలికాన్ఫరెన్సులో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆర్డీవో కె.చైతన్య, నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

దందాలు సాగవు

» స్థానికులతో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : 'నియోజకవర్గంలో ఎవరి దందాలు సాగవు.. అలాంటివి ఉంటే వెంటనే నాకు చెప్పండి.. మీకు అండగా ఉంటా' అంటూ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్థానికులకు అభయమిచ్చారు. నియోజకవర్గంలో తులసి దళం దందాలు, అక్రమ వసూళ్లపై ఆంధ్రజ్యోతి 'గుడివాడలో టీ ట్యాక్స్' శీర్షికతో ప్రత్యేక కథనం గురువారం ప్రచురించింది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాము కాన్వాయ్, భద్రతా సిబ్బందిని పక్కన పెట్టి ఓ బుల్లెట్ మీద తానొక్కడే ఓ సామాన్యుడిలా ప్రజల దగ్గరకు వెళ్లారు. వ్యాపారులను కలిసి తన పేరు చెప్పి ఎవరైనా దందాలు సాగిస్తున్నారా అంటూ ఆరా తీశారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఎవరి దందాలు చెల్లవని, ఏదైనా ఉంటే నేరుగా తన దగ్గరకు వచ్చి ఫిర్యాదు చేయాలని, అండగా ఉంటానని అభయమిచ్చారు. తన ఫోన్ నంబర్‌ను కూడా వారికి తెలియజేశారు. ప్రజల కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించాలని కోరారు. పట్టణంలోని రహదారుల వెంబడి చిరువ్యాపారులు, దుకాణదారులు, టీ స్టాల్స్, హోటళ్లకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతుబజారులో వినియోగదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు గానీ, రాజకీయ పక్షాలు కానీ ఎక్కడైన అవినీతి, అక్రమాలకు పాల్పడితే తక్షణమే సమాచారం ఇవ్వాలని కోరారు. గుడివాడ అభివృద్ధికి ఏం కావాలో.. తానేం చేయాలో చెప్పాలని, తాను ఇక్కడే అందుబాటులో ఉన్నానని, నేరుగా తనను కలవచ్చునని వివరించారు.



పెడన బైపాస్ రోడ్డులో ప్రమాదం జరిగిన ప్రదేశం

పెడన బైపాస్‌లో బైక్‌ను ఢీకొట్టిన లారీ..

ముగ్గురు యువకుల దుర్మరణం

పెడన, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పెడన బైపాస్‌రోడ్డులో గురువారం సాయంత్రం లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా మరో యువకుడు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం పెడన బైపాస్ రోడ్డులో బంటుమిల్లి వైపు వెళుతున్న మోటారు బైక్‌ను మచిలీపట్నం వైపు వెళుతున్న లారీ ఢీకొంది. బైక్‌పై ఉన్న బంటుమిల్లి మండలం అర్తమూరు దళితవాడకు చెందిన బాపట్ల విజయకుమార్ (39), పాలపర్తి శాంతరాజు (26)లు అక్కడికక్కడే మృతిచెందారు. పీతల అజయ్ (24)ను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. డీఎస్పీ సీహెచ్. రాజా, సీఐ నాగేంద్రప్రసాద్, బంటుమిల్లి ఎస్ఐ గణేష్‌కుమార్‌లు సంఘటనా స్థలంలో పరిస్థితిని సమీక్షించారు. మచిలీపట్నంలో పెయింటింగ్ పనులు పూర్తి చేసుకుని స్వగ్రామం వెళుతుండగా ప్రమాదానికి గురయ్యారు. లారీ డ్రైవర్ పుప్పాల పవన్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

దర్శనాల దళారీ!

(5వ పేజీ తరువాయి)

చాలామందికి నెలవారీగా డబ్బు పంపినట్టు గూగుల్, ఫోన్‌పేల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా స్కానింగ్ విభాగంలో పనిచేసే వారికి ఈ చెల్లింపులు చేసినట్టు తెలిసింది. ఇంజనీరింగ్ విభాగంలో పదిమంది, అన్నదాన విభాగంలో ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, మైక్ ప్రచార విభాగంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి, సమాచారం కేంద్రంలో పనిచేస్తున్న ఒకరు, ఆలయంలో పనిచేస్తున్న ఒకరు, బోయలుగా పనిచేస్తున్న వారిలో ముగ్గురు.. ఇలా మొత్తం 33 మందితో శ్రీనివాస్ లావాదేవీలు నిర్వహిస్తున్నట్టు ఫోన్‌పే ద్వారా తెలిసింది.

దుర్గాఘాట్‌లో బేరాలు

శ్రీనివాస్ ఇంద్రకీలాద్రిపై ఎక్కడా కనిపించడు. మోడల్ గెస్ట్‌హౌస్ పక్కన ఉన్న దుర్గాఘాట్ అతడి స్థావరం. కానూరు నుంచి నిత్యం ఉద్యోగి మాదిరిగా అక్కడికి వస్తాడు. దుర్గాఘాట్‌లో ఉన్న భక్తుల మధ్య తిరుగుతుంటాడు. ఎవరైనా దర్శనాల గురించి మాట్లాడుకుంటుంటే విని వారితో మాటలు కలుపుతాడు. ఎంతమంది ఉన్నా వీఐపీ దర్శనాలు చేయిస్తానని చెబుతాడు. వారి నుంచి ఎంతమంది దర్శనానికి వెళ్తారో అంతమంది నుంచి రూ.500 చొప్పున డబ్బు వసూలు చేస్తాడు. ఎంతమంది దర్శనానికి వస్తున్నారో ఆ విషయాన్ని స్కానింగ్ పాయింట్‌లో ఉన్న ఉద్యోగికి చెప్తాడు. వారు అతడి వద్దకు వెళ్లినప్పుడు స్కానింగ్ సిబ్బంది వారి చేతిలో రెండు, మూడు టికెట్లు మాత్రం చేతిలో పెట్టి ఎంతమంది ఉంటే అంతమందిని క్యూలోకి పంపుతారు. ఇదికాకుండా ఒక వ్యక్తిని భక్తులకు అప్పగించి కొండపైకి పంపుతాడు. అతడు వారిని స్కానింగ్ పాయింట్ వరకు తీసుకెళ్లి అక్కడున్న సిబ్బందికి విషయాన్ని చెబుతాడు. ఉదాహరణకు ఎనిమిది మంది భక్తులు దర్శనానికి వస్తే రెండు టికెట్లు వారి చేతిలో పెడతారు. దర్శనానికి ఎనిమిది మందిని పంపుతారు. వారి నుంచి మాత్రం రూ.4 వేలను వసూలు చేస్తారు. దేవస్థానంలో సిబ్బంది విధులకు ఓ చార్ట్ ఉంటుంది. షిఫ్టులవారీగా విధులు నిర్వర్తిస్తారు. ఈ విధులు వారానికోసారి మారుతుంటాయి. ఎవరు, ఏ వారం, ఏ షిఫ్టులో ఉన్నారో శ్రీనివాస్‌కు పూర్తి సమాచారం ఉంటుంది. దాని ప్రకారం వ్యవహారాలు చక్కబెడతాడు. ఇలా సదరు 'డిప్యూటీ' రోజుకు రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నాడు. పండుగలు, పర్వదినాలు, శుక్ర, శని, ఆదివారాల్లో దుర్గఘాట్, కనకదుర్గానగర్‌లో ఈ దందాకు పాల్పడుతున్నారు.

రెక్కీచేసి.. రైల్లో చోరీ

(5వ పేజీ తరువాయి)

రైల్వేస్టేషన్‌లో దర్యాప్తు చేయడానికి ఒక బృందం, విజయవాడ స్టేషన్‌లో దర్యాప్తునకు మరో బృందం, నిందితుల కోసం ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. బెజవాడ రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా, నిందితులు ముగ్గురు పదో నెంబరు ప్లాట్‌ఫాం నుంచి బయటకు వెళ్లినట్టు కనిపించింది. అక్కడి నుంచి పీఎన్‌బీఎస్ వరకు వెళ్లి మరో ఆటోలో రామవరప్పాడు రింగ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి క్యాబ్‌లో రాజమహేంద్రవరం వెళ్లిపోయారు. ఎంజీ రోడ్డులో ఉన్న ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీసీ కెమెరాల్లో ఈ దృశ్యాలు నిక్షిప్తమయ్యాయి. క్యాబ్ నెంబర్ ఆధారంగా నిందితులకు సంకెళ్లు వేశారు. వారినుంచి మొత్తం రూ.64 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

తాగునీటిపై ప్రత్యేక దృష్టి

(5వ పేజీ తరువాయి)

రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పి కొంతమేర చేసి సరిపెట్టారు.. అసలు ఇదేం పద్ధతి.. అంటూ అవనిగడ్డ జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీపీ తుంగల సుమతీదేవి అధికారులను నిలదీశారు. అవనిగడ్డ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధిపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులతో మాట్లాడినా పనులు చేయడంలేదన్నారు. తోట్లవల్లూరు, విజయవాడ రూరల్ జెడ్పీటీసీ సభ్యులు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సువర్ణరాజు మాట్లాడుతూ జిల్లాలో వివిధ రకాల నిధులతో సిమెంటు రోడ్ల నిర్మాణానికే అనుమతులు ఇస్తున్నారని, రైతులకు ఉపయోగపడే విధంగా డొంక రోడ్ల అభివృద్ధికి కూడా అనుమతులు ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ, జెడ్పీ నిధులతో డొంకరోడ్ల నిర్మాణం చేసేందుకు అవకాశం ఉన్నా అనుమతులు ఏకారణంతో ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మోపిదేవి మండలంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, అధికారులు కాంట్రాక్టర్ల వద్ద నగదు తీసుకుని పనులు సక్రమంగా చేయించడంలేదని మోపిదేవి జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బెయిలీ బ్రిడ్జి వెల్డింగ్ పనుల్లో జాప్యం

మొవ్వ మండలం కాజ గ్రామం వద్ద ఐనంపూడి డ్రెయినేజీపై బెయిలీ బ్రిడ్జికి కనీస మరమ్మతులు చేయడంలేదని జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు వేమూరి పరిశుద్ధరాజు సమావేశం దృష్టికి తెచ్చారు. 15 గ్రామాల ప్రజల రాకపోకలకు ఆధారంగా ఉన్న ఈ బ్రిడ్జిపై ఉన్న రేకులకు వెల్డింగ్ పనులు కూడా చేయకుండా నెలల తరబడి జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ విడుదల కాలేదని, టెండర్లు రద్దయ్యాయని అధికారులు చెప్పి తప్పించుకుంటున్నారని ఆరోపించారు.

కొల్లేరు గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించండి

కైకలూరు నియోజకవర్గంలోని ముదినేపల్లి, కలిదిండి, కైకలూరు మండలాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుందని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. జెడ్పీ నుంచి నిధులు కేటాయించి వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఆయా మండలాల్లోని తాగునీటి పథకాల ఫిల్టర్ బెడ్‌లకు త్వరితగతిన మరమ్మతులు చేయించాలని కోరారు. గతంలో పంచాయతీలకు సంబంధించిన నిధులను మళ్లించడంతో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురయ్యాయని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో స్థానిక సంస్థలకు జవసత్వాలు కలుగుతున్నాయని వివరించారు.

గ్రామీణ సమస్యలపై దృష్టి పెట్టండి

సమస్యలన్నీ గ్రామాల్లోనే ఉన్నాయని, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తిరువూరు శాసన సభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు కోరారు. ఒకసారి సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను తదుపరి సమావేశం నాటికైనా పరిష్కరించాలన్నారు.

జెడ్పీకి సీపీజీఎఫ్ఎం అవార్డు

జిల్లా పరిషత్‌కు సంబంధించిన లెక్కలు పారదర్శకంగా చూపినందుకు గాను కమిటీ ఆన్ పబ్లిక్ అండ్ గవర్నమెంట్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్(సీపీజీఎఫ్ఎం) 2024-25 ఆర్థిక సంవత్సరానికి కృష్ణాజిల్లా పరిషత్‌ను ఉత్తమ జిల్లా పరిషత్‌గా ఎంపిక చేసినట్లు జిల్లా పరిషత్ సీఈవో కన్నమనాయుడు తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీన ఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, ఆర్డీవో కె.స్వాతి పాల్గొన్నారు. తొలుత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గాంధీజీ చిత్రపటానికి సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విజయవాడ తూర్పు

రాజశ్యామలా దేవిగా కాళీమాత

కృష్ణలంక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): త్రిశక్తిపీఠంలోని కాళీమాత అమ్మవారు గురువారం రాజశ్యామలా దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 6 వరకు అమ్మవారు రాజ శ్యామలా దేవిగా భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఎనిమిది రోజుల పాటు రాజ శ్యామలాదేవి హోమాలు జరుగుతాయని, భక్తులు రాజశ్యామలా దేవి రూపంలో వున్న కాళీమాతను దర్శించి తరించాలని ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పు రావూరి జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ కోరారు.



సోలార్ విద్యుత్‌ను
ఎక్కువ మంది వినియోగించేలా చూడండి

పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపు

పటమట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకంపై టీడీపీ నాయకులు విస్తృత ప్రచారం చేసి ఎక్కువ మంది సోలార్ విద్యుత్‌ను వినియోగించే విధంగా చూడాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్యాంక్ రుణాలను తీసుకొని సోలార్ ప్యానెల్స్ అమర్చుకోవడం ద్వారా కరెంటు బిల్లులకు చెల్లించే డబ్బు బ్యాంక్ రుణాలకు చెల్లించవచ్చన్నారు. పీఎం సూర్యఘర్ ఉమ్మడి జిల్లా అధికారి భాస్కర రావు మాట్లాడుతూ ఒక విద్యుత్ వినియోగదారుడికి మూడు కిలోవాట్ల సోలార్ విద్యుత్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుంటే రూ.78 వేలను ప్రభుత్వ సబ్సిడీగా ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, దేవినేని అపర్ణ, గద్దె క్రాంతికుమార్, సొంగా సంజయ్‌వర్మ, ఆంజనేయులు, గాబ్రియేలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కనకదుర్గానగర్ కాలనీలో గద్దె పర్యటన

భారతీనగర్: తూర్పు పరిధి 3వ డివిజన్‌లోని కనకదుర్గానగర్ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ గురువారం పర్యటించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ కాలనీవారి సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గుళ్లపల్లి నారాయణరావు, దనేకుల యలమందరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాడి బాబూరావు, గుత్తికొండ కృష్ణమోహన్, గద్దె రమేష్, గుత్తికొండ మోహన్‌రావు, గొల్లపల్లి నారాయణరావు, పోతునేటి సీతారామయ్య చౌదరి, రాజనాల సురేష్ బాబు, కృష్ణమోహన్, బండి కోమలి, తదితరులు పాల్గొన్నారు.

ఆరునెలలకోసారి కంటి పరీక్షలు చేయించుకోండి

డ్రైవర్లకు డీటీసీ మోహన్ హితవు



కంటి పరీక్షలు చేయించుకుంటున్న డీటీసీ ఎ.మోహన్

కృష్ణలంక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు ప్రతి ఆరు నెలలకొకసారి కంటి పరీక్షలను చేయించుకోవాలని డీటీసీ ఎ.మోహన్ హితవు పలికారు. బందరురోడ్డులోని డీటీసీ కార్యాలయంలో గురువారం రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని డీటీసీ మోహన్ ప్రారంభించారు. కంటి పరీక్షలు, బీపీ, షుగర్ సాధారణ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఆరోగ్యం పట్ల ఎప్పుడూ నిర్లక్ష్యం వహించవద్దని కోరారు. కంటిచూపు మందగించిన డ్రైవర్లు కొందరు నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నారని, అలాంటప్పుడు రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని అన్నారు. దృష్టిలోపం వున్న డ్రైవర్లు కంటి పరీక్షలను చేయించుకొంటూ అవసరమైన మందులను వాడటం, కంటి అద్దాలను పెట్టుకోవడం చేయాలన్నారు. ఉచిత వైద్య శిబిరానికి 300 మందికి పైబడి డ్రైవర్లు హాజరయ్యారని డీటీసీ తెలిపారు. వరుణ్ హెల్త్ సెంటర్ వైద్య నిపుణులైన డాక్టర్ల బృందంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. డాక్టర్ల బృందానికి డీటీసీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, మోటారు వాహన తనిఖీ అధికారులు పీవీ రమణ, వై.నాగేశ్వరరావు, మహ్మద్ ఆలీ, ఏవో అబ్దుల్ సత్తార్, సత్యనారాయణ, ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, రోడ్ సేఫ్టీ ఎస్‌ఐ త్రిమూర్తులు, డాక్టర్ తేజ, వరుణ్ హెల్త్ సెంటర్ వైద్య బృందం, డ్రైవర్లు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాలి

జాతీయ రహదారుల సాధికార సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ ఆర్‌కే సింగ్

పటమట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాలని హెల్మెట్‌లు, సీటు బెల్టులు ధరించడం ద్వారా 6 శాతం మేర రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించే వీలుందని జాతీయ రహదారుల సాధికార సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్, ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ అధికారి ఆర్‌కే సింగ్ అన్నారు. గురువారం విజయవాడ కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 36వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా అధ్యక్షుడు నాగమోతు రాజ అధ్యక్షతన రహదారి భద్రతా సదస్సు నిర్వహించారు. రాష్ట్ర రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఎ.మోహన్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాలను అధ్యయనం చేయడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.కృష్ణమూర్తి నాయుడు, ఆర్ఎంకే కిషోర్, పి.గోపాలనాయుడు, అల్లాడ సత్యనారాయణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న లెక్చరర్ రమణకు సత్కారం



లెక్చరర్ రమణకు జ్ఞాపికను అందజేస్తున్న మెకానికల్ విభాగాధిపతులు

భారతీనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): యాటపాక గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ విభాగాధిపతిగా పదోన్నతిపై వెళుతున్న విజయవాడ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ విభాగంలో సీనియర్ లెక్చరర్ ఎస్.వి.వి రమణకు ఘనసన్మానం చేశారు. గురువారం గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ సెక్షన్ విభాగాధిపతి కే విజయభాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రమణకు మెకానికల్ విభాగాధిపతులు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతులు సాయికుమార్, బాపూజీ, సందీప్ మధుసూదన్‌రావు, బీబీఆర్‌కే.ప్రసాద్, దుర్గాదేవి, రాంబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120,129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

ప్రాంగణ ఎంపికల్లో 23 మందికి ఉద్యోగాలు

లబ్బీపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మహిళా కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 23 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. కళాశాలలో గురువారం సదర్‌ల్యాండ్ గ్లోబల్ సర్వీసెస్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 68మంది విద్యార్థులు పాల్గొనగా తుది ఎంపికలో 23మంది ఉద్యోగార్హత సాధించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.2.40లక్షలు వార్షిక వేతనం అందజేస్తారని, విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి, ప్రాంగణ ఎంపికల అధికారి పి.హారిక, సిద్ధార్థ అకాడమీ కన్వీనర్, కళాశాల యాజమాన్యం అభినందించారు.

మహనీయుడు జాతిపిత బాపూజీ

చిట్టినగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సత్యం, అహింస తమ ఆయుధాలుగా భారత దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు జాతిపిత మహాత్మాగాంధీ అని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర కొనియాడారు. గురువారం వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తన చాంబర్‌లో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత కమిషనర్ ధ్యానచంద్ర పలువురు అధికారులతో కలిసి మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, అహింస మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్మా గాంధీని గుర్తు చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ డాక్టర్ డీ.చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, పలువురు అధికారులు



ఎస్ఆర్ఆర్‌లో మహాత్మాగాంధీ చిత్రపటానికి ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, విద్యార్థుల నివాళి

ఎస్ఆర్ఆర్‌లో...

గుణదల: స్థానిక ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహాత్మాగాంధీ 77వ వర్ధంతి కార్యక్రమం గురువారం జరిగింది. జాతిపితకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ యువత మహాత్మాగాంధీ అనుసరించిన విధానాలను అలవర్చుకునిదేశ ప్రగతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో ...

విజయవాడ కల్చరల్ : దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో గురువారం జాతిపిత బాపూజీ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహం అనే ఆయుధాలతో స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుకు నడిపించిన ఘనత జాతిపితదేనన్నారు. ఈ సందర్భంగా ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. గాంధీ మహాత్ముని ఆశయాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ



బెజవాడ బార్ ఆవరణలో..

బెజవాడ బార్‌లో ...

విజయవాడ లీగల్: బెజవాడ బార్ అసోసియేషన్‌లో గురువారం మహాత్మాగాంధీ 77వ వర్ధంతి కార్యక్రమం న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. ముందుగా బార్ ఆవరణలోని గాంధీ విగ్రహానికి, బార్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి న్యాయవాదులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ సభ్యులు సూరాబత్తుల మల్లేశ్వరరావు, చలసాని అజయ్‌కుమార్, బార్ మాజీ అధ్యక్షుడు వి.గురునాథం, వేముల హాజరత్తయ్య గుప్తా, సంపర శ్రీనివాసరావు, బార్ ప్రధాన కార్యదర్శి, కృష్ణా గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి అరిగెల శివరాంప్రసాద్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ శర్మ, బాషా, బొమ్మసాని రవి, చునావ్, జయప్రకాష్, కేవీ రంగారావు పాల్గొన్నారు.

ప్రివెంటివ్ అండ్ వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభం

ప్రభుత్వాసుపత్రి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సిద్ధార్థ మెడికల్ కళాశాల, విజయవాడ సూపర్ స్పెషాలిటీ బ్లాక్ జీజీహెచ్‌లో ప్రివెంటివ్ అండ్ వెల్‌నెస్ క్లినిక్‌ను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ కుమార్, సూపరింటెండెంట్ ఏవీ రావు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ పి.మాధవిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పి.అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ క్లినిక్ ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందిస్తామన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు మాట్లాడుతూ ఈ క్లినిక్ ద్వారా ప్రజలకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు, నివారణ చర్యలు, ఆరోగ్యంపై విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి సోమ, బుధవారాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ రూమ్ నెంబరు 222లో వైద్యులు అందుబాటులో ఉంటారన్నారని తెలిపారు.



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ పి.అశోక్‌కుమార్, డాక్టర్ ఏవీ రావు

లయోలా కాలేజీలో రక్తదానం



భారతీనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో లయోలా కళాశాలలో విజయవాడ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌వారు గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 96మంది విద్యార్థులు రక్తదానం చేశారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఫాదర్ జోజిరెడ్డి మాట్లాడుతూ రక్తదానానికి మించిన గొప్ప దానం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఓ.మహేష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్.అభిషేక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎ.రాజేష్, బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవాడ రైల్వే ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్‌గా శ్రీనివాసు బాధ్యతల స్వీకరణ



డాక్టర్ శ్రీనివాసుకు అభినందనలు చెబుతున్న షేక్ బాబర్‌వలీ

రైల్వేస్టేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ సీహెచ్ శ్రీనివాసు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆసుపత్రి వైద్యులు షేక్ బాబర్‌వలీతో పాటు పలువురు వైద్యులు ఆయనకు స్వాగతం పలికారు, దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. అనంతరం శ్రీనివాసు ఆసుపత్రిలోని విభాగాలను పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. అన్ని సేవలను రోగులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కాగా ఇప్పటి వరకు విజయవాడ రైల్వే ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన శౌరిబాల గుంటూరుకు బదిలీ అయ్యారు.

క్రైస్తవుల సంక్షేమమే కూటమి లక్ష్యం

ధర్నాచౌక్: క్రైస్తవుల అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు అన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో క్రైస్తవులు విసిగిపోయారన్నారు. నమ్మి ఓట్లు వేసి గెలిపించిన క్రైస్తవులను జగన్ తీవ్రంగా మోసం చేశారని మండిపడ్డారు. జంగా ప్రవీణ్, మోజెస్ తిమోతి, థామస్, మార్క్, సాల్మన్ పాల్గొన్నారు.

పంట పొలాలు కోత
రైతుల గుండె ఘోష

కృష్ణానదిలో వరదలకు వందల ఎకరాల్లో పంట భూముల కోత





పచ్చని బంగారు పంటలు పండే లంక భూములు కృష్ణానది వరదలకు కోతకు గురై రైతులకు గుండెఘోషను మిగుల్చుతున్నాయి. ఏటా సంభవించే వరదలకు 30 నుంచి 50 ఎకరాల భూములు కోతకు గురై నదిలో కలిసిపోయి ఇసుక మేటలుగా తయారవుతున్నాయి. ఒకపక్క పంట భూములు కోతకు గురవుతున్న బాధ ఉంటే మరోవైపు లంక గ్రామాలకు ప్రమాదం ముంచుకు వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - తోట్లవల్లూరు-ఆంధ్రజ్యోతి

తోట్లవల్లూరు మండలంలో 8 లంక గ్రామాలున్నాయి. ఐలూరు శివారు గ్రామాలైన కనిగిరిలంక, ములకలపల్లిలంక, దేవరపల్లి శివారు పొట్టిదిబ్బలంక, చాగంటిపాడు శివారు పిల్లివానిలంక, పాములలంక, దాని శివారు తుమ్మలపచ్చికలంక, వల్లూరుపాలెం శివారు కాళింగదిబ్బలంక, రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బ (రావిచెట్టులంక)లంక గ్రామాలు కృష్ణానది పాయల మధ్య ఉన్నాయి. ఈ ఎనిమిదిలంక గ్రామాల్లో 3,500 జనాభా నివసిస్తున్నారు. సుమారు 10 వేల ఎకరాల పంట భూములున్నాయి. కరకట్ట వెంబడి గ్రామాల రైతులకు అక్కడ పంట భూములున్నాయి. ఎంతో సారవంతమైన ఈ భూముల్లో పసుపు, కంద, అరటి, చెరకు, తమలపాకు, బొప్పాయి, తదితర వాణిజ్య పంటలు, కూరగాయ పంటలను రైతులు పండిస్తున్నారు. నదీపాయల మధ్య ఈ భూములుండటంతో కృష్ణానదికి వరద వచ్చినప్పుడల్లా పంటలు ముంపునకు గురై నష్టాన్ని కలిగిస్తాయి. అయినా ఎదుర్కొని మళ్లీ పంటలు పండించి ముందుకు సాగుతున్నారు. కానీ వరద ఉధృతికి ఏకంగా పంట భూములు కోతకు గురికావటం కలవర పరుస్తోంది. ఏటా వచ్చే వరదలకు పంట భూములు విరిగిపోయి నదిలో కలుస్తూ ఇసుక మేటలు వేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. గతేడాది సెప్టెంబరులో సంభవించిన అతిపెద్ద వరదకు పంట భూములు విపరీతంగా కోతకు గురయ్యాయని కనిగిరిలంక, ములకలపల్లిలంక రైతులు చెప్పారు. ఇదిలాగే కొనసాగుతూ ఉంటే భవిష్యత్తులో జనాలు నివసిస్తున్న లంక గ్రామాలకు సైతం ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అలాగే తోడేళ్లదిబ్బలంక వద్ద పెద్ద ఏటిపాయ వైపు, దేవరపల్లి వద్ద కరకట్ట వైపున పంట భూములు కోతకు గురయ్యాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సైతం నదిలోకి వచ్చేసిందంటే తీవ్రత ఎంత అధికంగా ఉందో తెలుస్తుంది. ఈ భూముల కోతపై ఐలూరు సర్పంచ్ పీరాటి సూజాత మండల పరిషత్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. కనిగిరిలంక, ములకలపల్లిలంక గ్రామాల రైతుల పంట భూములు విపరీతంగా కోతకు గురవుతున్నాయని, నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇది సాధ్యం కాదని అధికారులు తేల్చారు. సముద్ర తీరప్రాంత రక్షణకు అనువుగా ఉండే మడ అడవుల్లాంటి మొక్కలు నది అంచు వెంట నాటితే భూమి కోత తీవ్రతను కొంతైనా తగ్గించే అవకాశం ఉండవచ్చని ప్రజలు సూచిస్తున్నారు.

ఒకేచోట 30 ఎకరాల భూముల కోత
కడియాల సత్యప్రసాద్, రైతు, ఐలూరు



గతేడాది సెప్టెంబరులో వచ్చిన కృష్ణానది వరదలకు ఒకేచోట పలువురు రైతులకు చెందిన 30 ఎకరాల పంట భూములు కోతకు గురై నదిలో కలిసిపోయాయి. అందులో తనకు చెందిన పంట భూములున్నాయి. భూములు కోతకు గురయ్యాయని బాధ పడటం మినహా ఏమీ చేయలేని పరిస్థితి. దీన్ని ప్రభుత్వం కూడా నివారించే అవకాశం లేదు. మళ్లీ ఎప్పుడైనా మట్టిమేటలు ఏర్పడితే సాగు చేసుకోవటం తప్ప మరో మార్గం లేదనిపిస్తోంది.

లంక గ్రామాలకు ముప్పు
బూరగడ్డ వీరబాబు, రైతు, కనిగిరిలంక



కనిగిరిలంక, ములకలపల్లిలంక గ్రామాల్లోని పంట భూములు ఎక్కువగా కోతకు గురవుతున్నాయి. కృష్ణానది వరద నేరుగా వచ్చి పంట భూములను తాకుతుండటంతో కోత ఏర్పడుతోంది. ఇలా భూములు కోతకు గురవుతూ ఉంటే భవిష్యత్తులో లంక గ్రామాలకు పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. కోత నివారణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- ఏటా వరదలకు భూములను కోల్పోతున్న లంక రైతులు
- కనిగిరిలంక, ములకలపల్లి లంకల్లో తీవ్రంగా నష్టం
- మట్టి కొట్టుకుపోయి ఏర్పడుతున్న ఇసుక మేటలు
- పంట భూములే కాదు గ్రామాలకూ పొంచిన ప్రమాదం

రాజధానిలో ప్రభుత్వ భవనాలకు శుద్ధ జలం

● రూ. 7 కోట్లతో ఫిల్టర్ హౌస్ నిర్మాణం ● రాజధానిలో ప్రభుత్వ భవన సముదాయాలకు నీరు పంపిణీ ● 24/7 తాగునీటి సరఫరాకి బృహత్ ప్రణాళిక





రాజధాని అమరావతిలో ప్రభుత్వ భవనాలకు శుద్ధమైన తాగునీటిని అందించేందుకు నిర్మించిన ఫిల్టర్ హౌస్, కృష్ణానది ఒడ్డున ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్, హైకోర్టు వద్ద పైపులైన్‌కు ఏర్పాటు చేసిన ట్యాప్

తుళ్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో శాశ్వత ప్రాతిపదికన నిర్మించనున్న ప్రభుత్వ భవన సముదాయాలకు (గవర్నమెంటు కాంప్లెక్స్ ఐదు టవర్లు, హైకోర్టు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్, ఐపీఎస్, క్లాస్ 2,4 ఉద్యోగస్తుల గృహాలు, హెచ్‌వోడీ భవనాలు, సీఆర్డీఏ జోనల్ కార్యాలయం) పరిశుద్ధమైన తాగునీరు అందించడానికి సీఆర్డీఏ బృహత్ ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందుకోసం రూ. 7 కోట్లతో రాయపూడి కృష్ణానది ఒడ్డున ఫి ల్టర్, పంపింగ్ హౌస్‌ల నిర్మించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే దీనికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం కూట మి ప్రభుత్వం రాజధాని నిర్మాణాన్ని శరవేగం గా పూర్తి చేయాలన్న పట్టుదలతో ఉంది. సీఎం చంద్రబాబు రాజధాని నిర్మాణ పనులపై ప్రత్యే క దృష్టి సారించారు. వీటిలో భాగంగానే రాజధాని భవన సముదాయాలకు శుద్ధమైన తాగునీటి సరఫరా నిమిత్తం పైపు లైను ఏర్పాటు పనులను ప్రారంభించింది. రాయపూడి నుంచి శాఖమూరు రెవెన్యూ పరిధిలోని ఉద్యోగస్తుల ఇళ్ల వరకు పది కోట్ల వ్యయంతో 13 కిలో మీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. రాజధానిలో ప్రభుత్వ భవన సముదాయాలు ఎప్పుడు పూర్తయితే అప్పుడు 365 రోజులు, 24 గంటలు తాగునీటిని సరఫరా చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



సినీ హీరో, హిందూపురం శాసనసభ్యుడు, పద్మభూషణ్ బాలకృష్ణకు అభినందనలు తెలియజేస్తున్న కళాసంస్థల ప్రతినిధులు

హీరో బాలకృష్ణకు కళాసంస్థల అభినందనలు

విజయవాడ కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ సినీ హీరో నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ ప్రకటించిన సందర్భంగా కళాసంస్థలు హర్షం వ్యక్తం చేస్తూ హీరో బాలకృష్ణకు అభినందనలు తెలియజేశాయి. గురువారం కౌతా పూర్ణానందం సత్రంలోని కళాసంస్థల కార్యాలయంలో నిర్వహించిన అభినందన సభలో తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ప్రతినిధి కె.డేవిడ్‌రాజు, సువర్ణమణి రిథమ్స్ అధ్యక్షులు మారేపల్లి జోషి, ప్రిన్స్ మెలోడీస్ అధ్యక్షులు ప్రిన్స్, జేపీ అండ్ రాజ్ స్వరాంజలి అధ్యక్షులు ఆదిరాల జయప్రభు, సయ్యద్ యాకూబ్, గాయకులు డి.చంద్రశేఖర్, మధుసూదనరావు తదితరులు అభినందనలు తెలిపారు. తండ్రి నందమూరి తారకరామారావు నుంచి నటనలో, ప్రజల సేవ చేసే గుణంలో రాజకీయ ప్రతినిధిగా వచ్చిన వారసత్వాలను పుణికిపుచ్చుకొన్న ఆయన మరింత కీర్తి శిఖరాలనధిరోహించాలన్నారు.

ముగిసిన ఎన్టీఆర్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు

వన్‌టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా నెహ్రూ యువ కేంద్రం బుధ, గురువారాల్లో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. కేబీఎన్ కళాశాల, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో పోటీలను నిర్వహించారు. బ్లాక్‌లెవల్, మండలస్థాయి క్రీడాకారులు కూడా ప్రాతినిధ్యం వహించారు. విజేతలకు ఎన్టీఆర్ జిల్లా ఆర్డీవో వెంకటేశ్వరరావు, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ సుంకర రాము, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కొల్లేటి రమేష్, ఫిజికల్ డైరెక్టర్ యుగంధర్ బహుమతి ప్రదానం చేశారు. వాలీబాల్‌లో తిరువూరు వాహిని కళాశాల యూత్ క్లబ్ క్రీడాకారులు మొదటి బహుమతి పొందారు. కబడ్డీ మహిళల విభాగంలో లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ యూత్ క్లబ్ విద్యార్థినులు, బాడ్మింటన్‌లో పురుషులు, మహిళల విభాగంలో తిరువూరు వాహినీ కాలేజీ విద్యార్థులు, పరుగుపందెం మహిళల విభాగంలో వాహినీ కాలేజీ విద్యార్థిని, పురుషుల విభాగంలో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కాలేజీ విద్యార్థి బహుమతులు గెలుచుకున్నారు.

ఆర్టీసీ ఎండీగా ద్వారకా తిరుమలరావును కొనసాగించడంపై ఈయూ హర్షం

బస్‌స్టేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ) ఎండీగా ద్వారకాతిరుమల రావును కొనసాగించడంపై ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) గురువారం ఒక ప్రకటనలో హర్షం వెలిబుచ్చారు. ఈనెల 31న పదవీ విరమణ చేస్తున్నప్పటికీ మరో ఏడాది పాటు ఇదే హోదాలో కొనసాగిస్తూ ఆదేశాలు జారీ చేసినందుకు సీఎం చంద్రబాబుకు ఈయూ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నర్సయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

స్వాముల్లా వచ్చి పట్టపగలు చోరీ

● 12 గంటల్లో పట్టుకున్న మాచవరం పోలీసులు ● అభినందనలు తెలిపిన ఎన్టీఆర్ కాలనీ పెద్దలు

గుణదల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కష్టపడకుండా కాషాయం కట్టి డబ్బు సంపాదించాలనుకున్న ముగ్గురు అన్నదమ్ముల వ్యూహం బెడిసికొట్టడంతో దొంగతనానికి పాల్పడ్డ 12 గంటల వ్యవధిలోనే పోలీసులకు చిక్కిన ఘటన మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. గన్నవరం మండలం కేసరపల్లి చెంచుకాలనీలో నివాసం ఉంటున్న ఇద్దరు మైనర్‌లు... ఓ యువకుడు మొత్తం ముగ్గురు అన్నదమ్ములు కాషాయవస్త్రాలు ధరించి భిక్షాటన పేరుతో ఎన్టీఆర్ కాలనీలోకి ప్రవేశించారు. కాలనీలోని రోడ్ నెంబర్ 5లో ఓ మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించారు. మొదట భిక్షం తల్లి అనుకుంటూ ఓ వ్యక్తి వెళ్లాడు. ఆమె కాషాయ వస్త్రం ధరించి ఉన్నాడు కదా అని రూ.50 తెచ్చి జోలెలో వేసి వెళ్లిపోతుంటే ఆమె వెనుకగా ఏకంగా ఇంట్లోకి ప్రవేశించాడు. అదేంటి ఏకంగా ఇంట్లోకి వచ్చేశావ్ అని ఆమె ప్రశ్నించగా అరవకు నా చేతిలో వీబూది ఉంది మంత్రించి చల్లానంటే ఏమౌతుందో తెలుసా అంటూ బెదిరించాడు. దాంతో ఆమె భయపడిపోయింది. ఇంట్లో ఏమీ లేకపోతే ఫోన్‌పేలో ఎంత ఉన్నాయో అంత సొమ్మును నాకు ఫోన్ చేసేయ్ అని చెప్పడంతో ఆమె తన ఫోన్లో ఉన్న 5 వేలు అతనికి బదిలీ చేసింది. అంతేకాక లోనికి వెళ్లి బీరువాలో ఎంత ఉన్నాయో మర్యాదగా తీసుకురా, లేదంటే ఏం చేస్తానో నాకే తెలియదని మరోమారు బిగ్గరగా గదాయించాడు. దాంతో ఆమె బీరువాలోని రూ. 10వేలు తెచ్చి ఇచ్చింది. డబ్బులు చేతిలో పడ్డాక ఎవరికైనా చెప్పావో నీ అంతుచూస్తానంటూ బెదిరించి వెళ్లాడు. ఈ సమయంలో ఆ ఇంటి బయట మరో ఇద్దరు కాపలాగా ఉన్నారు. అగంతకులు వెళ్లిన కొద్దిసేపటి తర్వాత బాధితురాలి పిల్లలు ఇంటికి వచ్చి తల్లి పరిస్థితిని తెలుసుకొని కాలనీ పెద్దల ద్వారా విషయాన్ని మాచవరం పోలీస్ స్టేషన్‌లో తెలియజేయడంతో సీఐ ప్రకాష్ తక్షణమే ఓ బృందాన్ని రంగంలోకి దింపారు. వారు ఫోన్‌పే చేయించుకున్న నెంబరు ఆధారంగా ట్రాప్ చేసి మొదట ఒక యువకుడిని (17)ని అదుపులోకి తీసుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో మోతె నాగసుబ్బారావు (21)తో పాటు మరో మైనర్ (16)ను గురువారం రాత్రి 9 గంటల సమయంలో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. బాధితురాలు అలోకు లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మాచవరం సీఐ ప్రకాష్ తెలిపారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ నేతలు

మళ్లీ వివాదం!

విజయవాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోల కాలేజీ యాజమాన్యం, వాకర్స్ అసోసియేషన్ల మధ్య వివాదం సమసిందనుకున్న తరుణంలో కొత్త మలుపు తిరిగింది. ఆంధ్రా లయోల కాలేజీ యాజమాన్యం తరపున సేవ్ లయోల పేరుతో ఓ వీడియోను విడుదల చేయటం వివాదాస్పదమైంది. ఈ డాక్యుమెంటరీ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయటంతోపాటు మత హింసను ప్రేరేపించడం, శత్రుత్వాలను పెంచేదిగా ఉందంటూ మాచవరం పోలీసు స్టేషన్‌లో వాకర్స్ గురువారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 27న ఓ యూట్యూబ్ ఛానల్‌లో ఆంధ్రా లయోల కాలేజీకి, వాకర్స్ అసోసియేషన్ల మధ్య తలెత్తిన వివాదంలో వాస్తవాలు ఏమిటి? వాకర్స్ అసోసియేషన్ దురాగతాలు ఏమిటన్న అంశాలపై 18 నిమిషాల వీడియోను పోస్ట్ చేశారు. లయోల కాలేజీ హెడ్ సెక్రటరీ సింగారెడ్డి మెల్ఛియర్, మరికొంత మంది ఫాదర్స్ కుట్రతో తప్పుడు సమాచారంతో కూడిన వీడియోను పోస్ట్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆంధ్రా లయోల కాలేజీ యాజమాన్యం ఉపయోగించిన పదజాలం దారుణంగా ఉందని, మతసామరస్యాన్ని దెబ్బతీసేలా ఉందని ఆరోపించింది. ఈ వీడియో రూపొందించి పోస్ట్ చేసిన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాల్సిందిగా వాకర్స్ అసోసియేషన్ గురువారం మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. విద్యాసంస్థల మైదానాలలో వాకింగ్ చేసుకోవటానికి అనుమతులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ఈ వివాదం చోటు చేసుకోవటం గమనార్హం.

పాడిరైతులకు అండగా ఉంటాం

● కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని

గుడ్లవల్లేరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఉత్పత్తి దారులకు అండగా ఉంటుందని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. గురువారం యూనియన్ వజ్రోత్సవాల్లో భాగంగా కౌతవరం పాలుత్పత్తిదారుల సంఘంలో 60ఏళ్లుగా యూనియన్‌తో మమేకమై పాలు పోస్తున్న పాడిరైతులను సన్మానించారు. కౌతవరం పాలుత్పత్తిదారుల సంఘానికి కూడా 60ఏళ్ల ఘన చరిత్ర ఉందన్నారు. సంఘం ఏర్పడినప్పటి నుంచి వీబీకేబీ సుబ్బారావు (బాబూరావు) అధ్యక్షుడిగా ఉంటూ సంఘాన్ని, పాడి రైతును లాభాల బాటలో ఉంచారని ఆంజనేయులు కొనియాడారు. రూ.40 పైసలతో మొదలైన పాల ధర ప్రస్తుతం గేద పాలకు రూ.62, ఆవు పాలకు రూ.41 ఇస్తున్నామన్నారు. 1965లో 15మంది పాల ఉత్పత్తిదారులతో సంఘం స్థాపించబడి నేటికి 236 మంది రైతులు ఉత్పత్తిదారులుగా ఉండటం ముదావహమన్నారు. కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా డైరెక్టరుగా కూడా బాబూరావు ఘనమైన సేవలందిస్తున్నారన్నారు. సంఘ అధ్యక్షుడు వల్లభనేని భాస్కర కుటుంబ వెంకట సుబ్బారావు, డైరెక్టర్ అర్జా వెంకట నగేష్, కాగిత జయరాం,ఫీడ్ కమిటీ సభ్యులు మోతుకూరి వెంకటేశ్వరరావు, గుడ్లవల్లేరు పాలశీతల కేంద్రం మేనేజరు తోట సత్యనారాయణ, సూపర్వైజరు పెయ్యేటి బసవ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



కౌతవరం పాలకేంద్రంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

డంపింగ్ యార్డులేని రాష్ట్రంగా ఏపీ

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

గుణదల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డ్ లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి అన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో సెగ్రిగేషన్ ఆఫ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ గుణదల్లోని హయత్ హోటల్లో గురువారం నిర్వహించారు. పట్టాభి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ అనేది రాష్ట్రంలో ఉండకూడదనేది కూటమి లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నట్టు తెలిపారు. వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్స్ మాత్రమే రాష్ట్రంలో ఉండాలన్నారు. జీరో టూ జీరో వేస్ట్ కలెక్షన్ చేయడానికి ఆదేశాలిస్తున్నామన్నారు. వేస్ట్‌ని తడి పొడి చెత్తగా వేర్వేరుగా సేకరించబోతున్నామన్నారు. వాటిని రీసైకిల్ చేసి ఎరువుగా ఉపయోగించబోతున్నామన్నారు. రెవెన్యూ ఫర్ వేస్ట్ అనే కాలమ్‌ను రాష్ట్ర బడ్జెట్‌లో ప్రజలు త్వరలో చూడబోతున్నారన్నారు. అన్ని శాఖల నుంచి ప్రభుత్వానికి ఎలా ఆదాయం వస్తుందో అలాగే చెత్త నుంచి కూడా ప్రభుత్వానికి ఆదాయం రాబోతుందన్నారు. త్వరలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌ను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో ఏర్పాటు చేయబోతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ మద్దతు తెలపడం శుభపరిణామన్నారు.

టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో తోట వెంకయ్య అరెస్టు

గన్నవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో మొత్తం 93 మంది ఉన్నారు. కొంతమందికి యాంటిసిపేటరీ బెయిల్‌ను గత నెల 20న హైకోర్టు రద్దు చేసింది. దీంతో నిందితులు పరారయ్యారు. పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టగా 47 మంది అరెస్టు కావాల్సి ఉండగా ఇటీవల ఆరుగురిని, బుధవారం ఒకరు, తాజాగా గురువారం ఏ-46 అయిన తోట వెంకయ్యను ముసునూరు మండలం చెక్కపల్లి వద్ద మధ్యాహ్నం 2 గంటలకు అరెస్టు చేసినట్టు సీఐ టీవీ శివప్రసాద్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న తోట వెంకయ్యను సీఐడీ అధికారులకు అప్పగించినట్టు చెప్పారు. ఇదిలా ఉండగా పి.హేమంత్-ఏ6, మద్దాల నవీన్ ఏ-13 సీఐడీ కార్యాలయంలో లొంగిపోయినట్టు తెలిపారు. పరారీలోఉన్న కైలే శివకుమార్, వేల్పూరి బసవరావు కొడుకులను సీఐడీ అధికారులు తీసుకువెళ్లి విచారించి పంపేశారు.



ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ 2025 కేలెండర్‌ను రాష్ట్ర సచివాలయంలో ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, చిత్రంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గోరంట్ల నారాయణ, అధ్యక్షుడు విజయభాస్కర్, కోశాధికారి మహేశ్, ప్రశాంత్

మన అమరావతి చాలా బాగుంది

● ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
● ఏపీ ఫొటో జర్నలిస్ట్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): 'మన అమరావతి.. చాలా బాగుంది' అంటూ లైట్ల వెలుగుల్లో వెలిగిపోతున్న రాజధాని ప్రాంత ఫొటోను చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఏపీ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ 2025 క్యాలెండర్‌ను వెలగపూడి సచివాలయంలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యాలెండర్లోని ఫొటోలు చూసిన ఆయన 2018లో లైట్ల వెలుగులో ఉన్న రాజధాని ప్రాంత ఫొటో చూసి చిరునవ్వు చిందించారు. ప్రజా సమస్యల్ని కెమెరా నేత్రంతో ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తోన్న ఫొటో జర్నలిస్టుల్ని సీఎం అభినందించారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు విజయ భాస్కర్, నారాయణ, మహేశ్, ప్రశాంత్, సతీష్ పాల్గొన్నారు.

బొడ్డుబొమ్మ సెంటర్ పార్కింగ్‌లో
నిరాటంకంగా వసూళ్ల దందా

● పట్టించుకోని అధికారులు

వన్‌టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ రథం సెంటర్, బొడ్డుబొమ్మ వద్ద కార్పొరేషన్ ఆధ్వర్యంలోని పార్కింగ్‌లో అనధికారికంగా వసూలు దందా నిరాటంకంగా కొనసాగుతోంది. వాహనదారులు, భక్తులు ప్రభుత్వాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవటం లేదని ఆరోపణలు వస్తున్నాయి. బొడ్డుబొమ్మ సెంటర్ పార్కింగ్ వద్ద దుర్గగుడికి వచ్చిన భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేయగా, పక్కనే ఉన్న మరో పార్కింగ్ సిబ్బంది ఇక్కడ పార్కింగ్ చేసిన వాహనదారుల వద్దకు వెళ్లి ఒక్కో వాహనం నుంచి రూ.100, 200 వరకు అనధికారికంగా వసూలు చేస్తున్నారు. అక్రమ రుసుము వసూలుపై ప్రశ్నించిన వాహనదారులపై దౌర్జన్యంగా వ్యవహరిస్తూ, అసభ్యకరంగా దూషిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ దందా గురించి అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

క్యూలో నిలబడకుండానే టికెట్ల జారీ

రైల్వేస్టేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికులు రైల్వేస్టేషన్లలో టికెట్ల కౌంటర్ల ముందర క్యూలైన్లలో వేచి ఉండనవసరం లేకుండా సులభంగా టికెట్లు పొందేందుకు రైల్వే శాఖ యూనివర్శిడ్ టిక్కెట్ సిస్టమ్ (యూటీఎస్)ను అందుబాటులోకి తెచ్చింది. సమయాన్ని వృథా కాకుండా వెంటనే టిక్కెట్ పొందేందుకు ఈ యాప్ సహకరిస్తుంది. దక్షిణ మధ్య రైల్వే విజయవాడ జోన్ అంతటా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు డివిజన్‌లో 90 యూటీఎస్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా 172 క్యూఆర్ కోడ్‌లను కూడా అమర్చారు. మొత్తంగా సౌత్ సెంట్రల్ రైల్వేలో 897 క్యూఆర్ పరికరాలున్నాయి. కౌంటర్ల వద్ద చిల్లర సమస్యను ఇలా పరిష్కరించినట్లయింది. మొబైల్‌లో క్యూఆర్ కోడ్ ప్రదర్శితమైన వెంటనే యూపీఐ ఆధారిత చెల్లింపులను వినియోగించి, కోడ్‌ను స్కాన్ చేసి చెల్లింపు చేశాకే టికెట్ వస్తుంది. ఈ సందర్భంగా గురువారం విజయవాడ డివిజన్ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ యూటీఎస్, పీఆర్ఎస్ కౌంటర్లలో క్యూఆర్ కోడ్ ఆధారిత చెల్లింపుల విధానాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలన్నారు.



రైల్వేస్టేషన్‌లో టికెట్ కౌంటర్ల వద్ద అమర్చిన క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న ప్రయాణికుడు

దుర్గగుడిలో అనధికార ఉద్యోగి హల్‌చల్

● భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న వైనం

వన్‌టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలోని అన్నదాన విభాగంలో కమిషనర్ అనుమతి లేకుండా విధులు నిర్వహిస్తున్న మణికుమార్ అనే ఉద్యోగి భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, అన్నప్రసాదం స్వీకరించేటప్పుడు ఇబ్బందులు సృష్టిస్తున్నాడని భక్తులు ఆరోపిస్తున్నారు. దేవదాయ శాఖ కమిషనర్ అనుమతి లేకుండా 5 నెలల నుంచి మణికుమార్ మహామండపం రెండో అంతస్తులోని అన్నదాన విభాగంలో మైక్ ప్రచారం చేస్తున్నాడు. కొన్నిరోజుల నుంచి మైక్ ప్రచారం చేయకుండా అన్నప్రసాదం స్వీకరించే భక్తుల వద్దకు వెళ్లి త్వరత్వరగా భోజనం చేయాలంటూ తొందరపెడుతూ వారి మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్నాడు. దీనిపై భక్తులు సమాచార కేంద్రంలో ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. కమిషనర్ అనుమతి లేకుండా అతడిని ఎలా నియమించారని, జీతం ఎలా చెల్లిస్తున్నారని తోటి ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. అన్నదాన విభాగంలో అంతా తానై ఉద్యోగులను కూడా బెదిరిస్తున్నాడని వారు ఆరోపిస్తున్నారు. ఈవో స్పందించి అతడిపై చర్యలు తీసుకోవాలని భక్తులు, ఉద్యోగులు కోరుతున్నారు.

పర్వదినం

సకల విద్యాప్రదాయిని



2న శ్రీపంచమి

సర్వశక్తిమయి అయిన జగదంబను వాక్కు, బుద్ధి, జ్ఞానాల స్వరూపిణిగా భావన చేస్తే... ఆ రూపమే సరస్వతీ దేవి. ఆమెను ఆరాధించే గొప్ప పర్వదినం మాఘ శుద్ధ పంచమి. దీనినే 'శ్రీ పంచమి' అని కూడా అంటారు. సరస్వతీదేవిని 'జ్ఞానం దేహి స్మృతి దేహి విద్యాం విద్యాధి దేవతే ప్రతిష్ఠాం, కవితాం దేహి శక్తిం శిష్య ప్రబోధితాకామ్' అని 'బ్రహ్మవైవర్త పురాణం' వర్ణించింది. "విద్యాధిదేవత అయిన సరస్వతీ దేవి జ్ఞానాన్ని, జ్ఞాపకాన్ని ప్రసాదించే తల్లి. విద్యను, ప్రతిష్ఠను, కవితాశక్తిని ఆమె అనుగ్రహిస్తుంది. శిష్యులను జ్ఞానవంతులుగా చేసే శక్తిని సమకూరుస్తుంది" అని భావం.

ప్రాణశక్తి, జ్ఞాన శక్తి...

ప్రతిభ, మేధ, శ్రద్ధ, స్ఫురణ, సాహిత్య సంగీతాది కళా నైపుణ్యాలు సరస్వతీ గుణాలు. పూర్వం గురువులు 'సరస్వతీ నమస్తుభ్యం' అంటూ ప్రార్థన చేయించిన తరువాత విద్యార్థులకు బోధన ప్రారంభించేవారు. అక్షరాభ్యాసానికి ముందు సరస్వతిని పూజించి, పలక మీద బలపంతో శివ పంచాక్షరిని రాయించే ఆనవాయితీ ఉంది. బ్రహ్మదేవుడు సరస్వతిని ఆరాధించి, జ్ఞానాన్ని పొంది... సృష్టిని ఆరంభించాడని పురాణాలు చెబుతున్నాయి. వాణి, భారతి, వీణాపాణి, విద్యావాచస్పతి, వాగ్దేవి, బుద్ధిధాత్రి, ప్రజ్ఞ... ఇలా ఆమెకు సహస్రాధికంగా పేర్లు ఉన్నాయి. లౌకికమైన విద్యలకు, పారమార్థికమైన బ్రహ్మవిద్యకు అధినేత్రి సరస్వతి. భ్రమ, బుద్ధిమాంద్యం, మతిమరపు, వాక్కులో లోపాలు తదితరాలను సమూలంగా నశింపజేస్తుంది కాబట్టి 'నిశ్శేష జాడ్యాపహా' అని సరస్వతీదేవిని వర్ణించారు. వేదాల్లో సరస్వతీ సూక్తాలు ఉన్నాయి. ప్రాణ శక్తిగా, జ్ఞానశక్తిగా పూర్వులు సరస్వతిని ఆరాధించారు. 'యా బ్రహ్మాచ్యుత శంకరః ప్రభృతిభిః దేవైః సదా పూజితా..' సరస్వతీ దేవిని సర్వ దేవతలూ పూజిస్తారు.

నాటి వ్యాసపురి... నేటి బాసర


పురాణ గ్రంథాల ప్రకారం... వాల్మీకి మహర్షి... సరస్వతిని ఉపాసించి రామాయణ మహా కావ్య రచన చేశాడు. ఆ బాటలోనే వ్యాస మునీంద్రుడు కూడా నడచి వేదవిభజన చేశాడు. పురాణాలను ఆవిష్కరించి, మహా భారత, భాగవత, బ్రహ్మసూత్రాది రచనలు చేసి... భారతీయ సంస్కృతికి, సనాతన ధర్మానికి ఆచార్యుడు అయ్యాడు. సరస్వతీ దేవిని సాక్షాత్కరించుకున్న వ్యాసుడు ఆ తల్లి ఆజ్ఞపై పరమ పావన గోదావరీ తీరంలోని వాసర క్షేత్రంలో ఆమెను సైకత మూర్తిగా ప్రతిష్ఠించాడు. ఆ రోజు మాఘ శుద్ధ పంచమి అనీ 'దేవీ భాగవతం' తదితర గ్రంథాలు పేర్కొంటున్నాయి వ్యాసపురిగా ప్రసిద్ధి చెందిన ఆ క్షేత్రం అనంతర కాలంలో 'బాసర'గా ప్రాచుర్యం పొందింది. సరస్వతీ కృపతోనే అపారమైన తత్త్వ విజ్ఞానాన్ని పొందానని చెప్పిన ఆది శంకరులు శృంగేరిలో శారదామాతను ప్రతిష్ఠించి, ఆరాధించారు. యాజ్ఞవల్క్యుడు గురు శాపం కారణంగా అభ్యసించిన విద్యలన్నిటినీ కోల్పోయాడు. సూర్యుడి సూచనల మేరకు సరస్వతిని ఉపాసించి ఆమె కరుణను పొందాడు. మళ్ళీ విద్వాంసుడయ్యాడు.

మాఘ శుద్ధ పంచమి రోజున జన్మించిన సరస్వతీ దేవి తెలుపు వర్ణంలో వెలుగులీనుతూ ఉంటుంది. ఆమెకు ఇష్టమైన రంగు తెలుపు. తెల్లని పద్మం ఆమె పీఠం. హంస ఆమె వాహనం. తెల్లని పుష్పాలు ఆమెకు ఇష్టం. తెల్ల రంగు వస్త్రాలతో ఆమెను అలంకరించి, పూజించి, తెల్లని పాయసాన్ని నివేదిస్తే అనుగ్రహిస్తుందని పెద్దలు చెప్పారు. పుస్తక ధారిణి అయిన సరస్వతిని పుస్తక రూపంలోనూ పూజించవచ్చు. గాయత్రిగా, సావిత్రిగా, పరాశక్తిగా శ్రుతులు పేర్కొన్న సరస్వతిని శ్రీపంచమినాడు భక్తితో అర్చిస్తే సర్వ శుభాలు చేకూరుతాయనేది పెద్దల మాట.

• ఆయపిళ్ళ రాజపాప

మౌనమే ఆయన సందేశం...

"నేను మేలుకొలుపడానికే కాని బోధించడానికి రాలేదు" అని ప్రకటించిన సద్గురువు అవతార్ మెహెర్‌బాబా. ఆయన 44 ఏళ్ళ పాటు సుదీర్ఘ మౌన దీక్షలో గడిపారు. దేశ, విదేశాల్లో పర్యటించినప్పుడు, ప్రమాదాలకు గురై చికిత్స పొందుతున్న సమయంలో కూడా ఆయన మౌనాన్ని విడిచిపెట్టలేదు. మౌనమే తన సందేశంగా జీవించారు. అయితే తాను మౌనాన్ని ఒక ప్రతిజ్ఞలా కానీ, తపోదీక్షగా కానీ చేపట్టలేదనీ, విశ్వకళ్యాణం కోసమే చేపట్టాననీ ఆయన స్పష్టం చేశారు. "మీరు చూస్తున్న ఈ ప్రపంచం అంతా ఒక మిథ్య. ఇదంతా ఒక కల. ఈ నిజాన్ని మీరు తెలియజేయడం కోసమే మెహర్‌బాబాగా మీ మధ్యకు వచ్చాను. ఈ సత్యం తెలుసుకోవాలంటే మీకు భగవంతుడి కృప కావాలి. నిరంతర భగవన్నామ స్మరణ ద్వారానే అది లభిస్తుంది. తద్వారా మంచి కర్మలు చేపట్టడం, మంచి సంస్కారాలు పొందడం, క్రమేణా జన్మ రాహిత్యం, భగవంతుడిలో ఐక్యం కావడం సులువవుతుంది" అని చెప్పారు.



ఇన్ని మతాలు ఎందుకు?

'ప్రపంచంలో ఎన్నో మతాలు ఉన్నాయి. అసలు ఇన్ని మతాలు ఎందుకు?' అనే విషయం గురించి మెహెర్‌బాబా మాట్లాడుతూ "వివిధ కాలాల్లో ఆవిర్భవించిన ఆ అవతార పురుషుడు మతాలను ప్రజలకు వరంగా ఇచ్చాడు. ప్రజల మనసులను భగవంతుడి వైపు మరల్చడానికే మతాలను సృష్టించాడు. మరి 'ఒక్కో మతం ఒక్కో రకంగా ఎందుకు ఉంది? అన్ని మతాలు ఒకేలా ఎందుకు లేవు?' అంటే... బుద్ధుడి కాలం వేరు, మహమ్మద్ ప్రవక్త కాలం వేరు. తమ అవతార కాలంలోని పరిస్థితులకు తగినట్టు, ప్రజల మానసిక పరిపక్వతకు తగినట్టు వారు తమ బోధనలు చేశారు. మార్గనిర్దేశకత్వం చేశారు. కాబట్టి అన్ని మతాలూ ఒక్కటే" అని ఆయన చెప్పారు. "నేను ప్రత్యేక మతాన్ని స్థాపించడానికి రాలేదు. నా మతం పేరు 'ప్రేమ మతం'. నేటి మానవాళికి అవసరమైనది ప్రేమ" అని వెల్లడించారు. "నిస్వార్థ సేవ, ప్రేమ... ఈ రెండూ దైవీ గుణాలు. ఆధ్యాత్మిక పథంలో అత్యాశ, కామం, పరోక్ష నిందలు అత్యంత ప్రమాదకరమైనవి. తోటి మానవులను ప్రేమించడం భగవంతుణ్ణి ప్రేమించడానికి తొలిమెట్టు. కష్టాల్లో ఉన్నవారికి సాయం అందించడం నిజమైన, స్వచ్ఛమైన ప్రేమకు చిహ్నం. ఇతరుల మేలు కోసం మీరు ప్రార్థిస్తే... మీకు కూడా తప్పకుండా మేలు జరుగుతుంది" అని తెలిపారు.

ప్రశ్నలన్నిటికీ జవాబు...

మెహెర్‌బాబా శిష్యులలో ఒకరైన జి.ఎస్.ఎన్.మూర్తి నిత్యం భగవద్గీత పారాయణం చేస్తూ ఉండేవారు. బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులలోని వేదాంతపరమైన కొన్ని అంశాలను బాబాను అడిగి తెలుసుకుందామని ఆయన అనుకున్నారు. తన సంశయాలన్నిటినీ ఒక కాగితం మీద టైప్ చేసి తీసుకువెళ్ళారు. బాబా ఎదుట కూర్చొని... ప్రశ్నించడానికి తగిన సమయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈలోగా బాబా తన ఎదురుగా ఉన్న ఒక చిన్న పుస్తకాల కట్టలోంచీ ఒక పుస్తకాన్ని తీసి... మూర్తికి ఇచ్చారు. ఆ పుస్తకంలోని అక్షరాలను తన చూపుడువేలుతో చూపిస్తూ... వాటిని చదవమన్నారు. ఆ అక్షరాలను మూర్తి చదువుతూ ఉంటే... తన ప్రశ్నలన్నిటికీ జవాబు దొరికినట్టయింది. ఆ పుస్తకాన్ని కొనుక్కుందామని మూర్తి నిశ్చయించుకున్నారు. అప్పుడు బాబా "ఏం ఆలోచిస్తున్నావ్?" అని అడిగారు. "ఏమీ లేదు" అన్నారు మూర్తి. బాబా ఆ పుస్తకాన్ని మూర్తికి బహుమతిగా ఇస్తూ "దీన్ని ఎప్పుడూ నీదగ్గరే ఉంచుకో. ఇకపై నీకు ఇదే భగవద్గీత. దీన్ని ప్రతిరోజూ పఠించు. నీ ప్రశ్నలకు జవాబులు దొరుకుతాయి" అని చెప్పారు.

నేడు అమరతిథి...


అవతార్ మెహెర్‌బాబా 1969 జనవరి 31న దేహ త్యాగం చేశారు. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా కేంద్రానికి సుమారు అయిదు కిలోమీటర్ల దూరంలోని మెహెరాబాద్‌లో చిన్న కొండపై ఆయన సమాధి ఉంది. నేడు (జనవరి 31న) ఆయన 56 అమరతిథిని భక్తులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 12.00 నుంచి 12.15 వరకూ... ఆయనను స్మరిస్తూ వారు మౌనం పాటిస్తారు.

• డాక్టర్ మల్లాది కృష్ణానంద్, 9959553218

ముక్తి మార్గదర్శి

ఫిబ్రవరి 6న శ్రీ మధ్వనవమి

భగవత్ తత్త్వాన్ని మానవులకు బోధించి, వారిని ముక్తి మార్గం వైపు నడిపించడానికి ఈ లోకంలో అవతరించిన మహనీయుడు శ్రీమధ్వాచార్యులు. హనుమంతుడు, భీముడి అవతారాల అనంతరం... వైష్ణవతత్త్వం తాలూకు సత్యమైన రూపాన్ని తిరిగి ప్రతిష్ఠించడం కోసం... వాయుదేవుడు శ్రీమధ్వాచార్యులుగా ఇలపై అవతరించాడు. మహిమాన్వితుడైన ఆయన జీవిత చరిత్రను తెలిపే అపూర్వమైన గ్రంథం 'శ్రీ సుమధ్వ విజయం'. త్రివిక్రమ పండితాచార్యుల కుమారుడు నారాయణ పండితాచార్యులు రచించిన ఈ గ్రంథం పదహారు సర్గలలో... 1,008 శ్లోకాలను కలిగి ఉంది. ఈ గ్రంథ పారాయణం వల్ల పుణ్యమే కాదు, సంసార బంధ విముక్తి కూడా లభిస్తుందని భక్తుల విశ్వాసం. గ్రంథకర్త అయిన నారాయణ పండితాచార్యులే 'శ్రీ సుమధ్వ విజయా'న్ని సంక్షిప్తంగా, భక్తుల పారాయణకు అనుకూలంగా ఉండేలా 'ప్రమేయ నవమాలిక' పేరుతో రచించారు. దానిని 'అణుమధ్వ విజయం' అని పిలుస్తారు. దీనికి అద్భుతమైన వ్యాఖ్యానం రాసినందుకే శ్రీ రాఘవేంద్రస్వామికి ద్వైత సామ్రాజ్యం అనే భాగ్యం దొరికిందని శ్రీ వాదీంద్రతీర్థులు తన 'గురుగుణస్తవనం'లో పేర్కొన్నారు.



విశేషం

సాక్షాత్తూ వాయుదేవుడే...

శ్రీమధ్వాచార్యులు భగవద్గీతకు భాష్యంతో తన గ్రంథ రచన ఆరంభించారు. ఆ గ్రంథాన్ని బదరీనాథుడికి సమర్పించారు. ఈ సందర్భంగా బదరిలో 48 రోజుల పాటు 'కాష్ఠమౌన వ్రతా'న్ని ఆచరించారు. అంటే ఆహార, పానీయాలు లేకుండా కట్టెలా కదలకుండా, మౌనంగా ధ్యానం చేస్తూ, ప్రవచనాలకోసం మాత్రమే నోరు విప్పడం. వ్యాసభగవానుడు ఈ కఠినమైన వ్రతానికి ప్రసన్నుడయ్యాడు. మధ్వాచార్యుల వద్దకు వచ్చి, తన బదరికా ఆశ్రమానికి రావాలని ఆదేశించాడు. ఆ ఆశ్రమం ఊర్ధ్వబదరిలో ఉంది. హిమాలయాల్లో అతి ఎత్తైన చోట, ఆకాశాన్ని తాకుతున్నట్టు ఉండే పొడవైన, దట్టమైన చెట్ల మధ్య, రక్తాన్ని గడ్డకట్టించే మంచుతో నిండిన ఆ ప్రదేశాన్ని చేరుకోవడం చాలా కష్టం. మరునాడు ఉదయం తన అనుష్ఠానాలను ముగించుకున్న మధ్వాచార్యులు... శిష్యులందరినీ అక్కడే ఉండమని చెప్పి, ఒంటరిగా ఊర్ధ్వ బదరికి బయలుదేరారు. గురువును విడిచి ఉండలేని సత్యతీర్థులు అనే శిష్యుడు ఆయనను అనుసరించాడు. మధ్వాచార్యులు... హనుమంతుడిలా తన శరీరాకృతిని పెంచుకొని, ఒక కొండపైనుంచి మరో కొండపైకి అడుగులు వేస్తూ ఎంతో వేగంగా నడుస్తున్నారు. సత్యతీర్థులు ఎంత వేగంగా పరుగెత్తినా ఆయనను అందుకోలేకపోతున్నాడు. చివరికి నిస్సహాయుడై... గురువును గట్టిగా పిలిచాడు. అప్పుడు మధ్వాచార్యులు వెనక్కి తిరిగి చూసి, తన చెయ్యి విదిలించారు. ఆ గాలికి సత్య తీర్థుడు పువ్వులా ఎగిరి, మళ్ళీ మఠంలోకి వచ్చి కూర్చున్నాడు. మధ్వాచార్యులు, వాయుదేవుడు ఒక్కరే అనడానికి ఇదొక ఉదాహరణ. ఇక... మధ్వాచార్యులు రచించిన 'బ్రహ్మసూత్ర భాష్యం'లో అర్థ గాంభీర్యం లాంటివి అనంతంగా ఉంటాయి. వాటిలో 'అనువ్యాఖ్యానము' అత్యంత విశిష్టమైనదే కాదు, ఆయన గ్రంథాలన్నిటికీ మణిహారం లాంటిదని పండితులు ప్రస్తుతించారు. మందర పర్వతాన్ని కవ్వంగా ఉపయోగించి, క్షీరసాగరాన్ని మధించి, దానినుంచి అమృతభాండాన్ని వెలికి తీసినట్టు... మహాభారతాన్ని మధ్వాచార్యులు మధించి 'మహాభారత తాత్పర్య నిర్ణయం' అనే తత్త్వ గ్రంథాన్ని రచించారు.

మధ్వ నవరాత్రులు...

మాఘ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకూ... తొమ్మిది రోజులను మధ్వ నవరాత్రులుగా పరిగణిస్తారు. జగద్గురువైన శ్రీ మధ్వాచార్యులు భగవంతుని ఆదేశం ప్రకారం పవిత్రమైన భరత భూమిలో జన్మించారు. జిజ్ఞాసువులకు అమూల్యమైన తత్త్వ భాండాగారాన్ని అందించారు. ఉడిపిలోని అనంతేశ్వర దేవాలయం నుంచి బదరికి ఆయన పయనించిన రోజు మధ్వ నవమి. ఆ రోజున ఆయన తన శిష్యులకు ఉపదేశం చేస్తూ ఉండగా... ఆకాశం పుష్ప వర్షం కురిసింది. అప్పుడే మధ్వాచార్యులు అదృశ్యం అయ్యారు. ఊర్ధ్వబదరిలో వేదవ్యాసుని దగ్గర జ్ఞానసాధన చేస్తూ... ఇప్పటికీ ఆయన అక్కడే ఉన్నారనేది భక్తుల నమ్మకం. శ్రీమధ్వ నవమి రోజున మధ్వాచార్యులు రచించిన గ్రంథాలను భక్తులు రథాలలో ఉంచి, అత్యంత వైభవంగా ఊరేగిస్తారు.

• మధ్వ ప్రచార పరిషత్, 9440258841

వివేకవాణి

దేవుడి ఉనికికి రుజువేదీ?

భారతీయత తాత్త్వికతను విశ్వవ్యాప్తం చేయడానికి పరిశ్రమించిన మహనీయుడు స్వామి వివేకానంద. కోల్‌కతాలోని ఒక సంపన్న కుటుంబంలో జన్మించిన ఆయనకు తల్లితండ్రులు పెట్టిన పేరు నరేంద్రనాథ్. చిన్న వయసునుంచే ఆయన ఆటపాటల్లో, చదువులో చురుగ్గా ఉండేవారు. గణితం, చరిత్ర, ఫిలాసఫీలో పట్టభద్రుడయ్యాక, న్యాయ విద్యను అభ్యసించారు. కళాశాలలో చదువుతున్నప్పుడే... శ్రీ రామకృష్ణ పరమహంసను కలుసుకున్నారు. అప్పటికి వివేకానందుడి వయసు పద్ధెనిమిదేళ్ళు. నాటినుంచి శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక మార్గదర్శకత్వంలో తనను తాను తీర్చిదిద్దుకున్నారు.

వివేకానందుడు ఎల్లప్పుడూ తార్కికంగా ఆలోచించేవారు. తనకు ప్రశ్నగా అనిపించిన ప్రతిదానికీ సరైన సమాధానాన్ని కోరుకొనేవారు. ఒక రోజు ఆయన శ్రీరామకృష్ణుల దగ్గరకు వచ్చి "మీరు ఎప్పుడూ దేవుడు గురించి మాట్లాడుతూ ఉంటారు. కానీ దేవుడున్నాడని రుజువేమిటి? అలాంటి రుజువు ఏదైనా ఉంటే నాకు చూపించండి" అని అడిగారు.



శ్రీరామకృష్ణులు నవ్వుతూ "దేవుడు ఉన్నాడనడానికి నేనే రుజువు" అన్నారు. ఆ మాటకు తక్షణమే ఏ జవాబు ఇవ్వాలో వివేకానందుడికి తెలియలేదు. అక్కడినుంచి వెళ్ళిపోయారు. మూడు రోజుల తరువాత మళ్ళీ గురువు దగ్గరకు వచ్చి "దేవుడు ఉన్నాడనడానికి మీరే రుజవని చెప్పారు. మరి నాకు దేవుణ్ణి చూపించగలరా?" అని ప్రశ్నించారు.

"దేవుణ్ణి చూసే ధైర్యం నీకుందా?" అని అడిగారు శ్రీరామకృష్ణులు. ఉంది అన్నారు వివేకానందుడు.

అప్పుడు శ్రీరామకృష్ణులు తన కాలిని చాపి... ఎదురుగా కూర్చున్న వివేకానందుడి ఛాతీ మీద పాదాన్ని పెట్టి నొక్కారు. తక్షణం వివేకానందుడిలో ఏదో కలవరం కలిగింది. సమాధి స్థితిలోకి వెళ్ళిపోయారు. అలా దాదాపు పన్నెండు గంటల సేపు ఆ స్థితిలోనే ఉండిపోయారు. దైవం ఉనికి గురించి సందేహంతో సహా వివేకానందుడి మనసులో ఉన్న ప్రశ్నలన్నిటికీ సమాధానం దొరికింది. పరిపూర్ణమైన జ్ఞానం, అవగాహనతో ఆ స్థితి నుంచి బయటకు వచ్చారు.

ఆ తరువాత... వివేకానందుడు తన జీవితంలో గురువును మరో ప్రశ్న ఎప్పుడూ అడగలేదు. శ్రీరామకృష్ణుల సందేశాన్ని ప్రపంచమంతటా చాటిచెప్పారు. "ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువతరం ఈ దేశానికి అవసరం" అని ప్రకటించిన వివేకానందుడి స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ ఆయన జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా మన దేశం జరుపుకొంటోంది.

చింతన

మాయలో మైమరచిపోవద్దు



మనం బాగా చదువుకుంటే పెద్దయ్యాక బాగా డబ్బు సంపాదించవచ్చని ఎంతో మంది పెద్దలు మనకు చిన్నతనం నుంచి బాగా నూరిపోస్తారు. ఆ ధోరణితోనే మనం పెరిగి పెద్దవుతాం. అదే మనకు మహామంత్రంలా మారిపోతుంది. 'ఇది చేయాలి, అది చేయాలి, ఏదో చేయాలి' అని పరితపిస్తూ ఉంటాం. కానీ మనం తప్పనిసరిగా నెరవేర్చుకోవాల్సిన కల ఏమిటి? మనం గమనించినట్టయితే... వాస్తవానికి మన అందరి కలా ఒక్కటే. జీవితం సుఖ సంతోషాలతో సాగిపోవాలన్నదే మనందరికీ ఉన్న అతి సరళమైన వాంఛ. కానీ ఈ చిన్న విషయాన్ని అందరూ ఎంతో సులువుగా మరచిపోతున్నారు.

శాంతి కొరవడితే...

అన్నిటికన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే - మనం లోలోపల సంతృప్తిగా ఉన్నట్టయితే, ఏ విషయంలోనూ గొడవపడం. అంటే, మనిషికి మౌలిక అవసరాలు తీరడం ముఖ్యం. అవే తీరని స్థితిలో ఉంటే మనిషికి తాను పేదవాణ్ణనే భావన కలుగుతుంది. ఆఫ్రికాలో నేనొక విషయం గమనించాను. అక్కడ కొంతమంది చిన్న పిల్లలు... వాళ్ళ కాళ్ళకు చెప్పులు ఉండవు. చిరిగిన దుస్తులతో, చింపిరి జుత్తుతో కనిపిస్తారు. కానీ ఒక సైకిల్ చక్రం తీసుకొని, దానితో హాయిగా నవ్వుతూ ఆడుకుంటున్నప్పుడు... వాళ్ళ ముఖాలలో కనిపించే చిరునవ్వు చూస్తుంటే ఎంతో ముచ్చటేస్తుంది. మనిషి మౌలిక అవసరాలు తీరితే ఆనందంగా ఉండగలడు. అదే కడుపులో ఆకలి వేధిస్తూ ఉంటే చిరునవ్వు కనిపించదు. కేవలం కన్నీళ్ళు మాత్రమే కనిపిస్తాయి. మనం చూస్తున్నవన్నీ కేవలం మనం సృష్టించుకున్నవే. ఎవరైనా తమనితాము నిరుపేదలుగా భావించుకుంటూ ఉంటే... అందుకు కారణం కూడా మనిషేనని గుర్తించాలి. ఈ విషయాలను మనం అర్థం చేసుకోకపోతే ముందుకి సాగలేం. సమాజం అనే అమరిక విచ్ఛిన్నమవుతుంది. ఈనాడు జరుగుతున్నది అదే కదా! దాన్ని ఏకం చేసి పట్టి ఉంచగలిగేది కేవలం శాంతి మాత్రమే. మన జీవితాల్లో శాంతి కొరవడితే... ప్రతిదీ చిన్నాభిన్నం అవుతుంది. కుటుంబాలు, మనుషులు చిన్నాభిన్నం అవుతారు.

వాటి విలువ గుర్తించండి...

'తనని తాను తెలుసుకోవడం' అనేది ఎంతో ప్రధానం. ఎలా తెలుసుకున్నప్పుడు మాత్రమే మీలో దయాగుణం కూడా నిండి ఉందని గుర్తిస్తారు. మనల్ని మనం తెలుసుకోలేనప్పుడు... మన దగ్గర ఉన్న వాటి గురించి కూడా తెలుసుకోలేం. మీలో జ్ఞానం ఉంది, చీకటిని పారద్రోలగలిగే ప్రకాశం మీ హృదయంలో ఉంది. మీకు కావలసినవన్నీ మీలోనే ఉన్నాయి. కానీ ఒకవేళ మిమ్మల్ని మీరు తెలుసుకోలేకపోతే... మీ దగ్గర ఉన్నవాటిని కూడా మీరు తెలుసుకోలేరు. కాబట్టి అన్నిటికన్నా ముందు 'నిన్ను నువ్వు తెలుసుకో'! మీలో ఉన్న సద్గుణాలను గుర్తించి, మీ జీవితాల్లో ముందడుగు వేయండి. ఏది ఏమైనా ఈ ప్రాపంచిక మాయలో పడి మైమరచిపోవద్దు. మీలోంచి వస్తున్న శ్వాస వేరెవరిదో కాదు... అది మీదే. అందులో దాగి ఉన్న ఆనందం కూడా వేరెవరిదో కాదు, మీ ఆనందమే. వీటన్నిటి విలువను గుర్తించండి.

సంతృప్తికి మార్గం

"ఎవరైతే మనఃప్రసన్నతను పొందుతారో... తక్షణం వారి దుఃఖాలన్నీ నశిస్తాయి. ప్రసన్నచిత్తుడైన యోగి బుద్ధి ఇతర విషయాలన్నిటి నుంచి వైదొలగి, పరమాత్మ పట్ల మాత్రమే పూర్తిగా స్థిరపడుతుంది" అని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. మన కోరికలన్నీ తీరిన తరువాత... మనం సంతుష్టి చెంది, సుఖాన్ని పొందుతామనీ, దుఃఖాన్ని దూరం చేసుకుంటామనీ భావిస్తూ ఉంటాం. కానీ మొదట సంతుష్టి చెందాలనీ, ఆ తరువాత మిగిలినవన్నీ వాటంతట అవే అనుసరిస్తాయనీ శ్రీకృష్ణుడు బోధిస్తున్నాడు.


ఉదాహరణకు మనకు జ్వరం, శరీర అవయవాల్లో నొప్పులు తదితర లక్షణాలు ఉంటే... మనం ఆరోగ్యంగా లేమని నిర్ధారించుకుంటాం. ఈ లక్షణాల మూలాలకు చికిత్స చేయకుండా వాటిని అణచివెయ్యడం వల్ల ఆరోగ్యం కుదుటపడదు. పోషకాహారం, మంచి నిద్ర, వ్యాయామం లాంటివి మనకు మంచి ఆరోగ్యాన్ని అందిస్తాయి. అదే విధంగా అసంతృప్తికి కారణమైన భయం, క్రోధం, ద్వేషం లాంటివి మనలో సంతృప్తి లేకపోవడాన్ని సూచిస్తాయి. వాటిని కృత్రిమంగా అణచివేయడం వల్ల మనకు సంతృప్తి లభించదు. క్రోధాన్ని, ద్వేషాన్ని అణచివేసి, సమాజంలో ఆమోదయోగ్యమైన ప్రవర్తనను ప్రదర్శించడానికి అనేక శీఘ్ర పరిష్కారాలు ఉన్నాయి.

గీతాసారం



ప్రస్తుతకాలంలో కూడా అవి ఆచరణలో ఉన్నాయి. కానీ ఈ లక్షణాల్ని అణచివేస్తే... కొంతసేపటి తరువాత మరింత శక్తితో తిరిగి వస్తాయి. ఉదాహరణకు మన బాస్ మీద అణచిపెట్టుకున్న కోపం తరచుగా కింది ఉద్యోగులు లేదా కుటుంబ సభ్యుల మీద వ్యక్తమవుతుంది. ఈ ప్రపంచం తాలూకు ద్వంద్వ స్వభావం గురించి తెలుసుకోవడం, కర్మ ఫలం ఆశించకుండా కర్మను ఆచరించాలనే అవగాహన, త్రిగుణాలే మన కర్మలకు, ఆలోచనలకు భావాలకు అసలైన కర్తలనీ, మనం కేవలం సాక్షులం మాత్రమేననీ గుర్తించడం... ఇదీ సంతృప్తికి మార్గం.

మన నిజ స్వరూపమైన అంతరాత్మ ఎల్లప్పుడూ సంతుష్టిగా ఉంటుంది. తాడు, పాము ఉదాహరణలో... తాడులో పాముని చూసినట్టు మనలో వ్యక్తమయ్యే దానితో మనల్ని జత చేసుకొని, అసంతృప్తికి లోనవుతాం. ఈ దుఃఖం నుంచి విముక్తి పొందడానికి శ్రీకృష్ణుడు మనల్ని 'ఆత్మవాన్', 'ఆత్మారామన్'... అంటే ఆత్మతో తాదాత్మ్యం చెందాలని సూచిస్తున్నాడు. ఇది దుఃఖాల అణచివేత కాదు. వాటిని సాక్షిగా చూస్తూ ఉండే సామర్థ్యాన్ని సంపాదించుకోవడం.



కె. శివప్రసాద్
ఐఎఎస్

చింతన

కుండలినీ శక్తి నిజంగానే ఉందా?

జిడ్డు కృష్ణమూర్తి ఉపన్యాసాల్లో, సంభాషణలలో 'చైతన్యం' అతి ముఖ్యమైన అంశం. 'యోగః చిత్త వృత్తి నిరోధః' అని పతంజలి మహర్షి అష్టాంగ యోగాన్ని నిర్వచించాడు. చైతన్యంలో పుట్టి, నిరంతరం చలనంలో ఉండే వృత్తుల్ని నిరోధించడాన్ని, అంటే... వాటిని అరికట్టే లేదా నిర్మూలించే సాధనను 'యోగం' అంటారని అర్థం. అయితే 'చిత్తం అంటే ఏమిటి?' అనే ప్రశ్నకు పతంజలి యోగసూత్రాల్లో మనకు జవాబు దొరకదు. 'నేను ఎవరిని?', 'ఈ ప్రపంచం ఏమిటి?' అనే రెండు మౌలికమైన ప్రశ్నలు అర్థం కావాలంటే... చైతన్యం అంటే ఏమిటో అర్థం చేసుకోవాలి. కాబట్టి చిత్తం లేదా చైతన్యం ప్రాక్పశ్చిమ తత్త్వశాస్త్రాలలో అతి ముఖ్యమైన విషయం. మన అనుభవాలన్నిటికీ ఇదే రంగస్థలం. పాయసంలో రుచిని, గులాబీలో పరిమళాన్ని, వేణునాదంలో మాధుర్యాన్ని, ఉదయిస్తున్న సూర్యుడిలో రంగులను జ్ఞానేంద్రియాలు గ్రహిస్తున్నప్పటికీ... అవి అనుభవం అయ్యేది చైతన్యంలోనే. మన సంకల్పాలకు, ఆలోచనలకు, రాగద్వేషాలకు, సుఖదుఖాలకు, వినయం, మదం లాంటి గుణాలకు చైతన్యమే వేదిక. దీని పర్యాయ పదాలైన 'మనసు, బుద్ధి, చిత్తం, హృదయం' లాంటివి మన మాటల్లో తరచు దొర్లుతూ ఉంటాయి.

అది కేవలం ఒక మిష



ఆధ్యాత్మిక సాధన అంతా చైతన్యపరమైనదే. మనిషి చైతన్యంలో కుండలినీ అనే అనంతమైన శక్తి ఒకటి ఉంటుంది, దాన్ని సాధన ద్వారా మేల్కొల్పవచ్చునని మన సంప్రదాయం చెబుతోంది. "కుండలినీ శక్తి నిజంగానే ఉంటుందా?..." కృష్ణమూర్తితో జరిపిన సంభాషణల్లో పుపుల్ జయకర్ లాటి మేధావులు ఈ ప్రశ్న వేశారు. "అవును, చైతన్యంలో అనంతమైన, నిత్యనూతనమైన, అక్షయమైన శక్తి ఒకటి ఉంటుంది" అనేది కృష్ణమూర్తి జవాబు. "అయితే మనకు అనంతమైన ఈ చైతన్యంలో ఒక చిన్న భాగం మాత్రమే అందుబాటులో ఉంటుంది. 'నేను' అనే అహంభావం, అది సృష్టించిన 'నేను-నువ్వు' అనే విభజన (అంటే ద్వైతం), ఆ 'నేను' చుట్టూ పేరుకున్న కుహనా మనుగడ... ఇవన్నీ చైతన్యాన్ని ఆవరిస్తాయి. అందువల్ల మనకు మన చైతన్యం సంపూర్ణంగా అందుబాటులో ఉండదు. చైతన్యాన్ని శుభ్రపరిస్తే ఈ శక్తి మేలుకొనే అవకాశం ఉంటుంది. సంప్రదాయం చెప్పే సాధన అందుకు పనికిరాదు" అంటారు కృష్ణమూర్తి. అబద్ధాలు, అవినీతి, అసూయ లాంటి వాటితో నిండిన జీవితాన్ని గడుపుతూ కుండలినీ శక్తిని మేల్కొల్పాలనే ఉద్దేశం హాస్యాస్పదం, కేవలం ఆధ్యాత్మిక వ్యాపారానికి ఒక మిష. చైతన్యాన్ని సంపూర్ణంగా శుభ్రపరచడం ఒక్కటే ఈ శక్తిని మేలుకొలుపగలిగే మార్గం. అంటే దానిలో ఎలాటి ఆలోచనలకు, జ్ఞాపకాలకు... అంటే గతంతో ముడిపడిన అనుభవాలకు, సంకల్పాలకు, మంత్రాలకు, ఉపదేశాలకు, జపాలకు (ఇవన్నీ ఆలోచనల ప్రతిరూపాలే)... చివరకు 'కుండలినీ శక్తిని మేలుకొలపాలి' అనే ఆలోచనకు కూడా తావు లేకుండా చూడాలి.

నిరంతర ప్రక్రియ

చైతన్యాన్ని శుభ్రపరిచే ఈ ప్రక్రియను 'ధ్యానం' (మెడిటేషన్) అంటారు కృష్ణమూర్తి. ఈ ధ్యానం పక్షమో, మాసమో, ఆరునెలలో చేసే పునశ్చరణ కాదు. ఇది 24 గంటలూ నిర్విరామంగా, అత్యంతమైన అప్రమత్తతతో జరిగే మానసిక ప్రక్రియ. చైతన్యాన్ని సంపూర్ణంగా శుభ్రపరచడం వరకే మన ప్రయత్నం పరిమితమై ఉంటుంది. కుండలినీ శక్తి తాలూకు జాగృతి మన చేతిలో ఉండదు. ఇంటిని శుభ్రం చేసి కిటికీలు, తలుపులు తెరిస్తే గాలి లోపలికి వచ్చే అవకాశం ఉంటుంది. గాలిని మనం నిర్బంధించలేం. కుండలినీ శక్తి కూడా అంతే.

• గుంటూరు వనమాలి , www.gunturu.de

పుణెలోనే పూర్తి చేస్తారా?

రాత్రి 7 గంటల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



సిరీస్ లక్ష్యంగా భారత్
సమం కోసం ఇంగ్లండ్
నేడు నాలుగో టీ20

పుణె: వరుస విజయాల జోరులో టీమిండియా మూడో టీ20లోనే సిరీస్‌ను ముగిస్తుందని అంతా భావించారు. కానీ ఇంగ్లండ్ ఆల్‌రౌండ్‌షోతో చెలరేగి ఆతిథ్య జట్టుకు బ్రేక్ వేసింది. పటిష్ట బ్యాటింగ్ లైనప్ కలిగిన భారత్‌ను పర్యాటక బౌలర్లు కట్టడి చేయగలిగారు. ఇప్పుడు ఇరు జట్ల మధ్య శుక్రవారం నాలుగో టీ20 పుణెలో జరుగనుంది. భారత్ ఈ మ్యాచ్‌లో నెగ్గితే సిరీస్ వశమవుతుంది. అటు మరోసారి ప్రత్యర్థిని దెబ్బతీసి సిరీస్ ఫలితాన్ని ఆఖరి మ్యాచ్‌కు తీసుకెళ్లాలని బట్లర్ సేన కృత నిశ్చయంతో ఉంది.

శాంసన్‌పై ఒత్తిడి

చివరి మూడు టీ20ల్లోనూ భారత బౌలర్లు ఇంగ్లండ్ భారీ స్కోర్లను అడ్డుకోగలుగుతున్నారు. కానీ రాజ్‌కోట్‌లో బ్యాటింగ్ వైఫల్యం దెబ్బతీసింది. స్పిన్నర్ వరుణ్ ఐదు వికెట్లతో అండగా నిలిచినా ప్రయోజనం లేకపోయింది. భారత్ ఛేదనలో మంచు ప్రభావం లేకపోవడంతో ఇంగ్లండ్ బౌలర్లు బంతిపై పట్టు సాధించారు. ఇక ఓపెనర్ శాంసన్‌ను షార్ట్ పిచ్ బంతుల బలహీనత వెంటాడుతోంది. ఈ సిరీస్‌కు ముందు భీకర ఫామ్‌లో ఉన్నా.. తాజా సిరీస్‌లో వరుసగా 26, 5, 3 రన్స్‌తో నిరాశపరిచాడు. అలాగే రింకూ సింగ్ అందుబాటులో ఉండడంతో ధ్రువ్ జురెల్‌పై వేటు పడవచ్చు. కెప్టెన్ సూర్యకుమార్ క్రీజులో కుదురుకోవాల్సి ఉంది. నేటి కీలక మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్‌ను ఆడించే అవకాశం లేకపోలేదు. ఒకవేళ నేటి మ్యాచ్‌లో మహ్మద్ షమితో పాటు అర్ష్‌దీప్‌ను కూడా ఆడించాలనుకుంటే సుందర్‌ను తప్పించవచ్చు.

అదే జోరు చూపాలని..

కీలక సమయంలో బ్యాటర్లు ఫామ్‌లోకి రావడంతో మూడో టీ20లో ఇంగ్లండ్ విజయం సాధించగలిగింది. ఓపెనర్ డకెట్, లివింగ్‌స్టోన్ తుఫాన్ ఇన్నింగ్స్ భారత్ ఆశలను వమ్ము చేసింది. బౌలింగ్‌లో స్పిన్నర్ ఆదిల్ రషీద్ భారత బ్యాటర్లకు ముకుతాడు వేయడంలో ముందుంటున్నాడు. ఏదేమైనా రెండు విభాగాల్లోనూ మరోసారి రాణించి పుణెలో గెలిచి తీరాలన్న కసితో ఇంగ్లండ్ ఉంది.

తుది జట్లు (అంచనా):
భారత్: శాంసన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, అక్షర్, సుందర్/అర్ష్‌దీప్, బిష్ణోయ్, షమి, వరుణ్ చక్రవర్తి.
ఇంగ్లండ్: సాల్ట్, డకెట్, బట్లర్ (కెప్టెన్), బ్రూక్, లివింగ్‌స్టోన్, స్మిత్, ఒవర్టన్, కార్స్, ఆర్చర్, ఉడ్, రషీద్.
పిచ్: ఎంసీఏ స్టేడియం సహజంగా స్పిన్నర్లకు అనుకూలిస్తుంటుంది. అయితే ఆరంభంలో పేసర్లు కూడా ప్రభావం చూపవచ్చు. తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 166గా ఉంది. టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ తీసుకునే అవకాశం ఉంది.

కోహ్లీ.. కోలాహలం

● పోటెత్తిన ఫ్యాన్స్, గేట్లవద్ద తోపులాట
● రైల్వేస్‌తో ఢిల్లీ రంజీ మ్యాచ్


విరాట్ కాళ్లు మొక్కుతున్న అభిమాని

న్యూఢిల్లీ: ఊహించినట్టే ఢిల్లీ రంజీ మ్యాచ్‌ను కోహ్లీ మేనియా కమ్మేసింది. విరాట్ కోసం ఫ్యాన్స్ భారీగా స్టేడియానికి తరలి రావడంతో.. దేశవాళీ క్రికెట్‌లో అరుదైన దృశ్యం గురువారం ఫిరోజ్ కోట్లా స్టేడియంలో కనిపించింది. మైదానం మొత్తం కింగ్ నామస్మరణతో మార్మోగిపోయింది. గ్రూప్-డిలో ఢిల్లీ-రైల్వేస్ మధ్య జరుగుతున్న మ్యాచ్‌ను వీక్షించేందుకు 15 వేల మందికిపైగానే తరలివచ్చారని అంచనా. ఆధార్ కార్డుతో ఉచిత ప్రవేశానికి అవకాశం కల్పించిన ఈ మ్యాచ్‌కు ఉదయం 7 గంటల నుంచే స్టేడియంవద్ద ఫ్యాన్స్ గుమికూడారు. ఆ తర్వాత జనాల రాక భారీగా పెరగడంతో 16వ గేటువద్ద కొద్దిసేపు తోపులాట జరిగింది. దీంతో మరో గేట్‌ను తెరచి ఫ్యాన్స్‌ను లోపలికి పంపారు. ఈ సందర్భంగా ముగ్గురికి గాయాలయ్యాయి. వీరికి ప్రాథమిక చికిత్స చేశారు. ప్రేక్షకుల్ని నియంత్రించేందుకు పారామిలిటరీ సిబ్బందిని సైతం పిలిపించారు. అయితే, ఆటకు తొలి రోజే కోహ్లీ బ్యాటింగ్ చూడాలనివచ్చిన అభిమానులకు నిరాశే ఎదురైంది. టాస్ గెలిచిన ఢిల్లీ కెప్టెన్ ఆయుష్ బదోని ఫీల్డింగ్ ఎంచుకోవడంతో ఫ్యాన్స్ గేలి చేశారు. కానీ, మ్యాచ్ మొదలైన తర్వాత టపటపా వికెట్లు పడుతుండడంతో అందరూ ఎంజాయ్ చేశారు. కోహ్లీ ఆటగాళ్లను ప్రోత్సహిస్తూ ఎంతో హుషారుగా కనిపించడంతో.. ప్రేక్షకులు కూడా తమ అభిమాన ప్లేయర్‌ను ప్రత్యక్షంగా వీక్షిస్తూ ఆనందించారు. కాగా, 11వ ఓవర్‌లో ఓ అభిమాని ఫీల్డ్‌లోకి చొరబడి కోహ్లీ వద్దకు వెళ్లడంతో కలకలం రేగింది. విరాట్ కాళ్లకు నమస్కరిస్తున్న అతడిని సెక్యూరిటీ పట్టుకొని బయటకు తీసుకెళ్లింది. ఈ మ్యాచ్‌కు టీవీ కామెంటేటర్‌గా ఉన్న భారత మాజీ ఆటగాడు డబ్ల్యూవీ రామన్.. విరాట్ అభిమానగణాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. రంజీ మ్యాచ్‌కు ఇన్ని వేల మంది రావడం తాను ఎప్పుడు చూశానో కూడా గుర్తులేదన్నాడు. కాగా, తొలి ఇన్నింగ్స్‌లో రైల్వేస్ 241 పరుగులకు ఆలౌటైంది. ఉపేంద్ర (95), కర్ణ్ శర్మ (50) హాఫ్ సెంచరీలు చేశారు. సైనీ, మాథుర్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన ఢిల్లీ మొదటి రోజు ఆట ఆఖరికి 41/1 స్కోరు చేసింది. రెండో రోజు విరాట్ బ్యాటింగ్‌కు దిగడం ఖాయం కావడంతో ఫ్యాన్స్ మరింతగా పోటెత్తుతారని అంచనా వేస్తున్నారు.





ఖవాజా 'డబుల్'

ఇన్‌గ్లిస్ మెరుపు శతకం

ఆస్ట్రేలియా 654/6 డిక్లేర్డ్



గాలె : ఓపెనర్ ఖవాజా (232) తొలి ద్విశతకంతో చెలరేగగా..అరంగేట్ర ఆటగాడు జోష్ ఇన్‌గ్లిస్ (94 బంతుల్లో 102) మెరుపు శతకంతో కదం తొక్కడంతో శ్రీలంకతో మొదటి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌ను ఆస్ట్రేలియా 654/6 భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్‌స్కోరు 330/2తో రెండోరోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆసీస్ తొలుత స్మిత్ (141) వికెట్‌ను కోల్పోయింది. ఖవాజాతో కలిసి మూడో వికెట్‌కు స్మిత్ 266 పరుగులు జోడించాడు. అనంతరం..ఇన్‌గ్లిస్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 146 పరుగులు జత చేశాడు. ఇక..మొదటి ఇన్నింగ్స్‌లో గురువారం ఆట నిలిపి వేసే సమయానికి శ్రీలంక 44/3 స్కోరుతో ఇక్కట్లలో పడింది.

స్టార్క్ 700 వికెట్లు..: గురువారం తన 35వ జన్మదినం రోజున ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ అరుదైన ఘనతను అందుకున్నాడు. ఓపెనర్ కరుణరత్నేను అవుట్ చేసిన అతడు అంతర్జాతీయ క్రికెట్‌లో 700వ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. టెస్టుల్లో స్టార్క్‌కిది 377వ వికెట్‌కాగా, వన్డేలలో 244, టీ20లలో 79 వికెట్లు పడగొట్టాడు. షేన్ వార్న్, మెక్‌గ్రాత్, బ్రెట్ లీ తర్వాత అత్యధిక అంతర్జాతీయ వికెట్లు సాధించిన నాలుగో ఆస్ట్రేలియా బౌలర్‌గా స్టార్క్ రికార్డులకెక్కాడు.

'అమ్మాయిల ఫుట్‌బాల్.. సంప్రదాయాలకు వ్యతిరేకం'

● మ్యాచ్‌ను నిలిపేసిన ఛాందసులు



ఢాకా: బంగ్లాదేశ్‌లో మత ఛాందస వాదులు పేట్రేగిపోతున్నారు. సంప్రదాయాల మాటున అఫ్ఘానిస్థాన్ తరహాలో మహిళల హక్కులను హరించే కుట్రలు చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా బంగ్లాదేశ్‌లో మహిళలు ఫుట్‌బాల్ ఆడుతున్నారు. అయితే, తాజాగా అంతర్ జిల్లా జట్ల మధ్య జరుగుతున్న అమ్మాయిల మ్యాచ్‌ను ఛాందసవాదులు అడ్డుకొన్నారు. మహిళలు ఫుట్‌బాల్ ఆడడం ఇస్లాంకు వ్యతిరేమని వాదిస్తున్నారు. వందల మంది గుంపులుగా మైదానంలోకి వచ్చి నిరసన తెలియజేశారని నిర్వాహకులు తెలిపారు. పరిస్థితులు హింసాత్మకంగా మారే ప్రమాదం ఉండడంతో మ్యాచ్‌ను నిలిపివేసినట్టు చెప్పారు. అయితే, ఈ చర్యలను బంగ్లాదేశ్ ఫుట్‌బాల్ సమాఖ్య (బీఎఫ్ఎఫ్) తీవ్రంగా ఖండించింది. ఇలా అమ్మాయిల మ్యాచ్‌ను అడ్డుకోవడం ఇది వరుసగా రెండోసారి.

క్వార్టర్స్‌లో శ్రీకాంత్

థాయ్‌లాండ్ మాస్టర్స్

బ్యాంకాక్ : కిడాంబి శ్రీకాంత్, యువ ఆటగాడు ఎస్.సుబ్రమణియన్ థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. గురువారం జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో శ్రీకాంత్ 21-19, 21-15తో గుణవన్ (హాంకాంగ్)ని ఓడించాడు. మరో ప్రీక్వార్టర్స్ పోరులో 21 ఏళ్ల సుబ్రమణియన్ 9-21, 21-10, 21-17తో చికో ఆరా ద్వి (ఇండోనేసియా)పై నెగ్గాడు. మహిళల సింగిల్స్‌లో రక్షిత రామ్‌రాజ్ 21-15, 21-12తో టాంగ్ (తైపీ)పై విజయంతో క్వార్టర్స్ చేరింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో రుత్వికా శివాని గద్దె/రోహన్ ద్వయం 19-21 15-21తో థాయ్‌లాండ్ జోడీ రచపోల్/లీ సువాన్ చేతిలో ఓటమి పాలైంది.

విజయ్‌కు 5 వికెట్లు

రాజస్థాన్ 258 ఆలౌట్ ● ఆంధ్ర 49/0

విజయనగరం: త్రిపురాన విజయ్ (5/62) ఐదు వికెట్లతో విజృంభించడంతో.. గురువారం ఆరంభమైన గ్రూప్-బి రంజీ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో రాజస్థాన్ 258 పరుగులకు కుప్పకూలింది. అభిజీత్ (94), మానవ్ (54) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆంధ్ర 49/0తో ఆడుతోంది. వంశీ కృష్ణ (18), కేఎస్ భరత్ (26) క్రీజులో ఉన్నారు.

బాక్సింగ్‌కు మనోజ్ గుడ్‌బై



న్యూఢిల్లీ: కామన్వెల్త్ మాజీ చాంపియన్, హరియాణా బాక్సర్ మనోజ్ కుమార్ (39) కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. పురుషుల 64 కిలోల విభాగంలో మనోజ్ కొన్నేళ్లపాటు ఆధిపత్యం ప్రదర్శించాడు. కోచ్‌గా కొత్త కెరీర్ ఆరంభిస్తానని అతడు తెలిపాడు. 2010 ఢిల్లీ కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం నెగ్గిన మనోజ్.. 2018 గోల్డ్ కోస్ట్ క్రీడల్లో చివరిసారిగా కాంస్యం సాధించాడు. 2012 లండన్, 2016 రియోలో జరిగిన ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాడు. గాయాలు, జాతీయ సమాఖ్యతో విభేదాల కారణంగా కెరీర్ ఆటంకాల నడుమ సాగింది.

మనమ్మాయిలే ఫేవరెట్లు

నేడు ఇంగ్లండ్‌తో సెమీఫైనల్
అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్
మ. 12 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..





కౌలాలంపూర్ : డిఫెండింగ్ చాంపియన్ భారత్ అప్రతిహత విజయాలతో అండర్-19 టీ20 ప్రపంచ కప్ టైటిల్ నిలబెట్టుకొనే దిశగా దూసుకుపోతోంది. ఈ క్రమంలో శుక్రవారం జరిగే సెమీఫైనల్లో ఇంగ్లండ్ జట్టును ఢీకొనేందుకు సిద్ధమైంది. నికీ ప్రసాద్ సారథ్యంలోని మన అమ్మాయిలు ఈసారి టోర్నీలో అద్భుతంగా రాణిస్తున్నారు. తెలుగు బౌలర్ షబ్నమ్, జోషిత ఆరంభంలోనే వికెట్లు తీస్తుండగా, స్పిన్నర్లు పరునిక, ఆయుషి, వైష్ణవి ప్రత్యర్థి బ్యాటర్లకు కళ్లెం వేస్తున్నారు. ఇక బ్యాటింగ్ విభాగంలో..మరో తెలుగమ్మాయి త్రిష (59 బంతుల్లో 110 నాటౌట్) స్కాట్లాండ్‌తో పోరులో సూపర్ సెంచరీతో చరిత్ర సృష్టించింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ బ్యాటర్లు భారత స్పిన్నర్లను ఏ విధంగా ఎదుర్కొంటారన్నది ఆసక్తికర అంశం. పైగా ఇంగ్లండ్ మిడిలార్డర్ బ్యాటింగ్‌లో నిలకడలేమి కనిపిస్తోంది. ఏదేమైనా.. ఈ సెమీఫైనల్లో మన అమ్మాయిలనే హాట్‌ఫేవరెట్లుగా క్రికెట్ పండితులు అంచనా వేస్తున్నారు. ఇక..ఉదయం 8 గంటలకు మొదలయ్యే తొలి సెమీస్‌లో ఆస్ట్రేలియా-సౌతాఫ్రికా అమీతుమీ తేల్చుకుంటాయి.

బిజినెస్

సీనియర్ సిటిజన్లకు ఐఆర్‌డీఏఐ ఊరట

ఏటా ప్రీమియం పెంపు 10% మించొద్దు

న్యూఢిల్లీ: సీనియర్ సిటిజన్లకు భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి ఐఆర్‌డీఏఐ పెద్ద ఊరట కల్పించింది. బీమా కంపెనీలు వీరికి ఇచ్చే ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియం పెంపు ఏటా 10 శాతం మించకూడదని స్పష్టం చేసింది. అంతకు మించితే ముందుగా తమ అనుమతి తీసుకోవాలని ఆదేశించింది. సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియాన్ని బీమా కంపెనీలు ఏటా ఎడాపెడా పెంచుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఐఆర్‌డీఏఐ ఈ చర్య తీసుకుంది. ఈ పాలసీల ప్రీమియం కూడా క్లెయిమ్‌ల ద్వారా చెల్లించే మొత్తం, ఖర్చుల ఆధారంగా ఉండాలని స్పష్టం చేసింది.

హైదరాబాద్‌లో మెక్‌డొనాల్డ్స్ జీసీసీ

అంతర్జాతీయ ఫాస్ట్ ఫుడ్ దిగ్గజం మెక్‌డొనాల్డ్స్.. హైదరాబాద్‌లో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేస్తోంది. ఈ ఏడాది మధ్య నాటికి ఈ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. ఈ సెంటర్ ఏర్పాటు కోసం ఆర్ఎంజెడ్ నెక్సిటీ టవర్ 20లో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో రెండు అంతస్తులు లీజుకి తీసుకుంది. అమెరికాకు వెలుపల మెక్ డొనాల్డ్స్‌కు ఇదే అతిపెద్ద కేంద్రం. ఇందులో 2,000 మంది ఉద్యోగులు పని చేసే అవకాశం ఉంటుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	83,020 ▲	76,100 ▲	1,06,000 ▲
విజయవాడ	84,000 ▲	79,000 ▲	93,800 ▲
విశాఖపట్నం	81,350 ▲	74,570 ▲	93,140 ▲
రాజమండ్రి	83,020 ▲	76,109 ▲	94,400 ▲
ప్రొద్దుటూరు	82,200 ▲	76,120 ▲	93,500 ▲
ముంబై	81,303 ▲	74,474 ▲	92,184 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



31వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	500
వరంగల్	482	గోదావరి	490
చిత్తూరు	553	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	114
వరంగల్	103	గుంటూరు	112
కరీంనగర్	103	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	100
కర్నూలు	103	నెల్లూరు	105
విశాఖపట్నం	106	అనంతపురం	105
గోదావరి	114		

బడ్జెట్‌పై మధ్య తరగతి గంపెడాశలు

బడ్జెట్ 2025-26



నిర్మలమ్మ మురిపిస్తారా? మాయ చేస్తారా?
పన్ను పోటు తగ్గితేనే జీడీపీకి ఊతం

కేంద్ర బడ్జెట్ దగ్గర పడుతోంది. శనివారమే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎనిమిదోసారి కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంట్‌లో సమర్పించబోతున్నారు. ధరల పోటుతో మధ్య తరగతి ఆదాయాలు కుంగిపోతున్నాయి. ధరలు పెరిగినంత వేగంగా ప్రజల ఆదాయాలు పెరగడం లేదు. ఐటీతో సహా అనేక రంగాల్లో ఉద్యోగ నియామకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టే సుమారు రూ.50 లక్షల కోట్ల బడ్జెట్ ఎలా ఉండే అవకాశం ఉంది? ఎలా ఉంటే బాగుంటుంది? పారిశ్రామిక, వాణిజ్య వర్గాలు, వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారుల కోరికల చిట్టాపై ఒక లుక్కేద్దాం.

దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన మధ్య తరగతి చితికిపోతోంది. ఖర్చులు ఎంత తగ్గించుకున్నా, వీరి ఆర్థిక భారం తీరడం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసిక జీడీపీ వృద్ధి రేటూ గణనీయంగా తగ్గింది. గత ఏడు త్రైమాసికాల్లో ఎన్నడూ లేని విధంగా 5.4 శాతానికి పడిపోయింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మొత్తానికి జీడీపీ వృద్ధి రేటు 6 శాతం మించడం కూడా కష్టంగానే కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్, ఆమె టీమ్ ప్రవేశపెట్టే రూ.50 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌పై అటు మధ్య తరగతితో పాటు పారిశ్రామిక, వాణిజ్య వర్గాలూ గంపెడాశలు పెట్టుకున్నాయి.

పన్ను మినహాయింపు పరిమితి పెంచాలి

గత ఏడాది ప్రవేశపెట్టిన కొత్త ఆదాయ పన్ను విధానం కింద రూ.3 లక్షల వార్షికాదాయం వరకు పన్ను పోటు లేదు. అదే పాత విధానాన్ని ఎంచుకుంటే ఈ పరిమితి రూ.2.5 లక్షలు మాత్రమే. దీన్ని 2014లో నిర్ణయించారు. గత ఐదేళ్లలో ధరల సెగ ఏటా సగటున 5.7 శాతం చొప్పున పెరిగింది. ఈ లెక్కన చూస్తే ఎప్పుడో 2014లో నిర్ణయించిన రూ.2.5 లక్షల విలువ ప్రస్తుతం రూ.1.4 లక్షలు మాత్రమే. 2014 నాటి జీవన ప్రమాణాలతో నివసించాలంటే వచ్చే బడ్జెట్‌లో అయినా కేంద్ర ఆర్థిక మంత్రి ఈ పరిమితిని రూ.5.7 లక్షలకు పెంచాలి. దీనికితోడు ప్రస్తుతం రూ.15 లక్షలకు మించిన వార్షికాదాయం ఉన్న వారు 30 శాతం పన్ను శ్లాబులోకి వస్తున్నారు. కనీసం వచ్చే బడ్జెట్‌లో అయినా ఆర్థిక మంత్రి ఈ శ్లాబులోకి వచ్చే వార్షిక ఆదాయ పరిమితిని రూ.20 లక్షలకు పెంచాలని కోరుతున్నారు.

పొదుపు ఖాతా వడ్డీ పరిమితి పెంచాలి

ప్రస్తుతం బ్యాంకు పొదుపు ఖాతాలోని మొత్తాలపై వచ్చే వార్షిక వడ్డీ రూ.10,000 మించితే పన్ను పోటు తప్పదు. ఈ మొత్తాన్ని 2013లో నిర్ణయించారు. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతం దీని విలువ రూ.5,000 మాత్రమే. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పరిమితిని కనీసం రూ.20,000కైనా పెంచాలని వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. దీనికి తోడు ప్రజల్లో దీర్ఘకాలిక పొదుపును ప్రోత్సహించేందుకు మూడేళ్లకు మించిన కాలపరిమితి ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఆదాయాన్ని దీర్ఘకాలిక మూలధన లాభాల కింద పరిగణించి 12.5 శాతం, అంత కంటే తక్కువ కాలపరిమితి ఉండే డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఆదాయంపై ఆయా వ్యక్తుల ఆదాయ శ్లాబుల ప్రకారం పన్ను పోటు ఉండాలని ట్యాక్స్ నిపుణులు సూచిస్తున్నారు.

నేడు ఆర్థిక సర్వే

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం 2024-25 ఆర్థిక సర్వేను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఏటా కేంద్ర బడ్జెట్‌కు ముందు రోజు ఆర్థిక మంత్రి ఈ సర్వేను పార్లమెంట్‌కు సమర్పించటం ఆనవాయితీ. ఈ సర్వేను కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలకు సూచికగా భావిస్తారు. డాలర్‌తో రూపాయి మారకం రేటు పడిపోవటం, జీడీపీ వృద్ధి రేటు, డిమాండ్ మందగించిన నేపథ్యంలో శుక్రవారం ప్రవేశపెట్టే ఆర్థిక సర్వేకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది.

80 సీ పరిమితి చాలదు

మధ్య తరగతి ప్రజలు, వేతన జీవులకు ప్రధాన ఊరట ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద లభించే మినహాయింపులే. ప్రస్తుతం పాత పన్ను విధానాన్ని ఎంచుకునే వారికి ఈ సెక్షన్ కింద వివిధ ఖర్చులు, పెట్టుబడులకు రూ.1.5 లక్షల వరకు మినహాయింపు ఇస్తున్నారు. ఈ మొత్తాన్ని కూడా ఎప్పుడో 2015లో సవరించారు. ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే ఇది కనీసం రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షలైనా ఉండాలని మధ్య తరగతి పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. దీనికి తోడు ఈ సెక్షన్ కింద మరో సబ్ సెక్షన్ చేర్చి పిల్లల చదువుల కోసం చెల్లించే ట్యూషన్ ఫీజుపై రూ.50,000 వరకు, గృహ రుణాలపై చెల్లించే అసలుకు రూ.50,000 వరకు ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలని మధ్య తరగతి ప్రజానీకం కోరుతోంది.

రియల్టీ పరిశ్రమ

ప్రస్తుతం దేశంలో రియల్టీ పరిశ్రమ పరిస్థితి కూడా ఏమంత బాగోలేదు. రూ.కోటి కంటే ఎక్కువ ధర ఉండే లగ్జరీ నివాసాలకు తప్ప, మిగతా వాటికి పెద్దగా గిరాకీ లేదు. నిజానికి గత ఏడాది దేశంలోని తొమ్మిది ప్రధాన నగరాల్లో రూ.కోటి కంటే తక్కువ ధర ఉండే నివాస గృహాల అమ్మకాలు 36 శాతం పడిపోయాయి. హైదరాబాద్‌లో అయితే ఈ పతనం మరింత ఎక్కువగా 69 శాతం వరకు ఉంది. ఆదాయాలు పడిపోవటం, ఇళ్ల ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అయినా కనీసం బడ్జెట్‌లో తమ గోడు పట్టించుకోవాలని స్థిరాస్తి రంగం కోరుతోంది. ఎప్పటి నుంచో కోరుతున్న మౌలిక పరిశ్రమ హోదా, ఇళ్ల కొనుగోలుదారులకు మరిన్ని పన్ను రాయితీలు, మినహాయింపులు ఇవ్వాలని ఆర్థిక మంత్రిని కోరుతోంది.

బీమా ప్రీమియం

ప్రస్తుతం పాత పన్ను చెల్లింపు విధానాన్ని ఎంచుకునే 60 ఏళ్ల లోపు వ్యక్తిగత ఐటీ చెల్లింపుదారులకు ఏటా ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియంపై రూ.25,000 వరకే ఆదాయ పన్ను మినహాయింపు లభిస్తోంది. సీనియర్ సిటిజన్లు తమ ఆదాయాల నుంచి చెల్లిస్తే రూ.50,000 వరకు, అదే వారి పిల్లలు చెల్లిస్తే రూ.75,000 వరకు పన్ను మినహాయింపు లభిస్తోంది. ప్రస్తుత ధరల సెగ ప్రకారం చూస్తే ఇది ఏ మాత్రం చాలదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యక్తిగత ఆరోగ్య బీమా ప్రీమియం మినహాయింపు పరిమితిని రూ.50,000కు, సీనియర్ సిటిజన్లు చెల్లించే ప్రీమియం మినహాయింపు పరిమితిని రూ.75,000కు, తల్లిదండ్రులైన సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా కోసం వారి పిల్లలు చెల్లించే ప్రీమియం పరిమితిని రూ.లక్షకు పెంచాలనే డిమాండ్ వినిపిస్తోంది.

పారిశ్రామిక రంగం కోరికల చిట్టా

ద్రవ్యలోటును కట్టడి చేస్తూనే జీడీపీ వృద్ధి రేటు పెంపు, ఉపాధి కల్పన, డిమాండ్ పెంపు చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. ముఖ్యంగా ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.5 లక్షలకు పెంచి కీలకమైన మధ్య తరగతి చేతిలో మిగులు ఆదాయం పెంచాలని కోరింది. లేకపోతే వినియోగ ఆధారితమైన మన ఆర్థిక వ్యవస్థ జీడీపీ వృద్ధి రేటు గాడినపడటం కష్టమని స్పష్టం చేసింది. సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 7 త్రైమాసికాల కనిష్ఠ స్థాయికి పడిపోవటానికి వినియోగ డిమాండ్ నీరసించటమే ప్రధాన కారణమనే విషయాన్ని పారిశ్రామిక వర్గాలు గుర్తు చేస్తున్నాయి. మరోవైపు చైనా నుంచి చౌకగా వచ్చిపడుతున్న దిగుమతులను కట్టడి చేయాలని కోరింది.

చాట్‌జీపీటీ, డీప్‌సీక్‌కు భారత్ పోటీ

» 10 నెలల్లో సొంత ఫౌండేషనల్ మోడల్ అభివృద్ధి
» కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో ప్రపంచ దిగ్గజాలకు సవాలు విసిరేందుకు భారత్ సన్నద్ధమవుతోంది. ఓపెన్ఏఐకి చెందిన చాట్‌జీపీటీ, చైనా తాజా సంచలనం డీప్‌సీక్ ఆర్1, గూగుల్ జెమినీతో పాటు ఇతర జెనరేటివ్ ఏఐ అప్లికేషన్లకు పోటీగా భారత్ సొంత ఫౌండేషనల్ మోడల్‌ను అభివృద్ధి చేయనుంది. వచ్చే పది నెలల్లో ఇది సిద్ధం కానుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం ఉత్కర్ష్ ఒడిశా సదస్సులో వెల్లడించారు. కృత్రిమ మేధ సాంకేతికతలో స్వయం సమృద్ధి దిశగా భారత ప్రయాణంలో ఇది కీలక మైలురాయి కానుందన్నారు. సొంత లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం) అభివృద్ధికి ఇప్పటికే రంగం సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ సిద్ధంగా ఉందని.. భారత వినియోగదారుల వినూత్న అవసరాల తీర్చే వ్యవస్థను అభివృద్ధి చేయడంపై భారత్ దృష్టిసారించిందన్నారు. గత వారం విడుదలైన ఓపెన్‌సోర్స్ మోడల్ డీప్‌సీక్ ఆర్1.. ప్రపంచవ్యాప్త సాంకేతిక నిపుణుల దృష్టిని తనవైపుకు తిప్పుకుంది. అంతే కాదు, ఏఐ రంగంలో ఓపెన్ఏఐ సహా అమెరికన్ సిలికాన్ కంపెనీల ఆధిపత్యానికి సవాలు విసిరింది. ఈ నేపథ్యంలో భారత్ కూడా ఈ దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది.

18,693 జీపీయూల సమీకరణ: చాట్‌జీపీటీ, డీప్‌సీక్ వంటి ఏఐ మోడళ్ల అభివృద్ధికి అత్యాధునిక జీపీయూ (గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్)లు వేల సంఖ్యలో అవసరం. ఎందుకంటే, ఏఐ మోడల్ ట్రైనింగ్‌కు ఈ ఆధునిక జీపీయూలే కీలకం. డీప్‌సీక్ ఏఐ మోడల్‌కు 2,500 జీపీయూలతో సమాచార ప్రాసెసింగ్‌లో శిక్షణ ఇవ్వగా.. చాట్‌జీపీటీ అభివృద్ధికి ఏకంగా 25,000 జీపీయూలను వినియోగించారు. భారత్ సొంత ఏఐ మోడల్‌ను అభివృద్ధి చేసుకునేందుకు ఇప్పటివరకు 18,693 జీపీయూలను సమకూర్చుకుంది. అందులో 10,000 జీపీయూలు ఇప్పటికే అందుబాటులో ఉండగా.. త్వరలో మరిన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఏఐ మోడల్ అభివృద్ధి కోసం కామన్ కంప్యూటింగ్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేసింది.

మూడో రోజూ కొనసాగిన జోరు

ముంబై: తీవ్ర ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో ఈక్విటీ మార్కెట్ మూడో రోజు కూడా ర్యాలీని కొనసాగించింది. ప్రధానంగా కార్పొరేట్ దిగ్గజాలు రిలయన్స్, ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ కౌంటర్లలో భారీ కొనుగోళ్లు గురువారం మార్కెట్‌కు ఉత్తేజం ఇచ్చాయి. ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 226.85 పాయింట్లు లాభపడి 76,759.81 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 429.92 పాయింట్ల మేరకు లాభపడి 76,962.88 వరకు వెళ్లింది. నిఫ్టీ 86.40 పాయింట్ల లాభంతో 23,249.50 వద్ద క్లోజైంది. కాగా ప్రస్తుతం అందరి దృష్టి శనివారం ప్రతిపాదించనున్న కేంద్ర బడ్జెట్ పైనే ఉంది. ఈ బడ్జెట్ మార్కెట్లో ప్రస్తుత బేరిష్ ట్రెండ్‌కు అడ్డుకట్ట వేయవచ్చన్నది విశ్లేషకుల అభిప్రాయంగా ఉంది.



కవల గిత్తలకు జన్మదిన వేడుక

రైతుల అభివృద్ధికి పాడి పశువులే ఆధారం. తమ కుటుంబ సభ్యుల వలే.. వాటి ఆలనా పాలనను రైతులు జాగ్రత్తగా చూసుకుంటారు. దీనికి నిదర్శనమే కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడిలో జరిగిన ఉదంతం. ఈ గ్రామానికి చెందిన మిరియాల వెంకట్రాజు కవలలుగా జన్మించిన ఆవుగిత్తలకు గురువారం మొదటి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాటికి రామ, లక్ష్మణులుగా నామకరణం చేసి, జన్మదిన వేడుక నిర్వహించారు. పది కిలోల కేక్‌ను కట్ చేసి గిత్తలకు తినిపించి, స్థానికులకు పంచి పెట్టారు. ఆతర్వాత వందలాది మందికి విందు భోజనం ఏర్పాటు చేశారు.

- ప్రత్తిపాడు, ఆంధ్రజ్యోతి

ఎయిర్‌పోర్టులు కళకళ

- 6 నెలలుగా పెరుగుతున్న ప్రయాణికులు
- విజయవాడ విమానాశ్రయానికి పూర్వవైభవం
- మిలియన్ మార్క్ దాటి.. రికార్డు దిశగా
- వైజాగ్, తిరుపతి, రాజమండ్రిలోనూ వృద్ధి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని విమానాశ్రయాల్లో ప్రయాణికుల రద్దీ ఊపందుకుంటోంది. ఆరు నెలలుగా వీరి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి పూర్వవైభవం వస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మిలియన్ మార్క్ (ఏడాదికి)ను అందుకున్న ఈ విమానాశ్రయం.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వైభవం కోల్పోయింది. మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మళ్లీ మిలియన్ మార్క్‌ను అందుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు చివరకు 9,99,555 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. జనవరిలో మొదటి రోజునే మిలియన్ మార్క్‌ను చేరుకుంది. మరో రెండు నెలలు ఉండటంతో ఇంకా 3 లక్షల మంది పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈసారి ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేసే పరిస్థితి కనిపిస్తోంది. జూలై నెల నుంచి విమాన ప్రయాణాలు పెరిగాయని విజయవాడ విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. విమానాల సంఖ్య పెరగటంతో వృద్ధి నమోదైనట్టు చెప్పారు. విజయవాడ నుంచి హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలకు నడిచే విమానాలలో ఆక్యుపెన్సీ పెరిగిందన్నారు. ప్రయాణికుల వృద్ధిలో విజయవాడ విమా



నాశ్రయం దేశంలో 35వ ర్యాంకు సాధించింది. డిసెంబరులోనే 47% మేర ట్రాఫిక్ పెరిగింది. గత ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు చూస్తే ప్రయాణికుల వృద్ధిలో 23.9 శాతం పెరుగుదల ఉంది. ఇతర ఎయిర్‌పోర్టుల విషయానికి వస్తే.. జాతీయ స్థాయిలో ప్రయాణికుల రాకపోకలకు సంబంధించి విశాఖ విమానాశ్రయం 26, తిరుపతి 45, రాజమండ్రి 53 ర్యాంకులను సాధించాయి. విశాఖపట్నం నుంచి 2,75,694 మంది ప్రయాణికులు, తిరుపతి విమానాశ్రయం నుంచి 1,02,739 మంది, రాజమండ్రి నుంచి 51,332 మంది ప్రయాణికుల రాకపోకలతో వృద్ధి నమోదైంది.

కానిస్టేబుల్ పోస్టులకు 39 వేల మందికి అర్హత

- పూర్తయిన దేహదారుఢ్య పరీక్షలు.. త్వరలో తుది రాత పరీక్ష..
- కోర్టు తీర్పుమేరకు హోంగార్డులపై నిర్ణయం: పీఆర్‌బీ చైర్మన్ రవి ప్రకాశ్

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో భర్తీ చేయబోతున్న 6,100 పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు పోటీ పడుతోన్న అభ్యర్థుల్లో 39 వేల మంది దేహదారుఢ్య, శారీరక సామర్థ్య పరీక్షల్లో అర్హత సాధించారు. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన 95 వేల మందికి రాష్ట్ర వ్యాప్తంగా 2024 డిసెంబరు 30 నుంచి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఫిజికల్ ఎఫిషియన్సీ, ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు ప్రారంభించింది. అవి గురువారం ముగిశాయి. నెల పాటు జరిగిన ఈ పరీక్షలకు 69 వేల మంది మాత్రమే హాజరయ్యారు. 2023 ఫిబ్రవరిలో 4.90 లక్షల మంది ప్రాథమిక రాత పరీక్ష రాశారు. అర్హత మార్కులు వచ్చిన 95 వేల మందిని దేహదారుఢ్య పరీక్షలకు పిలవకుండా వైసీపీ ప్రభుత్వం జాప్యం చేసింది. హోంగార్డుల కోటా విషయంలో కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో పూర్తిగా వదిలేసింది. ప్రభుత్వం మారిన తర్వాత అభ్యర్థులు కూటమి పెద్దలకు విన్నవించడంతో ప్రక్రియ ప్రారంభమైంది. హోంగార్డు రిజర్వేషన్ల కోసం కోర్టుకు వెళ్లిన రెండున్నర వేల మంది న్యాయస్థానం అనుమతితో పీఈటీ, పీఎంటీ పరీక్షల్లో పాల్గొన్నారు. అర్హత సాధించిన 39 వేల మందికి మార్చి చివరి వారం లేదా ఏప్రిల్ మొదటి వారంలో తుది రాత పరీక్షలు నిర్వహిస్తామని పీఆర్‌బీ చైర్మన్ ఎం.రవి ప్రకాశ్ తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూకు పరీక్ష నిర్వహణ బాధ్యత అప్పగించామని, హోంగార్డుల రిజర్వేషన్‌పై కోర్టు తుది తీర్పునకు అనుగుణంగా వ్యవహరిస్తామని చెప్పారు. కేసు వ్యవహారానికి సంబంధించి పీఆర్‌బీని కోర్టు అడిగిన వివరాలు త్వరలో అందజేయబోతున్నట్లు తెలిపారు.

బనకచర్లకు నిధులు అందించండి

- అనుసంధానంతో ఏపీలో కరువు మాయం: బాలశౌరి

న్యూఢిల్లీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్రం పూర్తిగా ఆర్థిక సహాయం అందించాలని జనసేన పార్లమెంటరీ పార్టీ నేత వల్లభనేని బాలశౌరి గురువారం అఖిలపక్ష సమావేశంలో అభ్యర్థించారు. రూ. 80,112 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లక్ష్యంగా పెట్టుకున్నారని ఆయన చెప్పారు. గోదావరి, కృష్ణా జలాల అనుసంధానం జరిగితే ఆంధ్రప్రదేశ్‌లో కరువు అనేది ఉండదని, ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్రం గ్రాంట్‌ల రూపేణా నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. కాగా, రాష్ట్ర విభజన జరిగి 11 సంవత్సరాలు దాటినా.. విభజనకు సంబంధించిన అనేక అంశాలు అపరిష్కృతంగా ఉన్నాయని, వీటిపై కేంద్రం దృష్టి సారించాలని కోరారు. కౌలు రైతులకు రుణాలు అందించేందుకు ప్రత్యేక చట్టం చేయాలన్నారు. మాదకద్రవ్యాల నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని, లేకపోతే అనేక మంది పిల్లలు తప్పుదారి పడతారని బాలశౌరీ ఆందోళన వ్యక్తం చేశారు.

శీతాకాల సభల్లో సెగలే!

నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

- అఖిలపక్ష భేటీలో రణగొణ ధ్వనులు
- కుంభమేళాలో తొక్కిసలాట, వక్ఫ్ బిల్లులో దూకుడుపై విపక్షం ఫైర్
- వైసీపీ పక్కన మాకు సీట్లా?.. టీడీపీ ఆందోళన
- విభజన హామీలపై దృష్టి పెట్టాలన్న దేశం,సేన
- బడ్జెట్ భేటీలోనే పార్లమెంటుకు వక్ఫ్ బిల్లు

న్యూఢిల్లీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈసారి మరింత సెగలు కక్కే సూచనలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. బడ్జెట్ సమావేశాల ముంగిట్లోనే జరిగిన మహా కుంభమేళా విషాదంలో 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. విపక్షాల నుంచి వచ్చిన ఒక్క సిఫారసునూ పరిగణించకుండానే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును సిద్ధం చేసేసింది. ఆ బిల్లును ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టనున్నారు. ఈ రెండు అంశాలపై శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో ప్రతిపక్షాలు ఆందోళన చేయనున్నాయి. గురువారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో దీని తాలూకా ప్రమాద ఘంటికలు మోగాయి. వక్ఫ్ బిల్లుపై ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తున్న తీరుపై ప్రతిపక్షాలు నిరసన తెలిపాయి. జమిలి ఎన్నికలపై విస్తృత చర్చ లేకుండా ముందుకు వెళ్లరాదని ఎన్డీఏ మిత్రపక్షం జేడీయూ స్పష్టం చేసింది. బిహార్‌కు భారీ పారిశ్రామిక ప్యాకేజీ ప్రకటించాలని మరో మిత్రపక్షం లోక్ జనశక్తి (పశ్వాన్) డిమాండ్ చేసింది. ఇక ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం కింద అపరిష్కృత అంశాలను పరిష్కరించాలని తెలుగుదేశం, జనసేన కోరాయి. తమకు ఎక్కడో చివరన సీట్లు కేటాయించారని, వైసీపీ ఎంపీల పక్కన సీట్లు కేటాయించడం సరైంది కాదని టీడీపీ ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చింది. కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. కాంగ్రెస్ సహా పలు పార్టీల తరఫున ప్రతినిధులు పాల్గొన్నారు. తెలుగుదేశం ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, బీద మస్తాన్‌రావు, జనసేన ఎంపీ బాలశౌరి పాల్గొన్నారు.

తొందర పడొద్దు : జేడీ (యూ)

జమిలి ఎన్నికల బిల్లును తొందరపాటుతో ప్రవేశపెట్టరాదని, విస్తృత సంప్రదింపులు జరపాలని జేడీయూ ఎంపీ సంజయ్ కుమార్ సూచించారు. ఈ బిల్లును ఇప్పటికే సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపిన విషయం తెలిసిందే. డీప్ సీక్ వల్ల ఏర్పడిన పరిస్థితిపై చర్చించాలని కోరారు.

భారీ సాయం ప్రకటించండి : లోక్‌జనశక్తి

బిహార్ తలసరి ఆదాయానికి, జాతీయ సగటుకు మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని, ప్రత్యేక ప్యాకేజీని కేటాయించి ఆదుకోవాలని చేయాలని లోక్ జనశక్తి (రాంవిలాస్)ఎంపీ అరుణ్ భారతి డిమాండ్ చేశారు. రిజర్వుడు కేటగిరీలో సరైన వ్యక్తులు దొరకడం లేదనే నెపంతో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయరాదని ఆయన కోరారు.

మాకు వెనుక సీట్లు ఇస్తారా? : టీడీపీ

ఎంపీల సీట్లను ఇష్టం వచ్చినట్లు కేటాయించారని కాంగ్రెస్ నేత గొగోయ్ అనగా, తెలుగుదేశం కూడా తమకు సీట్ల విషయంపై ఇబ్బందిగా ఉన్నదని తెలిపింది. మాగుంట శ్రీనివాసులు రెడ్డి వంటి సీనియర్ నేతలను కూడా వెనుక బెంచికి పరిమితం చేశారని దగ్గుమళ్ల చెప్పారు. మహాకుంభమేళాలో వీవీఐపీ సంస్కృతి, నిర్వహణ లోపాల వల్లే తొక్కిసలాట జరిగిందని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాంగోపాల్ యాదవ్ అన్నప్పుడు ప్రతిపక్ష సభ్యులంతా సమర్థించారు. మృతుల కుటుంబాలకు మరింత నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు.

వీవీఐపీల వల్లే కుంభమేళా విషాదం : ఎస్పీ

వక్ఫ్ బిల్లు జేపీసీలో నిబంధనలు పాటించలేదని, చైర్మన్ జగదంబికా పాల్ అప్రజాస్వామికంగా వ్యవహరించారని డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, టీఎంసీ ఎంపీ బందోపాధ్యాయ విమర్శించారు. స్థాయీ సంఘాల్లో అధికార పార్టీ సభ్యులకే ఎక్కువ స్థానం కల్పించారని వామపక్ష నేత బ్రిటాస్ ఆరోపించారు. ఒక ఎంపీకి ఒక స్టాండింగ్ కమిటీ కేటాయించాలన్న నిబంధనను తుంగలో తొక్కి ఒక్కో అధికార పార్టీ ఎంపీకి పలు స్టాండింగ్ కమిటీలు కేటాయిస్తున్నారని, 29 మంది బీజేపీ ఎంపీలు వివిధ కమిటీల్లో ఉన్నారని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. వీరు ప్రతిపక్ష సభ్యులను చర్చించకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. కాగా సభ సజావుగా జరిగేందుకు సహకరించాల్సిందిగా కోరినట్లు కేంద్ర మంత్రి కిరెన్ రిజిజూ తెలిపారు. శుక్రవారం రాష్ట్రపతి ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించిన తర్వాత ఆర్థిక సర్వే ప్రవేశపెడతారు. శనివారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెడతారు. సోమవారం నుంచి రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం తర్వాత చర్చ ప్రారంభమవుతుంది. ఈ చర్చ పూర్తయిన తర్వాత బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చ జరుగుతుంది.

బడ్జెట్ సమావేశాల్లో 16 బిల్లులు

బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక బిల్లు-2025, వక్ఫ్ సవరణ బిల్లు సహా 16 బిల్లులను కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. వీటిలో బ్యాంకుల నియంత్రణ చట్టం సవరణ బిల్లు, భారతీయ రైల్వేలు, భారతీయ రైల్వేల బోర్డు విలీన చట్టం, విపత్తు నిర్వహణ, చమురు క్షేత్రాల(నియంత్రణ, అభివృద్ధి), విమానయాన రంగం ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ, పరిశ్రమల్లో బాయిలర్ల సురక్షిత నిబంధనలు, నౌకాయాన తదితర బిల్లులు ఉన్నాయి.

నకిలీ వార్తలు, పెయిడ్ న్యూస్‌పై నేడు చర్చ!

పెయిడ్ న్యూస్, నకిలీ వార్తలు ఎక్కువగా వస్తుండటం, అనేక టీవీ న్యూస్ చానళ్ల సంచలనాలపై దృష్టి కేంద్రీకరించడం, సాంప్రదాయ వార్తా పత్రికలు రీడర్‌షిప్ తగ్గిపోవడం తదితర సమస్యలు ఎదుర్కొంటున్న అంశాలు శుక్రవారం పార్లమెంటరీ కమిటీలో చర్చకు రానున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే నేతృత్వంలోని కమ్యూనికేషన్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్టాండింగ్ కమిటీ అన్ని రకాల మీడియాలకు సంబంధించిన చట్టాల అమలును సమీక్షించనుంది. కొన్ని చానళ్లు టీఆర్పీ రేటింగ్ కోసం సస్పెన్స్ సృష్టించే ఆలోచనతో ముఖ్యమైన వార్తలను పణంగా పెట్టి క్రైమ్, సెలబ్రిటీ వార్తలకు ప్రాధాన్యం ఇవ్వడాన్ని సమావేశంలో చర్చించనున్నట్టు ఆ వర్గాలు తెలిపాయి. సంచలన కేసుల్లో మీడియా విచారణ, లీగల్ ప్రక్రియపై దాని ప్రభావం తదితరాలపైనా కమిటీ చర్చించనున్నట్టు పేర్కొన్నాయి. జర్నలిస్టులు, మీడియా సంస్థలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న న్యాయపోరాటాలు పరిశోధనాత్మక జర్నలిజాన్ని ఏ విధంగా నిరుత్సాహపరుస్తున్నాయి, ప్రాంతీయ, స్థానిక మీడియా ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, ప్రత్యేకించి ఎన్నికల సమయాల్లో నకిలీ వార్తలు సృష్టిస్తున్న గందరగోళం తదితరాలపై సమావేశంలో చర్చించనున్నారు. సమాచార ప్రసారమాధ్యమాలశాఖ కార్యదర్శి, ప్రసారభారతి సీఈవో, ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ తదితర కీలక వ్యక్తులు కమిటీ ఎదుట హాజరయ్యే అవకాశం ఉంది. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యకలాపాలు కూడా కమిటీలో చర్చకు వచ్చే అవకాశం ఉంది.



విభజన హామీలపై చర్చించాలని కోరాం: టీడీపీ ఎంపీలు

విభజన హామీలను నెరవేర్చాలని, బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని అఖిలపక్ష సమావేశంలో కేంద్రాన్ని కోరినట్లు టీడీపీ ఎంపీలు తెలిపారు. పోలవరం, అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు సహాయం అందించాలని విన్నవించామని టీడీపీ తరఫున రాజ్యసభలో ఫ్లోర్ లీడర్ బీద మస్తాన్‌రావు, లోక్‌సభలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. టీడీపీ ఎంపీలకు సీట్లను ఒకే చోట కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, సీనియర్ ఎంపీలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరామని దగ్గుమళ్ల తెలిపారు. టీడీపీ యువ ఎంపీలకు చర్చలలో పాల్గొనే అవకాశం కల్పించాలని కోరామన్నారు. తమ పార్టీకి కేటాయించిన సమయాన్ని పూర్తిగా తాము వినియోగించుకునేందుకు సహకరించాలని కోరినట్లు తెలిపారు. అంతర్జాతీయంగా ప్రభావం చూపే అంశాలపై పార్లమెంటులో చర్చ చేయాలని కోరినట్లు ఎంపీ దగ్గుమళ్ల తెలిపారు.



చిత్రజ్యోతి
SINCE 1965

కోలీవుడ్‌లో ఇష్టమైన హీరో సూర్య



అల్లు అరవింద్

కోలీవుడ్‌లో తనకు ఇష్టమైన హీరో సూర్య అని, ఆయన హీరోగా తమిళంలో స్ట్రెయిట్ చిత్రాన్ని నిర్మిస్తానని నిర్మాత అల్లు అరవింద్ వెల్లడించారు. గీతా ఆర్ట్స్ బ్యానరుపై చందూ మొండేటి దర్శకత్వంలో అక్కినేని నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో రూపొందగా ఫిబ్రవరి 7వ తేదీన విడుదలవుతుంది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా, గురువారం చెన్నైలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ, 'తమిళంలో నా అభిమాన హీరో సూర్య. ఆయనతో స్ట్రెయిట్ తమిళ చిత్రం తీస్తాను. సూర్యతో దర్శకుడు చందు మొండేటి ఇప్పటికే ప్రాథమిక చర్చలు జరిపారు. 'తండేల్' ముగియగానే ఆ ప్రాజెక్టుపై పూర్తిగా దృష్టిసారిస్తారు. అన్నీ అనుకున్నట్టు జరిగితే త్వరలోనే ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలుస్తుంది. మనసులో పాన్ ఇండియా మూవీని తీయాలని ప్లాన్ చేస్తే అది ఫెయిల్ అవుతుంది. చాలామంది నిర్మాతలు చేతులు కాల్చుకున్నారు. వారి పేర్లు చెప్పదలచుకోలేదు. పాన్ ఇండియా అనే ఆలోచన లేకుండా ఒక మంచి సినిమా తీయాలన్న బలమైనకాంక్షతో సినిమా తీస్తే అది దేశ వ్యాప్తంగా ప్రేక్షకాదరణ పొందుతుంది' అన్నారు.

చెన్నై, ఆంధ్రజ్యోతి

గోపీ సుందర్‌కు మాతృవియోగం



మలయాళ, తెలుగు చిత్రాల సంగీత దర్శకుడు గోపీ సుందర్ శోకంలో మునిగిపోయారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తల్లి, లివి సురేశ్ బాబు (65) గురువారం కేరళలో కన్నుమూశారు.

మేలో పట్టాలెక్కనున్న స్పిరిట్



ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. దర్శకుడిగా 'యానిమల్'తో సందీప్, హీరోగా 'కల్కి 2898 ఏ.డీ'తో ప్రభాస్ హిట్లు కొట్టడంతో ఈ కలయికపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా ఎప్పుడెప్పుడు పట్టాలెక్కుతుందా అని అందరూ ఎదురుచూస్తున్నారు. తాజాగా, ఈ సినిమా గురించి ఓ అప్‌డేట్ సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'స్పిరిట్' రెగ్యులర్ షూటింగ్ మేలో ప్రారంభమవుతుందని తెలిసింది. జూన్ నుంచి ప్రభాస్ షూటింగ్‌లో చేరనున్నారట. ఈ సినిమాలో పోలీస్ పాత్రలో ఆయన కనిపించనున్నారు. ప్రభాస్ ఈ పాత్రను పోషించడం ఇదే మొదటి సారి. ఇందులో విలన్‌గా సౌత్‌కొరియన్ యాక్టర్ డాన్ లీ నటించనున్నారని ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా షూటింగ్ మొదలుపెట్టాక.. పూర్తయ్యేవరకు మరో సినిమా షూట్‌లో పాల్గొనకూడదని ప్రభాస్‌ను కోరారట సందీప్.



హౌసింగ్ గోడౌన్‌లో 271 టన్నుల స్టీల్ మాయం

- దాని విలువ రూ.1.95 కోట్లు.. ఏఈ సస్పెన్షన్
- మరో ఏఈ సహా 10 మంది అధికారులకు నోటీసులు

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్‌కు చెందిన మెటీరియల్ గోడౌన్‌లో పేదల ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించే 271 టన్నుల స్టీల్ మాయమైంది. దీని విలువ రూ.1.95 కోట్లు ఉంటుందని అధికారులు తేల్చారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రాజబాబు బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో విజయవాడ సమీపంలోని గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఉన్న ఈ గోడౌన్ పర్యవేక్షణ బాధ్యతలు చూసే అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) బి.శ్రీనివాసరావును విధుల నుంచి సస్పెండ్ చేశారు. మరో ఏఈ ఎం.శ్రీధర్‌కుమార్‌కు షోకాజ్ నోటీసు జారీచేశారు. వీరిద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎన్టీఆర్ జిల్లా హౌసింగ్ ఉన్నతాధికారిని ఆదేశించారు. కాగా, సదరు గోడౌన్‌లో నిల్వ చేసిన విలువైన గృహ నిర్మాణ సామగ్రి పర్యవేక్షణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మరో 9 మంది ఉన్నతాధికారులకు కూడా నోటీసులు జారీ చేశారు. ఈ తాఖీదులు అందుకున్న వారిలో ఇద్దరు హౌసింగ్ పీడీలు, ఇద్దరు ఈఈలు, మరో ఐదుగురు డీఈఈలు ఉన్నారు. వీరిలో నలుగురు రిటైర్డ్ అధికారులకు బెనిఫిట్స్ చెల్లించకుండా నిలిపివేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలోనే స్టీల్ మాయమైనట్టు అధికారుల విచారణలో వెల్లడైంది. దీనిపై విజయవాడ హౌసింగ్ డీఈఈ సమర్పించిన నివేదిక ఆధారంగా విజయవాడ ఆర్డీవో విచారణ నిర్వహించారు. రూ.1.95 కోట్ల విలువైన 271 టన్నుల స్టీల్ మాయమైందని ధ్రువీకరిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టరుకు ఆర్డీవో రిపోర్టు ఇచ్చారు. ఈ నివేదికపై తీవ్రంగా స్పందించిన హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రాజబాబు తమ కార్యాలయ సిబ్బందితో మళ్లీ విచారణ చేయించారు. మూడోసారి కూడా గోడౌన్‌లో స్టీల్ మాయమైనట్లు ధ్రువీకరించడంతో బాధ్యులపై చర్యలకు ఆదేశించారు.

న్యూడెమోక్రసీ ఏపీ కార్యదర్శిగా దివాకర్

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీలో రెండు గ్రూపులు విలీనమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్ర కమిటీకి కార్యదర్శిగా గాదె దివాకర్ ఎన్నికైనట్టు ఆ పార్టీ అధికార ప్రతినిధులు పి. ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో న్యూడెమోక్రసీలో భారీ చీలిక ఏర్పడింది. పార్టీ నుంచి చంద్రన్న వర్గం వేరుపడింది. ఆ తర్వాత ఆ వర్గంలోనూ అనేక వైరుధ్యాలు పొడసూపాయి. దీంతో ఆయనతో వెళ్లిపోయిన నేతలు తిరిగి సొంత గూటికి చేరుకునేందుకు గతేడాది నుంచే విలీన చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే తెలంగాణలో చర్చలు ఫలించి రెండు గ్రూపులు ఒక్కటయ్యాయి. దీనికి సూర్యం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. ఏపీలోనూ ఈ నెల 28, 29 తేదీల్లో విలీన చర్చలు జరిగాయి. చంద్రన్న వర్గం నుంచి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సాగర్, విష్ణు, మేకల ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. రెండు వర్గాల విలీనం అనంతరం ఏపీకి కొత్తగా రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. గాదె దివాకర్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైనట్లు అధికార ప్రతినిధులు వెల్లడించారు. త్వరలో ప్రజాసంఘాల విలీన కార్యక్రమాలు ఉంటాయని, ఫిబ్రవరి 23న విజయవాడలో విలీన సభ నిర్వహిస్తామని వారు తెలిపారు.

మావోయిస్టు సోడి పొజ్జ అరెస్టు

- వివరాలు వెల్లడించిన అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్

ఎటపాక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు సోడి పొజ్జ అలియాస్ లలిత్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. పొజ్జది ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా గొండిగూడ గ్రామం. గొత్తికోయ తెగ. 2011లో ఆయన మిలీషియా సభ్యుడిగా చేరాడు. 2014 నుంచి 2019 వరకు మూడు సార్లు భద్రత సిబ్బందితో జరిగిన ఎదురుకాల్పుల్లో పాల్గొన్నారు. 2019లో ఆయనకు బుల్లెట్ గాయమైంది. బుధవారం పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది ఎటపాక మండలం విస్సాపురం పంచాయతీ చెరువుగుంపు గ్రామ శివారు అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. మందుపాతర పేల్చే ఉద్దేశంతో మావోయిస్టు పార్టీ నాయకులు, మిలీషియా సభ్యులు, సానుభూతిపరులతో కలిసి వెళ్తున్న పొజ్జ పోలీసులకు పట్టుబడ్డాడు. మిగతా వారు తప్పించుకున్నారు. పొజ్జను తనిఖీ చేయగా ఒక గ్రనేడ్, మావోయిస్టులకు చెందిన కరపత్రాలు, రూ.1,000 నగదు దొరికాయి. అరెస్టు అనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించినట్టు అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు.

ఆ 590 ఎకరాలు వెనక్కి ఇవ్వండి

కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన

- 2009లో తిరుపతి జిల్లా మన్నవరం వద్ద ఎన్టీపీసీ-బెల్‌కు 620 ఎకరాల కేటాయింపు
- ఇందులో వినియోగించింది 30 ఎకరాలే
- మిగిలిన భూముల స్వాధీనానికి సీఎం ఆదేశాలు
- ఎన్టీపీసీ-బెల్ ప్రతినిధులతో అధికారుల చర్చలు

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే సంస్థలకు భూములు కేటాయించేందుకు వీలుగా, గతంలో పరిశ్రమలకు కేటాయించి నిరుపయోగంగా ఉన్న భూములను తిరిగి స్వాధీనం చేసుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లా మన్నవరం వద్ద కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్టీపీసీ-బెల్ పరిశ్రమకు కేటాయించిన 590 ఎకరాల విలువైన భూములను వెనక్కి తీసుకోవాలని నిర్ణయించింది. 2009లో రాష్ట్ర ప్రభుత్వం పవర్ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీ (ఎన్టీపీసీ-బెల్)కు 620 ఎకరాలను కేటాయించింది. అందులో 30 ఎకరాల పరిధిలోనే నిర్మాణాలు జరిగాయి. మిగిలిన 590 ఎకరాలు నిరుపయోగంగా ఉన్నాయని కలెక్టర్ నిర్ధారించి ప్రభుత్వానికి నివేదించారు. ఇక్కడ బెల్ విస్తరణ జరిగే అవకాశాలు లేవని తేలడంతో ఈ భూములను వెనక్కి తీసుకోవాలని సీఎం చంద్రబాబు పరిశ్రమల శాఖను ఆదేశించారు. గత నెల 9న విజయవాడ నుంచి పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త కిషోర్‌లు నోయిడాలోని ఎన్టీపీసీ-బెల్ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. నిరుపయోగంగా ఉన్న 590 ఎకరాలను తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని ఎన్టీపీసీ-బెల్ అధికారులను కోరారు. అయితే భూములు వెనక్కి ఇవ్వడమన్నది తమ పరిధిలో లేదని, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలో ఉందని సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు. దీంతో ఆ భూములు తిరిగి అప్పగించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర విద్యుత్ శాఖకు ప్రతిపాదనలు పంపుతోంది.



నిరుపయోగంగా ఉన్న పరిశ్రమకు కేటాయించిన భూములు

పరిశ్రమల స్థాపనకు వీలుగా..

తిరుపతి జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో మన్నవరం భూములను వెనక్కి తీసుకుని కొత్త పరిశ్రమలకు కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. తిరుపతి-వెంకటగిరి మార్గంలో శ్రీకాళహస్తి మండల పరిధిలో ఉన్న ఈ భూములు వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలోకి వస్తాయి. ఇక్కడ భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. కొత్త పరిశ్రమలకు భూములు కేటాయిస్తే జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుంది.

ఎకరా రూ.20 లక్షలు

ఏర్పేడు- వెంకటగిరి మధ్య 620 ఎకరాల భూమిని కేవలం ఎకరా వంద రూపాయలకే రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో బెల్‌కి కేటాయించింది. నిజానికి అప్పటికే అక్కడ ఎకరా విలువ లక్షల్లో ఉంది. పరిశ్రమ ఏర్పాటు వల్ల బాగా ప్రయోజనాలుంటాయని ఆశించి భూములిచ్చారు. ఇప్పుడా ప్రాంతంలో భూముల విలువ భారీగా పెరిగింది. బహిరంగ మార్కెట్‌లో ఎకరా 20 లక్షల దాకా ఉంది. రిజిస్ట్రేషన్ విలువే 8 నుంచి 12 లక్షలు ఉంది. ఈ లెక్కన ఆ భూమి రూ.120 కోట్లకు పైనే విలువ చేస్తుంది.

హామీ మరిచిన జగన్

ఈ పరిశ్రమను పూర్తి చేయిస్తామని పాదయాత్రలోనూ, 2014 ఎన్నికల ప్రచారంలోనూ వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా ప్రజలకు హామీ ఇచ్చారు. 2019లో అధికారంలోకి వచ్చినప్పటికీ మన్నవరం పరిశ్రమపై దృష్టి పెట్టలేదు. తిరుపతి ఎంపీ గురుమూర్తి ఒకటి రెండు సార్లు లోక్‌సభలలో ప్రస్తావించారు. మాజీ ఎంపీ చింతామోహన్ తరచూ అనేక ప్రాంతాల్లో ఈ పరిశ్రమను పూర్తి స్థాయిలో నెలకొల్పాలని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం స్పందించలేదు.



ఎన్టీపీసీ-బెల్ పరిశ్రమ ప్రతిపాదిత భూముల్లో నిర్మించిన ప్రవేశ ద్వారం

2010లో శంకుస్థాపన

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో దిగ్గజాలుగా పిలిచే ఎన్టీపీసీ (నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్), బెల్ (భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్) సంస్థలు రెండూ సంయుక్తంగా భారీ ప్రాజెక్టులు నెలకొల్పే ఉద్దేశంతో ఎన్టీపీసీ-బెల్ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా ఏర్పడ్డాయి. అప్పటి తిరుపతి ఎంపీ చింతామోహన్ కృషితో మన్నవరం గ్రామం వద్ద విద్యుత్ ఉపకరణాల తయారీ ఫ్యాక్టరీ నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వం 2008లో నిర్ణయించింది. మొత్తం రూ.6,500 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ పరిశ్రమ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేలమందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేసింది. ఈ ప్రాజెక్టు నిర్వహణలో భాగంగా వంద వరకూ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటవుతాయనుకున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 620 ఎకరాలు ఈ ప్రాజెక్టు కోసం కేటాయించింది. ఏపీఐఐసీ ద్వారా ఆ భూములను అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కూడా కల్పించింది. మన్నవరంలో 2010 సెప్టెంబరు 1న నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అప్పటి సీఎం రోశయ్య కూడా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమకు విద్యుత్ సరఫరా కోసం రూ.2.08 కోట్లు చెల్లించింది.

పదిహేనేళ్లుగా కదలని పరిశ్రమ

శంకుస్థాపన తర్వాత పరిశ్రమ నిర్మాణం మందకొడిగా మొదలైంది. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన రూ.6,500 కోట్లలో ఎన్టీపీసీ, బెల్ చెరో రూ.వంద కోట్లే విడుదల చేశాయి. ఆ నిధులతో పరిపాలనా భవనం, యాష్ ప్లాంట్, కొంత ప్రహరీ నిర్మించారు. పరిశ్రమ అసలు ఉద్దేశమైన విద్యుత్ పరికరాలు, ఉపకరణాల తయారీ ప్లాంట్లు మాత్రం ఏర్పాటు కాలేదు. గత పదిహేనేళ్లుగా పరిశ్రమ నిర్మాణం అదే దశలో ఆగిపోయింది.

లింగ నిర్ధారణ నివారణ కమిటీ పునర్నియామకం

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షల నివారణకు ప్రభుత్వం నియమించిన రాష్ట్రస్థాయి సలహాదారుల కమిటీలో కొత్త వారిని ప్రభుత్వం నియమించింది. ఆరోగ్యశాఖ కమిషనర్ పంపిన ప్రతిపాదన ప్రకారం సలహాదారుల కమిటీని పునర్నియమించారు. కమిటీలో ఆరోగ్యశాఖ కమిషనర్ చైర్మన్‌గా ఉంటారు. న్యాయ శాఖ నుంచి జాయింట్ సెక్రటరీ, ఆంధ్రా మెడికల్ కాలేజీ, కర్నూలు మెడికల్ కాలేజీ గైనిక్ ప్రొఫెసర్లతో పాటు స్వచ్ఛంద సంస్థలకు చెందిన మాధవీ గణపతి, జి.కవిత, సి.భానుజను మెంబర్లుగా నియమించారు. ఈ కమిటీకి ఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ మెంబర్ సెక్రటరీగా ఉంటారు. ఆరోగ్యశాఖ కమిషనర్ వెంటనే కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఈ మేరకు ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

గాంధీజీ జీవితం స్ఫూర్తిదాయకం

- గవర్నర్ అబ్దుల్ నజీర్



గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గవర్నర్ నజీర్

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ జీవితం, ఆశయాలు యావత్ మానవాళికి ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని అమర వీరుల దినోత్సవంగా జరుపుకుంటున్న నేపథ్యంలో గురువారం రాజ్‌భవన్‌లో వర్ధంతి కార్యక్రమం ఏర్పాటు చేశారు. గాంధీజీ చిత్రపటానికి గవర్నర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అహింస, సత్యాగ్రహం, శాసనోల్లంఘనతత్వాల ద్వారా స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించడంలో గాంధీజీ కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. గవర్నర్ కార్యదర్శి హరిజవహర్‌లాల్, జాయింట్ సెక్రటరీ సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

టైమ్స్ సంస్థకు 1.77 కోట్లు విడుదల

- ఇండియన్ ఎకనామిక్ కాన్‌క్లేవ్-2024 ప్రచారానికి..

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఎకనామిక్ కాన్‌క్లేవ్-2024కు సంబంధించి న్యూస్‌ను ప్రచారం చేయడం, ఎపిసోడ్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు ప్రచారం కల్పించడానికి టైమ్స్ న్యూస్ నెట్‌వర్క్‌కు ప్రభుత్వం రూ.1.77 కోట్లు విడుదల చేసింది. ఇండియన్ ఎకనామిక్ కాన్‌క్లేవ్-2024లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా పార్ట్‌నర్‌గా ఉంది. ఈ కార్యక్రమాన్ని ప్రచారం చేసినందుకు ఏపీ ప్రభుత్వం టైమ్స్ సంస్థకు ఈ నిధులు అందిస్తోంది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాలని సమాచార శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు.

కూటమి సర్కారు వచ్చాక 5.7% క్రైమ్ తగ్గింది



- సిఫారసు లేకుండా ఎఫ్ఐఆర్ కట్టే రోజు రావాలి
- కసబ్‌ను విచారించా.. కొల్లంను లాక్కొచ్చా..
- రైల్వే ఏడీజీ పోస్టింగ్‌లో పనిలేక బాధపడ్డా
- ఏపీలో నేరాల కట్టడికి ఏఐ
- గత ప్రభుత్వం పట్టించుకోని ఎఫ్ఎస్ఎల్‌కు జీవం
- గంజాయి, మత్తు సవాలుపై ఉక్కుపాదం మోపాం
- విలేకరులతో ద్వారకా తిరుమలరావు
- నేడు ఉద్యోగ విరమణ చేయనున్న పోలీస్ బాస్

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అన్యాయానికి గురైన సామాన్యులు పోలీసు స్టేషన్‌కు వెళితే రికమెండేషన్ లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేసే రోజు రావాలని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమల రావు అన్నారు. 35ఏళ్ల క్రితం తాను యూనిఫామ్ వేసుకున్న రోజుల్లో పరిస్థితికి.. ఇప్పటికి చాలా మార్పు వచ్చిందన్న ఆయన సామాన్యుడి కోసం పూర్తి నిష్పక్షపాతంగా పనిచేసే పోలీసు వ్యవస్థ సాకారం కావాల్సి ఉందన్నారు. ఐపీఎస్ అధికారిగా సమాజానికి చేసిన సేవ సంతృప్తి నిచ్చిందని.. కసబ్ లాంటి ఉగ్రవాదిని ఇంటరాగేట్ చేయడం.. కొల్లం గంగిరెడ్డి లాంటి ఎర్రచందనం స్మగ్లర్‌ను విదేశాల నుంచి తీసుకు రావడం లాంటివి వృత్తి జీవితంలో మరపు రానివని పేర్కొన్నారు. మరోవైపు రైల్వే ఏడీజీగా పనిలేక బాధపడిన రోజులూ ఉన్నాయని తిరుమల రావు నెమరువేసుకున్నారు. రాష్ట్రానికి చెందిన ద్వారకా తిరుమల రావు 1989లో ఐపీఎస్‌కు ఎంపికై సొంత రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేసి రాష్ట్ర పోలీస్ బాస్ హోదాలో శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో గురువారం విలేకర్లతో పలు అంశాలు ముచ్చటించారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో చెయ్యాల్సిన పని సక్రమంగా చేశానన్న సంతృప్తి ఉందని ద్వారకా అన్నారు. నేరాల తీరుతెన్నుల్లో మార్పులు ఎప్పటికప్పుడు పోలీసులకు సవాలుగా నిలుస్తాయని, ప్రస్తుతం మన రాష్ట్రంలో టెక్నాలజీ వినియోగం పెంచి నేరాలు కట్టడి చేస్తున్నామని చెప్పారు. విజయవాడ, ఏలూరు పోలీసులు ఏఐ వినియోగించి పలు కేసులు పరిష్కరించారన్నారు.

గతంతో పోలిస్తే పోలీసుల్లో జవాబుదారీతనం

రాష్ట్రమంతా పోలీసులు టెక్నాలజీ అందిపుచ్చుకొంటూ ఆయా ప్రాంతాల్లోని నేరాలను విశ్లేషించుకుని జవాబుదారీ తనంతో పని చేసే దిశగా అడుగులు వేస్తున్నారని వివరించారు. తాను డీజీపీ అయ్యే నాటికి గంజాయి, మత్తు, సైబర్ మోసాల్లాంటి సవాళ్లు ఉన్నాయన్న డీజీపీ.. వాటిలో గంజాయి, మత్తు కట్టడికి గట్టిగానే కృషి చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు పోలీసులకు సవాలుగా నిలిచాయని, మన రాష్ట్రంలోనూ సైబర్ నేరాలు మినహా ఇతరత్రా క్రైమ్ తగ్గుముఖం పట్టిందని వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల్లో మొత్తం మీద 5.7శాతం నేరాలు తగ్గినట్లు డీజీపీ వెల్లడించారు. నేరాల కట్టడి, కేసుల దర్యాప్తు, పోలీసు సంస్కరణల్లో భాగంగా మార్చి 31లోపు లక్ష సీసీ కెమెరాలు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటికి 28,500పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వం పట్టించుకోని ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)కు జీవం పోశామని, 453పాత కేసులు పరిష్కరించి రూ.7.25కోట్లు రికవరీ చేశామని వెల్లడించారు. హద్దు మీరిన సోషల్ సైకోలను ఏపీలో కట్టడి చేశామని, జిల్లాకొక సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. విజయనగరం జిల్లా కొత్తవలస సమీపంలో గ్రేహౌండ్స్, ఏలూరు జిల్లా ఆగిరిపల్లి వద్ద పోలీస్ అకాడమీ ఏర్పాటు కాబోతోందని డీజీపీ తెలిపారు. గతంతో పోలిస్తే ఇప్పుడు మన పోలీసుల్లో జవాబుదారీ తనం పెరిగిందని, ఏపీ పోలీసు ఎప్పటికీ మంచి స్థానంలోనే ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్హా, ఐజీలు పాలరాజు, అశోక్ కుమార్, రవి ప్రకాశ్, రవి కృష్ణ పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

'మండలి' కళ్లకు గంతలు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్డీవోకు తహశీల్దార్లు నివేదికలు పంపించారు. వైసీపీ పాలనలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు ఆక్రమించుకున్నా, సాక్షాత్తూ ప్రజలు నివసిస్తున్న పల్లెనే ఆన్‌లైన్ చేసినా రెవెన్యూ అధికారుల కళ్లకు కనిపించకపోవడం విడ్డూరం. వైసీపీ పాలనలో జరిగినన్ని భూ ఆక్రమణలు, దౌర్జన్యాలు గతంలో ఏ ప్రభుత్వంలోనూ జరగలేదనే ఆరోపణలు ఉన్నాయి. అయినా రెవెన్యూ అధికారులు ఇలా తప్పుడు నివేదికలు ఎందుకు పంపించారో?

ఇదీ ప్రశ్న

గత ఏడాది నవంబరు 2వ తేదీన శాసనమండలిలో టీడీపీ ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, రాంగోపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్ భూ అక్రమాలకు సంబంధించి ఒక ప్రశ్న అడిగారు. 2019 నుంచి 2024 వరకు భూ ఆక్రమణ కేసులు, భూ సంబంధిత అక్రమ లావాదేవీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అసైన్డ్‌భూముల ఆక్రమణల వివరాలు కోరారు.

ఇదీ నివేదిక

రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాలో సమాచారం పంపారు. జిల్లాలోని 30 మండలాల్లో ఒకరిద్దరు మినహా మిగిలిన తహశీల్దార్లు అందరూ తమ మండలాల్లో ఎటువంటి భూ ఆక్రమణలు జరగలేదని నివేదికలు పంపించారు. ఆక్రమణలు జరిగాయని పంపిన తహశీల్దారులు కూడా నామమాత్రంగా ఒకటో, రెండో సంఘటనలను నివేదికలో ప్రస్తావించారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన భూ దోపిడీపై సమాచారాన్ని సేకరించి బాధితులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్సీలు సమాచారాన్ని అడిగితే.. అధికారులు తప్పుడు నివేదిక ఇవ్వడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

అన్నమయ్య జిల్లాలో గత ఐదేళ్లలో జరిగిన అక్రమాల్లో మచ్చుకు కొన్ని

ఇవిగో అక్రమాలు

రామాపురం మండలం బండపల్లె గ్రామం పొత్తుకూరుపల్లె సర్వే నంబరు 75/2లో 6.02 ఎకరాల భూమి ఉంది. సర్వే నంబరు 129లో 15.75 ఎకరాలకు పైనే భూమి ఉంది. ఈ రెండు సర్వే నంబర్లలో కలిసి సుమారు నాలుగు ఎకరాలలో 75 ఇళ్లున్నాయి. ఈ సర్వే నంబర్లలో భూమిని వైసీపీ నేత సదిపిరాళ్ల రాంబాబురెడ్డి పేరు మీద 2022 జూన్ 28న అప్పటి తహశీల్దార్ ఖాజాబీ ఆన్‌లైన్ చేశారు. ఈ భూమి 1970 నుంచి తమ పెద్దల అనుభవంలో ఉంద ని, తమదే అనడానికి ఆధారాలు ఉన్నాయని స్థానికులు కొందరు వాపోయారు. తప్పుడు రికార్డులతో రాంబాబు రెడ్డి పట్టాదారు పాసుపుస్తకాలు, 1బీ అడంగల్ వంటి రికార్డులు పొందారని స్థానికులు ఆరోపించారు. వాస్తవానికి సర్వే నంబరు 75/2 విషయంలో ఇద్దరి మధ్య వివాదం నడుస్తోంది. అయితే అప్పటి రామాపురం తహశీల్దార్ ఖాజాబీకు ఈ విషయం తెలిసినా, సరైన పత్రాలు లేకపోయినా రాంబాబురెడ్డి పేరు మీద మొత్తం 6.02 ఎకరాలను ఆన్‌లైన్ చేసేశారు. అక్కడ పల్లె ఉందన్న సంగతీ పట్టించుకోలేదు. విషయం ఆలస్యంగా తెలుసుకున్న గ్రామస్థులు.. రాంబాబురెడ్డి పేరిట చేసిన భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించాలని తహశీల్దార్ ఖాజాబీని వేడుకున్నా పట్టించుకోలేదు. ఇక్కడి నుంచి ఆమె బదిలీపై వెళ్లిపోయారు. ఇదే గ్రామంలో సర్వే నంబరు 129లో ఉన్న 15.75 ఎకరాలకు పైగా భూమిలో సుమారు రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో 35కి పైగా ఇళ్లు ఉన్నాయి. అయినా 15 ఎకరాలను రాంబాబురెడ్డి పేరిట ఆన్‌లైన్ చేశారు. ఎన్నికల సమయంలో తహశీల్దార్ శ్రీనివాసులు ఈ పని చేశారు.



బండపల్లె గ్రామం పొత్తుకూరుపల్లె సర్వే నంబరు 75/2ను వైసీపీ నేత రాంబాబు రెడ్డి పేరు మీద ఆన్‌లైన్ చేసిన రికార్డు

కుంట ఆక్రమణ

రామాపురం మండలంలోని బండపల్లె గ్రామం పొత్తుకూరుపల్లెలో ఉన్న యరాకుంటను కూడా వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారు. రాయచోటి మండలం దిగువఅబ్బవరం గ్రామం సర్వే నంబరు 503లో సుమారు 12 ఎకరాలు, పొత్తుకూరుపల్లెలో సర్వే నంబరు 166లో 6 ఎకరాల వరకు విస్తరించి ఉంటుంది. ఇందులో సుమారు 8ఎకరాలను సదిపిరాళ్ల రెడ్డెమ్మ పేరు మీద అప్పటి తహశీల్దార్ మాధవ క్రిష్టారెడ్డి ఆన్‌లైన్ చేసేశారు. తర్వాత ఇక్కడికి తహశీల్దార్‌గా వచ్చిన మాధవ క్రిష్టారెడ్డి భార్య అనురాధ గ్రామస్థుల వినతి మేరకు ఆన్‌లైన్ నుంచి తొలగించారు. అయినా ఇప్పటికీ ఆ భూమి ఆక్రమణదారుల చేతుల్లోనే ఉంది. బి.కొత్తకోట మునిసిపాలిటీలో ఉన్న కానగల కుంట చెరువును ఆక్రమించి అప్పట్లో వైసీపీ నాయకులు రియల్ ఎస్టేట్ వెంచర్ వేశారు.

లేని సర్వే నంబర్‌లో ఆన్‌లైన్

వీరబల్లి మండలం పెద్దివీడు గ్రామం రెడ్డివారిపల్లెలో సర్వేనంబరు 446లో 44.80 ఎకరాల విస్తీర్ణంలో తిమ్మారెడ్డి కుంట ఉంది. తాటిగుంట్ల వీరకొండ్రెడ్డిగారి రెడ్డెయ్య పేరు మీద ఈ కుంటలో 2.91 ఎకరాలు అప్పటి తహశీల్దార్ మహేశ్వర్‌రెడ్డి ఆన్‌లైన్ చేశారు. సర్వే నంబరు 451/ఏ2గా నమోదు చేశారు. వాస్తవానికి ఇక్కడ ఈ సర్వే నంబరే లేదు. చాలా సంవత్సరాల కిందట 451/1 నంబరులో సుమారు ఒకటిన్నర ఎకరాను రైతులకు ప్రభుత్వం అసైన్‌మెంటు కింద ఇచ్చింది.

ఫిర్యాదుల వెల్లువ

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. గత ప్రభుత్వ హయాంలో దౌర్జన్యానికి గురైన వేలాది మంది బాధితులు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో 2022 నుంచి నేటి వరకు సుమారు 35వేల పైచిలుకు భూ సంబంధిత వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులే కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి రావడం గమనార్హం.

కోస్తాలో మేఘాలు

విశాఖపట్నం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో సముద్రం నుంచి తమిళనాడు, దానికి ఆనుకుని కోస్తాపైకి తూర్పుగాలులు వీచాయి. గురువారం కోస్తాలోని అనేక ప్రాంతాల్లో మేఘాలు ఆవరించడంతో పగటిపూట వాతావరణం చల్లగా మారింది. కర్నూలులో 34.9 డిగ్రీల గరిష్ఠ, ఆరోగ్యవరంలో 14 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా.. సముద్రం మీదుగా తూర్పుగాలులు వీస్తున్నా భారీ వర్షాలు కురిసే వాతావరణం లేదని వాతావరణ అధికారి తెలిపారు. శనివారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని తెలిపారు.

పంచాయతీ భవనాలకు 46 కోట్లు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్ఏ) కింద గ్రామ పంచాయతీల్లో భవనాల నిర్మాణాలకు, కంప్యూటర్ల కొనుగోలుకు సంబంధించి రాష్ట్ర వాటా కింద ప్రభుత్వం రూ.46.13 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. భవనాల నిర్మాణాలకు సంబంధించి స్థలాల ఎంపిక ప్రక్రియను ఇప్పటికే చేపట్టింది. ఆర్‌జీఎస్ఏ కింద కేంద్రం 3వేలకు పైబడిన జనాభా కలిగిన పంచాయతీల్లో అదనపు భవనాల నిర్మాణాలకు, కంప్యూటర్ల కొనుగోలుకు నిధులు సమకూరుస్తోంది.


లౌకిక వాదానికి బీజేపీ తూట్లు

- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డి.రాజా, కె.రామకృష్ణ తదితరులు

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని అధికార బీజేపీ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా దేశ లౌకిక వాదానికి తూట్లు పొడుస్తోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పాల్గొనేందుకు గురువారం విశాఖపట్నం వచ్చిన ఆయన మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గాంధీ అన్ని తరాలకు ఆదర్శనీయుడని, అన్ని మతాలవారిని ఏకతాటిపైకి తెచ్చిన ఘనత ఆయనదన్నారు. గాడ్సేకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాదులు పూలదండలు వేస్తున్నారంటే.. గాంధీజీ పట్ల, ప్రజాస్వామ్యం, లౌకికవాదం పట్ల వారికి ఏపాటి గౌరవం ఉందో అర్థమవుతుందని విమర్శించారు. గాంధీ స్ఫూర్తితో ప్రజల హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణకు సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. అనంతరం స్థానిక మంత్రీస్ హోటల్‌లో రెండు రోజులపాటు జరిగే పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాలను ప్రారంభించారు. దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితి, సీపీఐ కర్తవ్యం వంటి అంశాలపై ప్రతినిధులకు రాజా వివరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, పలు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.



'అక్షరం అండగా..'తో సమస్యల పరిష్కారం

- కొత్తచెరువు బీసీ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్
- జగనన్న కాలనీకి భూములిచ్చిన రైతులకు పరిహారం ఇచ్చే దిశగా చర్యలు

కొత్తచెరువు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'గా కార్యక్రమం ఫలితాలనిస్తోంది. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు బీసీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో స్థానికులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. బీసీ కాలనీ వేణుగోపాల్ నగర్‌లో రోడ్డుపైన మురుగునీరు పారుతున్న సమస్యను తీర్చడానికి గురువారం పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. పంచాయతీ ఈఓ శ్రీనివాసరెడ్డి దగ్గరుండి సిబ్బందితో పనులు చేయించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వ్యాపారులకు నోటీసులు ఇచ్చారు. అలాగే జగనన్న లే అవుట్ కోసం భూములు ఇచ్చినవారికి పరిహారం ఇచ్చే దిశగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. జగనన్న కాలనీ దారికోసం రైతు పీవీ నవీన్‌కుమార్ ఇచ్చిన 1.30 ఎకరాలను డిప్యూటీ తహసీల్దారు బాలాంజనేయులు, వీఆర్వో భార్గవసాయి, సర్వేయర్ శివప్రసాద్, వీఆర్ఏ శివ పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చి పరిహారం అందేలా చూస్తామని తెలిపారు.



బుధవారం: శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు బీసీ కాలనీ వేణుగోపాల్ నగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగునీరు



గురువారం: సమస్య పరిష్కారం కోసం వేసిన పైప్‌లైన్

తప్పు చేస్తే.. సదాశివాన్ని తీసేయండి

- పార్టీ అధిష్ఠానానికి టీడీపీ వ్యూహ కమిటీ సూచన
- నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ కార్యక్రమం వివాదంపై చర్చ

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ అధ్యక్షుడు సదాశివం తప్పు చేసి ఉంటే అతనిని ఆ పదవి నుంచి తొలగిస్తే మంచిదని తెలుగుదేశం పార్టీ వ్యూహ కమిటీ అధిష్ఠానానికి సూచించినట్లు సమాచారం. ఈ ఫెడరేషన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రవీంద్రనాథ్‌బాబును ఆహ్వానించడంపై మంత్రి కొల్లు రవీంద్ర బహిరంగంగా నిరసన వ్యక్తం చేశారు. కేసులతో తనను వేధించిన వ్యక్తిని పిలిచి వేదికపై కూర్చోబెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయం గురువారం జరిగిన ఆ పార్టీ వ్యూహ కమిటీ సమావేశంలో చర్చకు వచ్చింది. 'మంత్రి బహిరంగంగా తన బాధను వ్యక్తం చేయడం పెద్ద విషయం. ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలి. టీడీపీ వారిని వేధించినట్లు ఆరోపణలు ఉన్న వ్యక్తిని ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎవరు పిలిచారో తేల్చాలి. రవీంద్రబాబు తూర్పు గోదావరి జిల్లాలో పనిచేసినప్పుడు ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో ఏకపక్షంగా వ్యవహరించినట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. అటువంటి వ్యక్తిని కార్యక్రమానికి ఎలా పిలుస్తారు? ఇందులో నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ఛైర్మన్ సదాశివం పాత్ర ఉంటే, అతనిని ఆ పదవి నుంచి తొలగించడం మంచిది. ఒకసారి గట్టి చర్య తీసుకొంటే పార్టీలో మిగిలిన వారంతా అప్రమత్తంగా ఉంటారు. నూజివీడులో ఒక కార్యక్రమానికి వైసీపీ నేత జోగి రమేశ్‌ను పిలవడంపై అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అయినా ఇప్పుడు ఈ సంఘటన జరిగింది. ఇవి పదే పదే జరక్కుండా చూసుకోవాలంటే ఒక షాక్ తప్పనిసరి' అని ఈ సమావేశం అభిప్రాయపడింది. తమ అభిప్రాయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఏం జరిగిందో నివేదిక ఇవ్వాలని పార్టీ కార్యక్రమాల కమిటీని అధిష్ఠానం కోరినట్లు సమాచారం. రిటైర్డ్ పోలీస్ అధికారిని ఎవరూ పిలవలేదని, తానే వచ్చి వేదికపై కూర్చున్నాడని నిర్వాహకులు పార్టీ నాయకత్వానికి సంజాయిషీ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ సంజాయిషీని పార్టీ నాయకత్వం నమ్మలేదని సమాచారం.

44,776 కోట్ల పెట్టుబడులకు పచ్చజెండా

(మొదటి పేజీ తరువాయి)

వెలగపూడి సచివాలయంలో గురువారం 3వ ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే 15 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అల్లూరి జిల్లాలో నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ రూ. 14,378 కోట్లతో ఏర్పాటు చేసే ఇంధన ప్రాజెక్టులకు పచ్చ జెండా ఊపారు. అన్నమయ్య జిల్లాలో మేఘా ఇంజనీరింగ్ సంస్థ రూ. 10,300 కోట్ల పెట్టుబడులకు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఎకోరాన్ ఎనర్జీ ఇండియా పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. అలాగే కాకినాడ జిల్లాలో కోరమండల్ ఫెర్టిలైజర్ ప్లాంటు విస్తరణ, అనంతపురం జిల్లాలో టాటా పవర్ ప్రాజెక్టుకు, కడప జిల్లా కోడూరులో నెలకొల్పే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ఓకే చెప్పారు. ఇప్పటివరకు 3 ఎస్ఐపీబీ సమావేశాల్లో మొత్తంగా రూ. 3,10,925 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు.

ఒప్పందాలను నిరంతరం సమీక్షించాలి

పారిశ్రామికవేత్తలతో చేసుకున్న ఒప్పందాలను నిరంతరం సమీక్షిస్తూ ఉండాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. సంబంధిత శాఖల మంత్రులు ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులతో మాట్లాడుతూ వారి ఒప్పందాలన్నీ సాకారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పోటీ నెలకొంది కాబట్టి పారిశ్రామికవేత్తలు అటువైపు వెళ్లకుండా రాష్ట్రానికి రప్పించాలని, దీనికోసం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేసి చూపాలని చెప్పారు. రాష్ట్రస్థాయి అనుమతులు, క్షేత్రస్థాయిలో పనులపై కలెక్టర్లతో సమీక్ష జరపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు సూచించారు. పెట్టుబడులపై జాతీయ, అంతర్జాతీయ సంస్థల స్పందన సంతృప్తికరంగా ఉందన్నారు. దావోస్‌లో రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి చూపిన దుబాయ్‌కు చెందిన డీపీ వరల్డ్, డెన్మార్క్‌కు చెందిన ఏపీ ముల్లర్-మార్స్క్ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలుంటే పెట్టుబడులు పెట్టే సంస్థలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి అవకాశాన్ని పెట్టుబడులు వచ్చేలా ఉపయోగించుకోవాలని సూచించారు. పారిశ్రామిక రంగంలో 20 శాతం వృద్ధికి చర్యలు చేపట్టాలని పరిశ్రమల శాఖ వర్గాలను ఆదేశించారు.



స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న సీఎస్ విజయానంద్, మంత్రులు అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, అచ్చెన్నాయుడు, కందుల దుర్గేశ్, గొట్టిపాటి రవికుమార్, నారాయణ, అధికారులు

పెట్టుబడులను ట్రాక్ చేయాలి

- ముఖ్యమంత్రి చంద్రబాబు

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక, వాణిజ్య సంస్థలతో సహా జాతీయ స్థాయి దిగ్గజ సంస్థలు కూడా ఆసక్తి చూపుతున్నాయని ఎస్ఐపీబీ భేటీలో సీఎం చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో పుష్కలంగా లభ్యమయ్యే సహజ వనరులు, పారిశ్రామిక ప్రోత్సాహక విధానంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు వారు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. పెట్టుబడులను పెట్టేందుకు ఆసక్తి చూపే పారిశ్రామిక, వాణిజ్య సంస్థలను ట్రాక్ చేసి వారు రాష్ట్రంలో పరిశ్రమలు, వర్తక, వాణిజ్య కార్యకలాపాలు చేపట్టేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. ముఖ్యంగా రూ. పది కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టే ప్రతి సంస్థను తప్పనిసరిగా ట్రాక్ చేయాలని పరిశ్రమల శాఖ అధికారులకు చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడంలో పొరుగు రాష్ట్రాల నుంచి భారీ పోటీ ఉందనే విషయాన్ని గ్రహించాలన్నారు. గత రెండు ఎస్ఐపీబీలతో సహా.. ఇప్పటి మూడో ఎస్ఐపీబీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు.

ఎస్ఐపీబీలో ఆమోదం పొందిన సంస్థలు, పెట్టుబడులు

- అల్లూరి సీతారామరాజు జిల్లా గుజ్జిలిలో 1,500 మెగావాట్లు, చిత్తంవలసలో 800 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ రూ 14,378 కోట్లతో ఏర్పాటు చేయనుంది. వీటి ద్వారా 3,450 మందికి ఉపాధి లభిస్తుంది.
- అన్నమయ్య జిల్లా కొమ్మూరులో మేఘా ఇంజనీరింగ్ సంస్థ రూ. 10,300 కోట్లతో 3000 మందికి ఉపాధి కల్పించే పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రానికి ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది.
- అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 118.80 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు యాస్పరి రెన్యూవబుల్ ప్రైవేటు లిమిటెడ్ ఆసక్తి కనబరచింది. ఈ ప్రాజెక్టు రాకతో 150 మందికి ఉపాధి లభిస్తుంది
- అనంతపురం జిల్లాలో 178.20 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును అనంతపురం రెన్యూవబుల్ ప్రైవేటు లిమిటెడ్ రూ. 972.23 కోట్లతో చేపడుతుంది. ఇందులో 225 మందికి ఉద్యోగాలు దక్కుతాయి.
- శ్రీ సత్యసాయి జిల్లాలో కడప రెన్యూవబుల్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 1,163.11 కోట్లతో 300 మందికి ఉపాధి కల్పిస్తూ 231 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది.
- అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఎకోరాన్ ఎనర్జీ ఇండియా 201.30 మెగావాట్ల పవన విద్యుత్తు ప్రాజెక్టును రూ. 1,651 కోట్లతో నిర్మిస్తుంది. దీని ద్వారా 255 మందికి ఉద్యోగాలు వస్తాయి.
- అయానా రెన్యూవబుల్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ రూ. 4,435 కోట్లతో కర్నూలు జిల్లాలో 498.30 మెగావాట్ల పునరుద్పాదక విద్యుత్తు ప్రాజెక్టును నిర్మించడం ద్వారా 630 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.
- అంపిన్ ఎనర్జీ సంస్థ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రూ. 3,142 కోట్లతో 350 మెగావాట్ల సామర్థ్యంతో పవన, సౌర విద్యుత్తు కేంద్రాన్ని స్థాపిస్తుంది. ఇందులో 200 మందికి ఉద్యోగాలొస్తాయి.
- ఎస్ఏఈఎస్ సంస్థ రూ. 3,456 కోట్లతో 600 మెగావాట్ల చొప్పున విండ్, సోలార్ విద్యుత్తు సంస్థలను అనంతపురం, కడప, నంద్యాల జిల్లాల్లో ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రాజెక్టులతో 2,070 మందికి ఉద్యోగాలు దక్కుతాయి.
- అనంతపురంలో 400 మెగావాట్ల సామర్థ్యంతో రూ. 2,000 కోట్లతో టాటా పవర్ సంస్థ సౌర విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తుంది. ఇందులో 1,380 మందికి ఉపాధి లభిస్తుంది.
- ఎస్ఎస్ఎల్ సంస్థ అనంతపురంలో 50 మెగావాట్ల విండ్, సోలార్ హైబ్రీడ్ ప్లాంట్లను రూ. 567 కోట్లతో ఏర్పాటు చేస్తుంది. ఇందులో 170 మందికి ఉపాధి లభిస్తుంది.
- కాకినాడ జిల్లాలో కోరమండల్ ఇంటర్నేషనల్ రూ. 1,539 కోట్లతో ఫెర్టిలైజర్ ప్లాంటును విస్తరించనున్నది. ఈ ప్లాంటులో 750 మందికి ఉద్యోగాలు వస్తాయి.
- అపెప్, ఈఎంసీ కొప్పర్తి సంస్థలు కడప జిల్లా కోడూరులో రూ. 305 కోట్లతో 6,000 మందికి ఉపాధి కల్పించేలా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పుతాయి.

పేదల ఇళ్ల ప్రారంభోత్సవం వాయిదా

- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకి

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న నిర్వహించతలపెట్టిన పేదల ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం వాయిదా పడింది. ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత మళ్లీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు.

ఆలయ పాలక మండళ్లలో నాయీ, బ్రాహ్మణ ప్రతినిధులు

- ప్రతిపాదనలు పంపాలని నేతలకు టీడీపీ ఆదేశం

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఈసారి ఆలయాల పాలక మండళ్ల నియామకంలో బ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గాలకు చోటు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1100 ఆలయాలకు పాలక మండళ్ల నియామకానికి ప్రస్తుతం కసరత్తు జరుగుతోంది. పాలక మండళ్ల నియామకం కోసం ప్రతిపాదనలు పంపే సమయంలో ఈ వర్గాల వారి పేర్లు కూడా పంపాలని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులకు టీడీపీ నాయకత్వం ఆదేశించింది.

జగన్ జమానాలో లిడ్‌క్యాప్ స్థలాలు అన్యాక్రాంతం

- ఆ స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకుంటాం
- లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మినీ, మీడియం, మెగాపార్కుల కోసం లిడ్‌క్యాప్‌కు స్థలాలు కేటాయిస్తే.. జగన్ వాటిని తన స్వార్థానికి వాడుకున్నారని లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు విమర్శించారు. జగన్ అన్యాక్రాంతం చేసిన లిడ్‌క్యాప్ భూములు తిరిగి సంస్థకే దక్కేలా చూస్తామన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన చర్మశుద్ధి కేంద్రాలు, లెదర్ గూడ్స్ పరిశ్రమలు రాష్ట్రానికి రానున్నాయని తెలిపారు.

పగలు పూజలు.. రాత్రి దోపిడీలు

- ఇదీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నైజం: పంచుమర్తి అనురాధ

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యంత అవినీతిపరుడు జగన్ అయితే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అతడిని మించినవాడని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పెద్దిరెడ్డి పగలేమో పూజలు.. రాత్రంతా దోపిడీలు చేస్తుంటాడని.. అది అతని నైజమన్నారు. పెద్దిరెడ్డి పాపాలపై ప్రభుత్వం కచ్చితంగా చర్యలు తీసుకుంటుందన్నారు.

కూటమితోనే గౌడలకు న్యాయం: గురుమూర్తి

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం జీవో నంబరు 13 ద్వారా గీత కులస్థులకు మద్యం దుకాణాల్లో 10 శాతం కేటాయించిందని, కూటమి ప్రభుత్వంతోనే గౌడలకు న్యాయం జరుగుతుందన్న విషయం దీని ద్వారా రుజువైందని గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లోనే బీసీల అభివృద్ధికి రూ.37,970 కోట్లు కేటాయించిందన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ విప్లవాత్మకం: లంకా దినకర్

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన వాట్సాప్ గవర్నెన్స్ ప్రజల సమయం, వనరుల ఆదా అయ్యే వినూత్నమైన, విప్లవాత్మకమైన కార్యక్రమమని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

వాట్సాప్ పాలన

ప్రభుత్వంతో ప్రజలు నేరుగా అనుసంధానమై సమస్యలు పరిష్కరించుకునే సరికొత్త వేదిక వాట్సాప్ గవర్నెన్స్. పాదయాత్ర చేసినపుడు ప్రజా సమస్యల్లో ఎక్కువగా ధ్రువీకరణ పత్రాలపైనే విన్నాను. ప్రజలకు సులువుగా, వేగంగా సేవలు అందించడానికే వాట్సాప్ గవర్నెన్స్‌కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కుల ధ్రువీకరణ పత్రాల నుంచి విద్యార్హత సర్టిఫికెట్ల వరకూ వాట్సాప్ ద్వారా పొందవచ్చు. ప్రజల చేతిలో ప్రభుత్వం, ప్రజల చేతిలో పాలన, ప్రజా ప్రభుత్వం నినాదంతో వాట్సాప్ పాలనను అందుబాటులోకి తెస్తున్నాం

- మంత్రి నారా లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. ఈ విషయంలో న్యాయపరమైన సమస్యలు ఏమైనా ఎదురైతే, చట్టాలను కూడా దానికి అనుగుణంగా మారుస్తామన్నారు. ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిలా వాట్సాప్ గవర్నెన్స్ నిలుస్తుందని చెప్పారు. కుల ధ్రువీకరణ పత్రాల నుంచి విద్యార్హత సర్టిఫికెట్ల వరకు వాట్సాప్ ద్వారా సులువుగా పొందవచ్చన్నారు. మన మిత్ర ద్వారా పొందే సర్టిఫికెట్ల విశ్వసనీయతకు ఢోకాలేదన్నారు. ప్రతి సర్టిఫికేట్‌కు క్యూఆర్ కోడ్ ఉంటుందని చెప్పారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా కూడా చాటింగ్‌ను ప్రారంభించవచ్చన్నారు. ప్రజా సమస్యలను కూడా వాట్సాప్ నంబర్‌కు తెలపవచ్చన్నారు. ప్రజా సమస్యలపై సంబంధిత శాఖలు స్పందించి పరిష్కరిస్తాయని వెల్లడించారు.

సర్టిఫికెట్ల కోసం ఇబ్బంది పడకూడదనే..

ధ్రువపత్రాల కోసం ఎవరూ ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతోనే వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకువచ్చామని లోకేశ్ వెల్లడించారు.. ఒక్క బటన్ నొక్కి సినిమా చూస్తున్నామని, భోజనం తెప్పించుకుంటున్నామని, క్యాబ్ వస్తోందని, అలాంటప్పుడు ప్రభుత్వ సేవలు పౌరుల వద్దకు ఎందుకు తీసుకువెళ్లకూడదన్న ఆలోచనతోనే గతేడాది అక్టోబరులో మెటాతో ఒప్పందం చేసుకుని వాట్సాప్ పరిపాలనను ప్రారంభించామని లోకేశ్ వెల్లడించారు.

సేవలన్నీ ఒకే ప్లాట్‌ఫాం పైకి..

ప్రభుత్వ శాఖల సేవలన్నీ ఒకే 'ప్లాట్‌ఫాం' పైకి తీసుకువచ్చేందుకే వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకువచ్చామని మంత్రి లోకేశ్ తెలిపారు. ధ్రువీకరణ పత్రాలపై క్యూఆర్ ఉంటుందని, దాని వల్ల నకిలీలకు ఆస్కారం ఉండదని చెప్పారు. విద్యార్థులకు ఇచ్చే విద్యార్హత సర్టిఫికెట్లపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఏపీ గవర్నమెంట్ వెబ్‌సైట్‌కు ఆ లింక్ వెళ్తుందని.. దీంతో నకిలీ సర్టిఫికెట్లకు ఆస్కారం ఉండదని చెప్పారు. ఈ ధ్రువీకరణ పత్రాలను న్యాయస్థానాలూ ఆమోదిస్తాయన్నారు. వాట్సాప్‌లో ప్రభుత్వ సేవలు రియల్ టైమ్‌లో అందిస్తామన్నారు. 80 నుంచి 90 శాతం పౌర సేవలు వెనువెంటనే అమలు చేస్తామని చెప్పారు. బ్లాక్ చైన్ టెక్నాలజీ కూడా త్వరలోనే తీసుకొస్తామన్నారు. రెండో దశలో ఏఐ బాట్, వాయిస్ ద్వారా కూడా అమలుచేస్తామన్నారు. ప్రపంచంలోనే వాట్సాప్ గవర్నెన్స్ అమలు చేస్తున్న తొలి రాష్ట్రం మనదేనని చెప్పారు. ఉండవల్లి ప్రజా వేదికలో జరిగిన మన మిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆర్టీజీఎస్, ఐటీ శాఖల కార్యదర్శి కాటమనేని భాస్కర్, మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్, హెడ్ సంధ్య దేవనాథన్, వాట్సాప్ డైరెక్టర్, ఇండియా హెడ్ రవి గార్గ్, ఆర్టీజీఎస్ సీఈవో దినేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంధ్య దేవనాథన్ మాట్లాడుతూ.. ప్రజలు సులభంగా వినియోగించేలా వాట్సాప్ గవర్నెన్స్‌ను రూపొందించామన్నారు.

ఏపీ ప్రభుత్వంతో కలిసి మన మిత్రను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతామని చెప్పారు. రవి గార్గ్ మాట్లాడుతూ.. సింగిల్ ప్లాట్‌ఫాంపై అన్ని రకాల సేవలు అందించడం దేశంలో ఎక్కడా లేదు. హాయ్ అని టైప్ చేయడం ద్వారా ప్రజలు సులభంగా పౌర సేవలు పొందవచ్చని అన్నారు.



మన మిత్ర పేరుతో వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్, వేదికపై మెటా ఇండియా సంస్థ ప్రతినిధులు

ప్రజల డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి: ముఖ్యమంత్రి చంద్రబాబు

రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా 'మన మిత్ర.. ప్రజల చేతిలో ప్రభుత్వం' కార్యక్రమం అమలు చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజల డేటాను సురక్షితంగా.. భద్రంగా ఉంచడానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి నారా లోకేశ్, మెటా ఇండియా ఉపాధ్యక్షురాలు సంధ్య దేవనాథన్, డైరెక్టర్ రవిగార్గ్, మెటా ఇండియా స్ట్రాటజీ ప్రోగ్రామ్స్ దివ్య కెమనీ వధేరా, ఆర్టీజీఎస్, ఐటీశాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్‌లకు సూచించారు. రాష్ట్రంలో మన మిత్రను ప్రారంభించాక మెటా బృందంతో కలసి నారా లోకేశ్ వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. వాట్సాప్ సేవలు చాలా పగడ్బందీగా అందిస్తున్నామని మంత్రి లోకేశ్, మెటా ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రికి వివరించింది. పౌరుల డేటా బయటకు వెళ్లకుండా సాంకేతికపరంగా గట్టి చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ధ్రువీకరణ పత్రాల విషయంలోనూ సాంకేతికపరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కులధ్రువీకరణ పత్రాల జారీకి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖలన్నింటి సేవలను పౌరులకు ఒకే వేదికద్వారా అందేలా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ఈ బృందంతో పాటు.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీఎంఓ ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, కార్యదర్శులు రాజమౌళి, ప్రద్యుమ్న కూడా ఉన్నారు.

పట్టభద్రుల ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించాలి

- సాధారణ ఎన్నికల్లాగే ప్రతిష్ఠాత్మకంగా తీసుకోండి: నారా లోకేశ్

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పార్టీ నాయకులకు సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో గురువారం సంబంధిత జిల్లాల ఇన్‌చార్జి మంత్రులతో ఆయన సమావేశమయ్యారు. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి ఇన్‌చార్జి మంత్రులు పూర్తి బాధ్యత తీసుకోవాలని లోకేశ్ సూచించారు. సాధారణ ఎన్నికలను ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా అంతే సీరియస్‌గా తీసుకోవాలని లోకేశ్ కోరారు. ప్రతి ఓటరునూ పార్టీశ్రేణులు నేరుగా కలవాలని, సోషల్ మీడియాను పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని, పట్టణ ప్రాంతాల్లో ఉండే పట్టభద్రులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని లోకేశ్ సూచించారు. జగన్ రెడ్డి పాలనలో అప్పుల ఊబిగా మారిన రాష్ట్రాన్ని కేవలం ఏడు నెలల్లోనే సీఎం చంద్రబాబు ఏ విధంగా అభివృద్ధి బాట పట్టిస్తున్నారో ఓటర్లకు వివరించాలని సూచించారు. సమావేశంలో మంత్రులు కె.అచ్చెన్నాయుడు, గుమ్మడి సంధ్యారాణి, పి.నారాయణ, నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవి, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధికి 25 లక్షల విరాళం

తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధి కోసం జనచైతన్య శ్రేష్ఠ గ్రూప్స్ అధినేత మాదల చైతన్య రూ.25 లక్షల విరాళం అందించారు. గురువారం ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి చెక్కును అందజేశారు. కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకుంటున్న ఏకైక పార్టీ టీడీపీ అని, పార్టీ ఖర్చు చేసే ప్రతిపైసా కార్యకర్తల సంక్షేమానికి దోహదపడుతుందనే ఉద్దేశంతో ఈ మొత్తాన్ని ఇస్తున్నానని చైతన్య తెలిపారు.

రూ.3 కోట్ల భూమిని కబ్జా చేస్తామా?

- మంగళంపేటలో 2000లోనే 75 ఎకరాలు కొన్నాం
- ఎన్ని కేసులు పెట్టినా భయపడేదిలేదు: వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి

న్యూఢిల్లీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలోని మంగళంపేటలో 2000 సంవత్సరంలోనే 75 ఎకరాల భూమిని కొనుగోలు చేశామని, తామెవరి భూమినీ కబ్జా చేయలేదని వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి వివరణ ఇచ్చారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయని చెప్పారు. మంగళంపేటలోని భూమి తమ పరిధిలోనిది కాదని గతంలోనే అటవీ శాఖ గెజిట్ ఇచ్చిందని తెలిపారు. తమ ఊర్లో హాస్పిటల్ నిర్మాణానికి రూ.15 కోట్ల విలువైన భూమిని ఇచ్చామని, అలాంటిది కేవలం రూ.3 కోట్ల భూమిని కబ్జా చేశామని చెప్పడం సరికాదన్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, అన్నింటికీ సిద్ధపడే ఉన్నామని తెలిపారు. విజయ సాయిరెడ్డి త్వరలోనే మళ్లీ వైసీపీలోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పోలవరం ఎత్తు తగ్గిస్తారనే సమాచారం ఉందని, పార్లమెంట్లో చర్చకు లేవనెత్తుతామని తెలిపారు.


జగన్ మళ్లీ సీఎం అయితే.. మా దెబ్బ ఏంటో రుచిచూపిస్తాం: పెద్దిరెడ్డి

రాయచోటి టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): 'గెలుపోటములు రూపాయి బిళ్లకు ఉండే బొమ్మ బొరుసు లాంటివి. అధికారం అనేది అటూ ఇటూ మారుతుంది. మా పార్టీ వారిపై కేసులు పెట్టిన వారందరినీ గుర్తు పెట్టుకుంటాం. జగన్ మళ్లీ సీఎం అయితే మా దెబ్బ ఏంటో రుచి చూపిస్తాం. దాడులకు ప్రతిదాడులు జరుగుతాయ్...' అని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం రాయచోటిలో అన్నమయ్య జిల్లా వైసీపీ కార్యవర్గ సమావేశంలో పెద్దిరెడ్డి మాట్లాడుతూ నేతలు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. జగన్‌ను మరోసారి సీఎం చేసేందుకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు అధోగతిపాలు చేస్తున్నారని ఆరోపించారు. తెచ్చే అప్పులన్నింటినీ రాజధానిలో ఖర్చు పెడుతున్నారన్నారు.

నేటి నుంచి 'అరకు చలి ఉత్సవ్'

పాడేరు/అరకులోయ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పర్యాటకుల స్వర్గధామంగా ఉన్న ఆంధ్రా ఊటీ అరకులోయలో.. 'అరకు చలి ఉత్సవ్' శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు ప్రత్యేక వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందుకు అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వేదిక కానుంది. పద్మాపురం గార్డెన్స్‌లో పుష్ప ప్రదర్శన ఏర్పాటుచేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య ఏటా అరకు ఉత్సవ్ నిర్వహించేవారు. ఆ తర్వాత వైసీపీ సర్కారు ఒక్కసారే ఉత్సవాలు జరిపి సరిపెట్టింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం.. ఈ నెల 31, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో అరకు ఉత్సవ్‌ను నిర్వహించాలని ఆదేశిస్తూ, కోటి రూపాయలు మంజూరు చేసింది. దీంతో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేశ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి 'హెలికాప్టర్ రైడ్' ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

- కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ ఉత్సవాలు
- రూ.కోటి విడుదల చేసిన సర్కారు
- అలరించనున్న గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఫ్లవర్ షో, కార్నివాల్, సైక్లింగ్, ట్రెకింగ్, లేజర్ షో
- ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్ రైడ్, పారా గ్లైడింగ్



ఉత్సవ్ కార్యక్రమాలు



మొదటిరోజు: శుక్రవారం ఉదయం 7.30కు అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ మారథాన్ నిర్వహిస్తున్నారు. 11 గంటలకు పద్మాపురం బొటానికల్ గార్డెన్స్‌లో ఫ్లవర్ షో ప్రారంభిస్తారు. ట్రైబల్ మ్యూజియం ప్రాంగణంలో పెయింటింగ్ పోటీలు ఉంటాయి. మధ్యాహ్నం ప్రధాన వేదిక వద్ద 25 స్టాళ్లను ప్రారంభిస్తారు. సాయంత్రం 5నుంచి రాత్రి 9వరకు గిరిజన కళాకారుల నృత్య ప్రదర్శనలు ఉంటాయి.

రెండో రోజు: ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం 7.30 గంటలకు బొర్రా జంక్షన్ నుంచి ఉత్సవ్ ప్రధాన కేంద్రమైన అరకులోయ డిగ్రీ కళాశాల మైదానం వరకూ సైక్లింగ్ ఈవెంట్ ప్రారంభమవుతుంది. సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రధాన వేదికపై ఫ్యాషన్ షో, గిరిజన కళాకారులతో నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి.

మూడో రోజు: 2వ తేదీన ఉదయం 7.30 గంటలకు సుంకరమెట్ట కాఫీ తోటల నుంచి అరకు ట్రెక్ ప్రారంభమవుతుంది. అరకులో ముగ్గుల పోటీ, సాయంత్రం 5 నుంచి ప్రధాన వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఫోక్, వెస్టన్ డ్యాన్స్‌లు, లేజర్‌షో నిర్వహించనున్నారు. వీటితోపాటు మూడు రోజులూ అరకులోయ లోతేరు రోడ్డులో గల వజ్రాల కొండ ఎదురుగా ఉన్న ప్రాంతంలో హెలికాప్టర్ రైడ్, మాడగడ సన్‌రైజ్ హిల్స్ వద్ద టెండమ్ గ్లైడింగ్, పారా గ్లైడింగ్, పద్మాపురం గార్డెన్‌లో హాట్ ఎయిర్ బెలూన్ సందర్శకులకు అందుబాటులో ఉంటాయి.



అరకు చలి ఉత్సవ్ పోస్టర్, అరకులోయ డిగ్రీ కళాశాల మైదానంలో ఉత్సవ్ ప్రధాన వేదిక వద్ద ఏర్పాట్లు

విశాఖ ఉక్కుకు ఆర్థిక ప్యాకేజీ..

ఏపీకి మోదీ బహుమతి!

- చంద్రబాబు, లోకేశ్ 'ఉక్కు సంకల్పం'
- హామీ నిలుపుకోవాలని పవన్ పట్టుదల
- సమష్టి కృషి వల్లే రూ.11,440 కోట్ల నిధులు
- 3 నెలలు ఆగితే క్రమం తప్పకుండా జీతాలు
- ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి భరోసా

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీని ప్రధాని నరేంద్ర మోదీ ఏపీకి బహుమతిగా ప్రకటించారని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి అన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం మంజూరు చేసిన రూ.11,440 కోట్లను ఏ విధంగా సద్వినియోగం చేయాలనే అంశంపై మార్గదర్శనం చేయడానికి గురువారం విశాఖపట్నం వచ్చిన ఆయన కర్మాగారంలో విలేకరులు, ఉద్యోగులు, కార్మికులతో వేర్వేరుగా మాట్లాడారు. ఉక్కు పరిశ్రమ నష్టాల్లో ఉన్నందున పెట్టుబడులు ఉపసంహరించాలని కేంద్ర కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. అటువంటి సంస్థకు ఆర్థికసాయం చేయాలని తాను బాధ్యతలు చేపట్టిన వెంటనే పలు బ్యాంకులను, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరితే నిర్మొహమాటంగా తిరస్కరించారని తెలిపారు. అయితే స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకూడదని ఏపీ ప్రభుత్వం తీర్మానం చేసి పంపిందని, అదేవిధంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ అనేకసార్లు ఢిల్లీకి వచ్చి ప్లాంట్‌కు ఆర్థిక సాయం చేయాలని కోరారని వివరించారు. ఈ విషయాన్ని ప్రధాని వద్ద ప్రస్తావించినప్పుడు ఆయన కొంత సానుకూలంగా మాట్లాడారని, దాంతో తాను మరోసారి ఆర్థికమంత్రిని కలిసి సంప్రదింపులు జరిపానని చెప్పారు. ఓసారి ఢిల్లీ వచ్చిన చంద్రబాబు తెల్లవారు జామున 1.30 గంటలకు ఆర్థికమంత్రి అపాయింట్‌మెంట్ ఇస్తే... ఓపికగా వేచి ఉండి ఆమెను కలిసి మాట్లాడారని గుర్తు చేసుకున్నారు. అంతటి చిత్తశుద్ధి చూపించబట్టే ఆర్థికప్యాకేజీ దక్కిందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను నిలబెడతామని హామీఇచ్చామని, దాన్ని నిలుపుకోవడానికి సహకరించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా కోరారని తెలిపారు. ఎంపీ శ్రీభరత్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు... ఇలా అందరూ కలిసి ఒత్తిడి తేవడం వల్లే ఇదంతా సాధ్యమైందని కుమారస్వామి పేర్కొన్నారు.



కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మలకు గాజువాకలో స్వాగతం పలుకుతున్న కూటమి పార్టీల శ్రేణులు, స్టీల్ ప్లాంటు ఉద్యోగులు, కార్మికులు

అంతా కలిసి పనిచేస్తే సాధ్యమే

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దేశంలో నంబర్‌వన్‌గా నిలపాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, దీనికి ఉద్యోగులు, కార్మికులు సహకరించాలని కేంద్ర మంత్రి కోరారు. వికసిత్ భారత్‌లో భాగంగా 2030 నాటికి 300 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేయాలని ప్రధాని మోదీ లక్ష్యం విధించారని, దానిని సాధించడానికి కార్మికులు, ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ప్రస్తుతం రెండు బ్లాస్ట్ ఫర్నేసుల ద్వారా 14వేల టన్నుల ఉత్పత్తి అవుతోందని, మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను కూడా ప్రారంభించి ఉత్పత్తిని 20వేల నుంచి 24వేల టన్నులకు పెంచాలని సూచించారు. ఆ లక్ష్యం సాధించగలిగితే ఏడాదిలోనే స్టీల్‌ప్లాంట్ లైన్‌లోకి వస్తుందని స్పష్టం చేశారు. రెండు, మూడు నెలలు ఆగితే ప్రతినెలా జీతం ఇచ్చేందుకు యత్నిస్తామని కార్మికులకు భరోసా ఇచ్చారు.

ఉక్కు మంత్రికి ఘనస్వాగతం

కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మకు విశాఖలో ఘనస్వాగతం లభించింది. విమానాశ్రయంలో ఎంపీలు సీఎం రమేశ్, శ్రీభరత్, అప్పలనాయుడు, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ స్వాగతం పలికారు. కాన్వాయ్‌లో వారంతా స్టీల్‌ప్లాంట్‌కు బయలుదేరగా దారి పొడవునా కూటమి నాయకులు, ఉద్యోగులు స్వాగతం పలికి, గజమాలతో సత్కరించారు.

ప్రైవేటీకరణ అంశం చరిత్రలోకి!

- కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలంటూ ఇంకా ఆందోళనలు చేస్తున్నారని, అపోహలు సృష్టిస్తున్నారని, దయచేసి వాటికి స్వస్తి పలకాలని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కోరారు. ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం చరిత్రలో కలిసిపోయినట్టేనని స్పష్టం చేశారు. కేంద్రం ఇంకా అదే ఆలోచనలో ఉంటే ప్లాంట్ పునర్నిర్మాణానికి ఆర్థిక ప్యాకేజీ ఎందుకు మంజూరు చేస్తుందో ఉద్యోగులు, కార్మికులు ఆలోచించాలని కోరారు. కొందరు పబ్బం గడుపుకోవడానికి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర నిధులు సద్వినియోగం చేసుకొని ప్లాంట్‌ను మళ్లీ లాభాల బాటలోకి తేవాలని శ్రీనివాసవర్మ కోరారు.

మంత్రుల కాన్వాయ్‌లో స్వల్ప ప్రమాదం..

కేంద్రమంత్రులు కుమారస్వామి, భూపతిరాజు శ్రీనివాసవర్మ విమానాశ్రయం నుంచి కర్మాగారానికి వెళుతుండగా షీలానగర్ వద్ద కాన్వాయ్‌లోని మూడు కార్లు ఒక దానికొకటి ఢీకొన్నాయి. విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు అధికారులతో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. కాన్వాయ్‌లో మొత్తం 8 వాహనాలు ఉండగా చివరి మూడు కార్లు ప్రమాదానికి గురయ్యాయని, కేంద్ర మంత్రులు క్షేమంగా ఉన్నారని, ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు సీఎంకు వివరించారు.

డిస్కమ్‌లను లాభాల బాట పట్టించడమెలా?

- ఐదు రాష్ట్రాల విద్యుత్ మంత్రులతో గొట్టిపాటి టెలికాన్ఫరెన్స్



అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర పథకాలైన సూర్యఘర్, పంప్డ్‌స్టోరేజీ జల విద్యుత్ ప్లాంట్, బ్యాటరీ స్టోరేజీ సామర్థ్యాన్ని వెయ్యి మెగావాట్ల నుంచి 2వేల మెగావాట్లకు పెంచడం, కేంద్రం మంజూరు చేస్తున్న సబ్సిడీలు సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా విద్యుత్ రంగంలోని నష్టాలను తగ్గిస్తూ.. లాభాల బాట పట్టించవచ్చని తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఏపీ విద్యుత్ మంత్రులు తీర్మానించారు. వెలగపూడి సచివాలయం నుంచి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఐదు రాష్ట్రాల విద్యుత్ మంత్రులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ స్థాయిలో డిస్కమ్‌లు ఆర్థికంగా తీవ్రనష్టాల్లో కూరుకుపోవడంపై ప్రధానంగా చర్చించారు. డిస్కమ్‌లకు రావాల్సిన మొండి బకాయిలను తగ్గించుకోవడం, రాష్ట్రాలు చెల్లించాల్సి బకాయిలు వెంటనే చెల్లించడమే ఉత్తమమార్గమన్న అభిప్రాయానికి వచ్చారు. పునరుత్పాదక విద్యుదుత్పత్తిని పెంచుకోవడం ద్వారా విద్యుత్ కొనుగోలు వ్యయాలను తగ్గించుకోచవ్చని మంత్రులు అభిప్రాయపడ్డారు.

భూముల కొత్త ధరలు

- రేపటి నుంచి అమల్లోకి

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ ధరలు పెరగనున్నాయి. కొత్త ధరలు శనివారం నుంచి అమల్లోకి వస్తాయి. రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా స్వల్పంగా పెరుగుతాయి. ఫిబ్రవరి 1 నుంచి భూముల ధరలు పెంచాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. వైసీపీ హయాంలో ఐదేళ్లలో మూడుసార్లు భూముల మార్కెట్ ధరలు పెంచారు. కొన్ని జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాల్లో కూడా 25-30 శాతం వరకు పెరిగాయి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో గరిష్ఠంగా 5నుంచి 10శాతం మాత్రమే ధరలు పెంచినట్టు రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు తెలిపారు. డిమాండ్ బాగా ఉన్న ప్రాంతాల్లో భూముల ధరలు 20 శాతం వరకు పెరిగే అవకాశమున్నట్టు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల శాఖకు ఆశించిన స్థాయిలో ఆదాయం రాలేదు. మార్కెట్ ధరలు పెంచడం వల్ల ఫిబ్రవరి, మార్చిల్లో ఆదాయం పుంజుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

సహోద్యోగిని ఫిర్యాదు..
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

- పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న యువకుడు
- చెల్లెలికి ఫోన్ చేసి సమాచారం



చౌటుప్పల్ రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏడాదిగా తనతో స్నేహంగా ఉంటున్న సహోద్యోగిని తాము పనిచేసే కంపెనీలో తనపై ఫిర్యాదు చేసిందనే ఆందోళనతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో జరిగిన ఈ ఘటనలో జగిత్యాలకు చెందిన పిప్పరి వినీత్(26) మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాలకు చెందిన పిప్పరి వినీత్(26), అతని చెల్లెలు సంయుక్త హైదరాబాద్ ఈస్ట్‌మారేడుపల్లిలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. అన్నాచెల్లెళ్లు ఇద్దరూ బేగంపేటలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. అదే సంస్థలో పని చేసే మరో యువతితో వినీత్‌కు ఏర్పడిన పరిచయం స్నేహంగా మారింది. ఏడాదిగా చాటింగ్ చేసుకుంటున్న వీరి ఒకరి కోసం మరొకరు తెలుసుకున్నారు. అయితే, ఇటీవల ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో సదరు యువతి సంస్థ హెచ్‌ఆర్‌కు వినీత్‌పై ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలిసి ఆందోళన చెందిన వినీత్ బుధవారం విధులు పూర్తి చేసిన తర్వాత తన ద్విచక్రవాహనంపై దండుమల్కాపురం శివారులోని ఓ పైపుల పరిశ్రమ దగ్గరికి వెళ్లాడు. రాత్రి 11గంటల సమయంలో చెల్లెలు సంయుక్తకు ఫోన్ చేసి .. సదరు యువతి అకారణంగా తనపై ఫిర్యాదు చేసిందని, ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పారు. తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోమని చెప్పి తన లోకేషన్ పంపి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. అనంతరం ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పుపెట్టుకున్నాడు. సంయుక్త తన బంధువులతో కలిసి ఆ ప్రాంతానికి చేరుకునే సరికి వినీత్ శరీరం పూర్తిగా కాలిపోయింది. వినీత్ తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కర్నూలుకు బెంచ్

(మొదటి పేజీ తరువాయి)

కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) వి శ్రీనివాస శివరాం ఈ నెల 29 లేఖ రాశారు. ఆ వివరాలతో నివేదికను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే కర్నూలులో బెంచ్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు ప్రజాగళం సభలో చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ హామీకి కట్టుబడి అధికారంలోకి రాగానే గత నవంబరులో అసెంబ్లీలో తీర్మానం చేశారు. బెంచ్ ఏర్పాటు కోసం తక్షణ చర్యలు మొదలుపెట్టాలని కోరుతూ, హైకోర్టుకు లేఖ రాశారు. ఈ క్రమంలోనే హైకోర్టు రిజిస్ట్రార్ తాజాగా లేఖ రాశారు. బెంచ్ ఏర్పాటుకి సంబంధించి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఏర్పాటు చేసిన కమిటీ ముందు ఉంచేందుకు ఆ నివేదికను అత్యవసరంగా పంపాలని ఆదేశించారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం.. రాయలసీమలో రాజధాని లేక హైకోర్టును పెట్టాలని మూడు ప్రాంతాల నాయకులు నాడు అంగీకరించారు. అప్పటినుంచీ కర్నూలుకు హైకోర్టును ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తోంది.



కర్నూలులోని జొహరాపురం డంపింగ్ యార్డు వద్ద ఖాళీగా ఉన్న భూమి. హైకోర్టు బెంచ్ శాశ్వత భవనం నిర్మాణానికి ఈ భూములను అధికారులు పరిశీలించారు.

భవనాల వేట..

కర్నూలులో హైకోర్టుబెంచ్ ఏర్పాటుచేస్తే దాదాపు 15 మంది న్యాయమూర్తులు ఇక్కడికి వచ్చే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కర్నూలు నగరంలో భవనాల వేటను గురువారం సాగించారు. కలెక్టరు ఆదేశాలతో కర్నూలు ఆర్డీవో, రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్లు, కార్పొరేషన్ అధికారులు సహా ఇతర అధికారులు పలు భవనాలు పరిశీలించారు. సదుపాయాల కల్పన కోసం ఖాళీ ప్రభుత్వ భూమి ఎక్కడ ఉందో గుర్తించి వివరాలు సమర్పించాలని ఆర్డీవోకు స్పష్టం చేశారు. తొలి ప్రాధాన్యంగా బీ క్యాంప్‌లో క్లస్టర్ వర్సిటీ నిధులతో నిర్మించిన 62 గదులు కలిగిన జీ+2 భవనం; రెండో ప్రాధాన్యంగా దిన్నెదేవరపాడులో నిర్మించిన విద్యుత్ నియంత్రణ మండలి భవనం, మూడో ప్రాధాన్యంగా కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి నన్నూరు టోల్‌ప్లాజా దగ్గర 35వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన జీ+3 ప్రైవేటు భవనాన్ని గుర్తించారు. వీటిలో టోల్ ప్లాజా వద్ద ఉన్న భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఇప్పటికే ఓ బ్యాంకు అద్దెకు ఉంది. విద్యుత్ నియంత్రణమండలి భవనం ఈఆర్‌సీ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారు. ఖాళీగా ఉన్న క్లస్టర్ యూనివర్సిటీ భవనం తక్షణమే తాత్కాలికంగా బెంచ్ ఏర్పాటుకు అనుకూలంగా ఉందని అంటున్నారు. అలాగే భవిషత్తులో శాశ్వత భవనాల నిర్మాణాల కోసం జగన్నాథగట్టుపై 26 ఎకరాలు, జొహరాపురం సమీపంలో 20 ఎకరాల నగరపాలక సంస్థ డంపింగ్ యార్డును పరిశీలించారు. డంపింగ్ యార్డు ఖాళీ స్థలంలో అయితే అందరికీ అందుబాటులో ఉంటుందని అంటున్నారు.

ప్రక్రియ మొదలైందిలా..

2014లో రాష్ట్ర విభజన తరువాత శ్రీబాగ్ ఒడంబడిక అమలు అంశం తిరిగి తెరపైకి వచ్చింది. అమరావతిని రాజధానిగా చేయడంతో.. కర్నూలులో హైకోర్టు పెట్టాలని న్యాయవాదులు, విద్యార్థులు ఉద్యమాలు చేశారు. 2019 ఎన్నికల ముందు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తానని నాటి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం 3రాజధానుల పేరిట సీమ ప్రజలను ఐదేళ్లపాటు మభ్యపెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రి మండలి తీర్మానం చేసింది. అనంతరం అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఈ నేపథ్యంలో కర్నూలులో బెంచ్ ఏర్పాటు ప్రతిపాదనపై అభిప్రాయాలను తెలియజేసే నిమిత్తం ఫుల్ కోర్ట్ ముందు ఈ వ్యవహారాన్ని ఉంచాలని విజ్ఞప్తి చేస్తూ న్యాయశాఖ కార్యదర్శి గత అక్టోబరు 28న హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాశారు. దీనిపై సీనియర్ న్యాయమూర్తులతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ కమిటీ ఏర్పాటు చేశారు. న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ ఎస్.జయసూర్య, జస్టిస్ బి.కృష్ణమోహన్ ఈ కమిటీలో ఉన్నారు.

విశాఖ భూస్కామ్‌పై విచారణ ఏమైంది?

(మొదటి పేజీ తరువాయి)

అస్మదీయ అధికారులను ఏరికోరి విశాఖలో నియమించారు. ఉత్తరాంధ్ర వైసీపీలో పెద్దాయనగా చలామణి అయిన నేత, నాటి సీఎం జగన్‌కు దగ్గరి బంధువు, వైసీపీలో కీలక ప్రజాప్రతినిధి, ఆనాటి ప్రభుత్వంలో అత్యంత ప్రధాన అధికారి పోస్టును నిర్వహించిన సీనియర్ ఐఏఎస్, జగన్ వద్ద పని చేసిన మరో కీలక అధికారి కలిసి విశాఖ, భీమిలీ, వాటి పక్కనే ఉన్న భోగాపురంలో భారీగా అసైన్డ్, ఇనాం భూములు కొన్నారు. విశాఖ, భీమిలి, యండాడ, పరవాడ తదితర ప్రాంతాలను వైసీపీ పెద్దాయన చెరపట్టారు. కంటికి కనిపించిన భూములు చేజిక్కించుకున్నారు. నాటి ప్రభుత్వంలో ప్రధాన అధికారిగా పనిచేసిన ఓ సీనియర్ ఐఏఎస్, ఆయన వారసుడు ఈ భూపందేరం నిర్వహించారు. రాత్రికి రాత్రే అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయించడం, తెల్లారేసరికి ఆ భూములను చేజిక్కించుకోవడమే పనిగా ఆ అధికారి వారసుడు, మేనల్లుడు భూయజ్ఞం నిర్వహించారు. జగన్ దగ్గరి బంధువు, కీలక ప్రజాప్రతినిధి వారసుడు విశాఖలోని విలువైన ఇనాం, అసైన్డ్ భూములను చేజిక్కించుకున్నారు. బలవంతపు సెటిల్‌మెంట్లు కూడా చేశారు. వైసీపీ నేతల భూ దోపిడీపై నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన పెద్ద పోరాటమే చేశాయి. విశాఖను కాపాడాలని ఉద్యమాలు చేశాయి. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు 'సేవ్ విశాఖ' నినాదం చేశారు. తాము అధికారంలోకి వస్తే భూములు కాపాడుతామని ప్రకటించారు. వైసీపీ అరాచకాలపై విసిగిపోయిన ప్రజలు కూటమికి పట్టం కట్టారు. అధికారంలోకి రాగానే మదనపల్లెలో జరిగిన ఫైళ్ల 'దహనం'తో ఉలిక్కిపడిన సర్కారు అసైన్డ్, ఇనాం, షరతుగల పట్టా భూముల ఫ్రీహోల్డ్‌పై విచారణకు ఆదేశించింది. దీంతో... సహజంగానే విశాఖలో జగన్ జమానాలో జరిగిన భూముల అక్రమాలు బయటకొస్తాయని అంతా అనుకున్నారు.

సీన్ రివర్స్....

రాష్ట్రవ్యాప్తంగా అసైన్డ్, ఇనాం భూముల్లో అక్రమాలను గుర్తించేందుకు... డిప్యూటీ కలెక్టర్ ర్యాంకు అధికారులతో విచారణ కమిటీలు ఏర్పాటు చేయించి, అనుమానాలు ఉన్న ప్రతి మండలంలో భూమి రికార్డుల పునఃపరిశీలన చేయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల ఎకరాల భూముల రికార్డులను పరిశీలించగా... అందులో 5.65 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేయడంలో అక్రమాలు జరిగాయని లెక్కతేలింది. చిత్రంగా... విశాఖలో మాత్రం ఎలాంటి అక్రమం జరగలేదని తేల్చారు. సెంటు భూమి కూడా పరాధీనం కాలేదని గత అక్టోబరులో అధికారులు నివేదిక ఇచ్చారు. దీనిపై 'విశాఖలో అక్రమాలే లేవట' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో ఉలిక్కిపడ్డ ప్రభుత్వం మరోసారి పరిశీలనకు ఆదేశించింది. డిసెంబరులో అధికారులు రెండో దఫా విచారణ జరిపారు. మరీ ఏం జరగలేదంటే ఏమైనా అనుకుంటారని కాబోలు... ఓ 64 ఎకరాలను జీవో 596కి విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ చేశారని తేల్చారు. అయితే ఆ భూమి పదిలంగానే ఉందని, ఎలాంటి రిజిస్ట్రేషన్‌లు జరగలేదని నివేదించారు. రాష్ట్రంలో ఎక్కడా అనుమానాలు, ఆరోపణలు లేనిచోట పరిశీలన జరిపితేనే వేలాది ఎకరాలు చేతులు మారినట్లుగా తేలింది. అలాంటిది... విశాఖ జిల్లాలో ఏ అక్రమం లేదని తేల్చడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. విశాఖ భూ దందాలో ఉత్తరాంధ్ర వైసీపీ పెద్దనేత, జగన్ దగ్గరి బంధువైన ప్రజాప్రతినిధి, ఆయన వారసుడితోపాటు... నాడు జగన్ ప్రభుత్వంలో కీలక హోదాలో పనిచేసిన సీనియర్ ఐఏఎస్, ఆయన వారసుడు, మేనల్లుడు, జగన్ వద్ద పనిచేసిన మరో కీలక అధికారి పాత్ర సుస్పష్టం. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖ రాజధాని అవుతుందన్న నమ్మకంతో తాము పోగేసిన అక్రమ సంపాదనను భూములపై ఖర్చు పెట్టారు. కానీ... వారు అనుకున్నదొకటి, అయ్యిందొకటి! కూటమి ప్రభుత్వ విచారణలో ఈ విషయాలు బయటకు రావడం ఆ నేతలకు, అధికారులకు ఇష్టం లేదు. అప్పుడు వైసీపీ పెద్దాయనతో అంటకాగి... అక్రమాలకు పాల్పడిన అధికారులను కాపాడేందుకు కొందరు సీనియర్లు రంగంలోకి దిగారని... వారివల్లే భూస్కామ్‌పై విచారణ అటకెక్కిందనే ప్రచారం జరుగుతోంది. భూమి రికార్డుల పరిశీలన, విచారణ బృందాల్లో అంతా సొంత మనుషులే ఉండేలా జాగ్రత్త తీసుకుని అక్రమాలకు సమాధికట్టినట్లు తెలుస్తోంది. కూటమి సర్కారు సీరియస్‌గా తీసుకుని... ఒకటికి రెండుసార్లు విచారణ జరిపించినా ఇదీ పరిస్థితి!

కొత్త డయాఫ్రమ్ వాల్ ఖర్చు 990 కోట్లు

- జల వనరుల శాఖ ఆమోదం
- పెరిగిన భారం రూ.596 కోట్లు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్తగా 63,656 మీటర్ల మేర సమాంతర డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించేందుకు రూ.990 కోట్ల వ్యయం అవుతుందని ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరు నరసింహమూర్తి సమర్పించిన అంచనాకు రాష్ట్ర జల వనరుల శాఖ ఆమోదం తెలిపింది. గతంలో నిర్మించిన డయాఫ్రమ్‌వాల్‌కు రూ.446 కోట్ల వ్యయం అయ్యింది. అయితే 2020లో వరదలకు ఇది దెబ్బతినడంతో 29,585 మీటర్ల మేర మరమ్మతులు చేసేందుకు గానూ రూ.393.32 కోట్లకు డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానెల్ ఆమోదించింది. ఆ తర్వాత డయాఫ్రమ్ వాల్ నిర్మాణంపై ఎడతెగని సమీక్షలు జరిగాయి. కేంద్ర జలసంఘం అంతర్జాతీయ నిపుణుల బృందాన్ని నియమించింది. సమగ్ర అధ్యయనం తర్వాత పాతదానికి సమాంతరంగా కొత్తవాల్‌ను నిర్మించాలని ఈ బృందం స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని కేంద్ర జలసంఘానికి సిఫారసు చేసింది. పాత డయాఫ్రమ్‌వాల్ మరమ్మతుకు రూ.393.32 కోట్ల వ్యయం అవుతుందని అంచనావేయగా.. టీ-16 ప్లాస్టిక్ కాంక్రీట్ విశ్రమం వాడటం ద్వారా 63,656 మీటర్ల మేర సమాంతర కొత్త డయాఫ్రమ్‌వాల్ వేసేందుకు రూ.990కోట్లు వ్యయం అవుతుందని వెల్లడించారు. ఈ వ్యయానికి కేంద్ర జలశక్తి శాఖ, సీడబ్ల్యూసీ సూత్రప్రాయ ఆమోదం ఉంది. దీంతో అంచనా వ్యయంతో కొత్త డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మిస్తున్నట్లుగా కేంద్రానికి వివరిస్తూ.. అధికారికంగా ఆమోదం తీసుకోవాలని పోలవరం ఇంజనీరింగ్ అధికారులకు ప్రభుత్వం సూచించింది.



పోలవరం ప్రాజెక్టు పాత డయాఫ్రంవాల్

రేపు పరిశీలనకు అంతర్జాతీయ నిపుణులు

కొత్త డయాఫ్రమ్‌వాల్ పనులను పరిశీలించేందుకు అంతర్జాతీయ నిపుణుల బృందంలోని అమెరికాకు చెందిన డియాన్ ఫ్రాన్‌కో డి కికో, డేవిడ్ బి పాల్ శనివారం పోలవరానికి రానున్నారు. అలాగే కెనడాకు చెందిన మరో ఇద్దరు నిపుణులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంప్రదింపులు జరుపుతారని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar**, RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.